## చంద్రబాబు ప్రెస్ మీట్ బాధను కలిగించింది: జగన్

మొదటి పేజి తరువాయి

కంపెనీ ప్రమాద బాధితులను వైసీపీ అధినేత జగన్ పరామర్శించారు. ఈ ఉదయం అనకాపల్లికి వెళ్లిన జగన్... ఉషా ప్రైమ్ ఆసుపత్రిలో చికిత్స పొందు తున్న క్షతగాత్రులతో మాట్లాడారు. వాళ్ల ఆరోగ్య పరిస్థితి ఎలా ఉందో వైద్యులను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లకు సూచించారు. అనంతరం మీడియాతో జగన్ మాట్లాడుతూ... అచ్యుతాపురం ఘటన బాధాకరమని చెప్పారు. ఫార్మా కంపెనీలో పట్టపగలు ప్రమాదం జరిగినా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిందని విమర్శించారు. కార్మికశాఖ మంత్రి దగ్గర కూడా వివరాలు లేవని అన్నారు. ప్రమాదంలో ఎంత మంది చనిపోయారో తెలియదని చెప్పారు. బాధితులకు, మృతుల కుటుంబాలకు పరిహారాన్ని వెంటనే ఇవ్వాలని జగన్ డిమాండ్ చేశారు. పరిహారం ఇవ్వకపోతే తానే వచ్చి స్వయంగా ధర్నా చేస్తానని హెచ్చరించారు. బాధితులకు తాను అండగా ఉంటానని చెప్పారు. సీఎం చంద్రబాబు ప్రెస్ మీట్ తనకు బాధను కలిగించిందని జగన్ అన్నారు. ఇష్యూని డైవర్ట్ చేయడానికి చంద్రబాబు ప్రయత్నించారని విమర్శించారు. పరిశ్రమలపై ప్రభుత్వం పర్యవేక్షణ చేసి ఉంటే ఈ ప్రమాదం జరిగేది కాదని చెప్పారు. వీరి దృష్టి మొత్తం రెడ్ బుక్ పైనే ఉందని అన్నారు. రాజకీయ కక్షలు తీర్చుకోవడానికే ఈ ప్రభుత్వం ప్రాధాన్యతను ఇస్తోందని చెప్పారు.

## చంద్రబాబు నుంచి నేర్చుకోవడానికి నేను ఎప్పుడూ సిద్ధమే

మొదటి పేజి తరువాయి

రాష్ట్రాన్ని అప్పుల బారి నుంచి తప్పించేందుకు, సంపద సృష్టించేందుకు చంద్రబాబు అనుభవం అవసరమని చెప్పారు. చంద్రబాబు నుంచి నేర్చుకోవడానికి తాను ఎప్పుడూ సిద్ధమేనని అన్నారు. పంచాయతీలకు ప్రభుత్వ పరంగా ఆస్తులు లేకపోతే వ్యర్థమని పవన్ చెప్పారు. ప్రతి పంచాయతీకి సొంత భూమి ఉండాలని అన్నారు. ప్రభుత్వ భూములను కబ్జా చేస్తే ఊరుకోబోమని... అవసరమైతే గూండా యాక్ట్ తెస్తామని చెప్పారు. గ్రామాల్లో క్రీడా మైదానాలు కూడా లేని దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ భూములు ఉంటే నిర్మాణాలు చేసుకోవచ్చని చెప్పారు. దాతలు ముందుకు రావాలని... తాను కూడా నిధులు తీసుకొచ్చి క్రీడా మైదానాలను ఏర్పాటు చేయిస్తానని తెలిపారు. అద్భుతాలు చేయడానికి చేతిలో మంత్రదండం లేదని... కానీ, గుండెల నిండా నిబద్ధత ఉందని పవన్ అన్నారు. అప్పుల్లో ఉన్న రాష్ట్రాన్ని గట్టెక్కించే సత్తా చంద్రబాబుకు మాత్రమే ఉందని చెప్పారు. ఎంతో పరిపాలన అనుభవం ఉన్న చంద్రబాబు నుంచి నేర్చుకోవాలనే తపన తనకుందని అన్నారు. ప్రజల కోసం కూలీగా పని చేసేందుకు సిద్ధమని చెప్పారు. వైసీపీ పాలనలో పంచాయతీ వ్యవస్థ పూర్తిగా నిర్వీర్యమైందని పవన్ విమర్శించారు. 75 శాతం గ్రామాల్లో వైసీపీకి చెందిన సర్పంచ్ లే ఉన్నారని చెప్పారు. రాజకీయాలకు అతీతంగా రాష్ట్ర అభివృద్ధి కోసం అందరూ పని చేయాలని సూచించారు. పంచాయతీ వ్యవస్థ దేశానికి వెన్నెముక అని చెప్పారు. పదవులు తనకు అలంకరణ కాదని... బాధ్యత అని అన్నారు.

## టాప్ 5 సీఎంల జాబితాలో చంద్రబాబు

మొదటి పేజి తరువాయి

'మూడ్ ఆఫ్ ది నేషన్' పేరుతో 'ఇండియా టుడే - సీ ఓటర్' దేశ వ్యాప్తంగా నిర్వహించిన సర్వేలో ఈ విషయం వెల్లడైంది. ఈ జాబితాలో తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ నాలుగో స్థానంలో నిలిచారు. ఏపీ సీఎం చంద్రబాబు ఐదో స్థానంలో ఉన్నారు. అత్యంత జనాదరణ పొందిన సీఎంగా ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ తొలి స్థానంలో నిలిచారు. రెండో స్థానంలో ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్, మూడో స్థానంలో పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఉన్నారు. సీఎంగా బాధ్యతలను చేపట్టిన రెండు నెలల సమయంలోనే టాప్ 5 ముఖ్యమంత్రుల జాబితాలోకి చంద్రబాబు రావడం విశేషం.

## యోగి ప్రభుత్వం కీలక ఆదేశాలు.. ఈ నెల జీతాలు

## కోల్పోయే ప్రమాదంలో 13 లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగులు!

ఢిల్లీ: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, అధికారులు ఆగస్టు 31 లోపు తమ చర, స్థిరాస్తులను ప్రకటించాలని ఉత్తరప్రదేశ్‌లోని యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వం ఆదేశించింది. లేని పక్షంలో వారికి ఈ నెల జీతాలను నిలిపివేస్తామని హెచ్చరించింది. దీంతో ఇప్పటివరకు ప్రభుత్వ పోర్టల్ మానవ్ సంపదలో 17.8 లక్షల మంది ఉద్యోగులలో కేవలం 26 శాతం మంది మాత్రమే తమ ఆస్తులను ప్రకటించారు. మిగిలిన దాదాపు 13 లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగులు.. ప్రభుత్వ ఆదేశాలను పాటించకపోతే ఈ నెలలో వారి జీతాలను కోల్పోయే ప్రమాదం ఉందని నివేదికలు చెబుతున్నాయి.

ఈ ఉత్తర్వులు అందరికీ వర్తిస్తాయన్న సీఎస్

యూపీ చీఫ్ సెక్రటరీ మనోజ్ కుమార్ సింగ్ ఈ ఉత్తర్వును ప్రభుత్వ ఉద్యోగులందరూ కచ్చితంగా పాటించాల్సిందేనని అన్నారు. గడువులోపు తమ ఆస్తుల వివరాలను సమర్పించిన ఉద్యోగులకు మాత్రమే వారి జీతాలు పంపిణీ చేస్తామన్నారు. ఈ నిబంధన అన్ని వర్గాల అధికారులు, ఉద్యోగులకు వర్తిస్తుందని తెలిపారు. తమ ఆస్తులను ప్రకటించని వారు ప్రమోషన్లకు అనర్హులుగా మారే అవకాశం ఉందని ఈ సందర్భంగా ఉన్నతాధికారులు పేర్కొన్నారు. "ఈ చర్య ప్రభుత్వంలో పారదర్శకత, జవాబుదారీతనాన్ని పెంపొందించడమే లక్ష్యంగా పెట్టుకుంది. సీఎం యోగి ఆదిత్యనాథ్, ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో అవినీతి పట్ల మేము జీరో-టాలరెన్స్ పాలసీని కలిగి ఉన్నాం" అని యూపీ మంత్రి డానిశ్ ఆజాద్ అన్సారీ ఎన్‌డీటీవీతో అన్నారు.

## జెలెన్ స్కీ భుజంపై చెయ్యేసి... ఉక్రెయిన్ రాజధానిలో మోదీ పర్యటన

మొదటి పేజి తరువాయి

ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలోదిమిర్ జెలెన్ స్కీతో కలిసి రాజధాని కీవ్ లో వివిధ ప్రాంతాలను సందర్శించారు. రష్యా దాడుల్లో మరణించిన ఉక్రెయిన్ ప్రజల స్మారక చిహ్నం వద్ద జెలెన్ స్కీతో కలిసి నివాళులు అర్పించారు. తన పర్యటన సందర్భంగా మోదీ... జెలెన్ స్కీని ఆప్యాయంగా హత్తుకున్నారు. యుద్ధంలో జరిగిన నష్టం తాలూకు ఛాయాచిత్ర ప్రదర్శనను తిలకించి, బాధను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జెలెన్ స్కీ భుజంపై ఆత్మీయంగా చెయ్యేసి, తామున్నామన్న భరోసా ఇచ్చేందుకు ప్రయత్నించారు. దీనికి సంబంధించి మోదీ ట్వీట్ చేశారు. ఈ యుద్ధం పిల్లల పాలిట వినాశకరం అని పేర్కొన్నారు. ప్రాణాలు కోల్పోయిన చిన్నారుల కుటుంబాల పరిస్థితిని తలచుకుంటే హృదయం ద్రవించి పోతోందని వివరించారు. ఈ కష్టాలను అధిగమించే ధైర్యం వారికి చేకూరాలని ప్రార్థిస్తున్నానని తెలిపారు.

## నా ఇల్లు అక్రమమైతే కూల్చేయండి...
## హైడ్రా కమిషనర్‌ను ఆదేశిస్తున్నా!

మొదటి పేజి తరువాయి

ఎఫ్‌టీఎల్ పరిధిలో తనకు ఫామ్ హౌస్ ఉందని బీఆర్ఎస్ మీడియా బురద జల్లుతోందని, తన ఇల్లు అక్రమంగా ఉంటే... వెంటనే కూల్చివేయాలని హైడ్రా కమిషనర్‌ను ఆదేశిస్తున్నానని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. అధికారులకు బదులు బీఆర్ఎస్ వాళ్లే వెళ్లి కొలవాలని, అక్రమమని తేలితే కూల్చేసుకోండని కేటీఆర్, హరీశ్ రావులకు సవాల్ విసిరారు. హైడ్రాను తాము ఓ మంచి ఉద్దేశంతో తెచ్చామన్నారు. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ పరిధిలోని నిర్మాణాలను అనుమతించేది లేదన్నారు. అలాంటి కట్టడాలను కూల్చివేస్తున్నామన్నారు. అవన్నీ గత ప్రభుత్వం హయాంలో జరిగిన నిర్మాణాలేనని విమర్శించారు. ఆయన శుక్రవారం గాంధీ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడారు.

**100 రోజుల్లో 5 గ్యారెంటీలను అమలు చేశాం!**

ప్రభుత్వం ఏర్పాటైన 100 రోజుల్లోనే ఐదు గ్యారెంటీలను అమలు చేశామని మంత్రి అన్నారు. గత ప్రభుత్వం రూ.7 లక్షల కోట్ల అప్పులు చేసిందని, అయినప్పటికీ తాము హామీలు నెరవేర్చామన్నారు. ధనిక రాష్ట్రమని చెప్పి కేసీఆర్ ప్రజలను మోసం చేశారని మండిపడ్డారు. తాము ఇతర ఖర్చులను తగ్గించుకొని రుణమాఫీ చేశామన్నారు. 22 లక్షల మంది రైతులకు రూ.2 లక్షల వరకు మాఫీ చేశామన్నారు. రైతుల ఖాతాల్లో ఇప్పటికే రూ.18 వేల కోట్లు జమ అయ్యాయని, మిగిలిన రైతుల ఖాతాల్లోను మరో రూ.12 వేల కోట్లు త్వరలో వేస్తామన్నారు. కేసీఆర్ ప్రభుత్వంలా తాము మోసం చేయడం లేదన్నారు. రుణమాఫీ విషయంలో గత ప్రభుత్వం రైతులను రెండుసార్లు మోసం చేసిందని మండిపడ్డారు. ఎన్నికలకు ముందు కూడా కొందరికే రుణమాఫీ చేశారన్నారు. ప్రచారం కోసం గత ప్రభుత్వంలా వేల కోట్ల రూపాయలను వృథా చేయడం లేదన్నారు. ఉచిత విద్యుత్ కోసం 42 లక్షల దరఖాస్తులు మాత్రమే సక్రమంగా ఉన్నట్లు గుర్తించామన్నారు. తప్పులను సవరించి మరో 7 లక్షల మందికి పైగా ఉచిత విద్యుత్ వర్తింప చేస్తున్నామన్నారు. ఉచిత విద్యుత్, రూ.500కే గ్యాస్ రాయితీ లబ్ధిదారుల సంఖ్య నిత్యం పెరుగుతోందన్నారు.

## ఏపీలో మరో 6 పథకాల పేర్లు మార్పు

అమరావతి : ఏపీలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పలు ప్రభుత్వ పథకాల పేర్లను మారుస్తోంది. గత వైసీపీ ప్రభుత్వంలోని పథకాల పేర్లను తొలగించి కొత్త పేర్లను పెడుతోంది. తాజాగా మరో ఆరు పథకాల పేర్లను మార్చింది. ఈ పథకాలన్నీ పాఠశాల విద్యాశాఖ అమలు చేస్తున్న పథకాలే. ఆరు పథకాల పేర్లను మారుస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

**పేర్లు మారిన పథకాలు ఇవే:**

పాఠశాలల్లో నాడు - నేడు కార్యక్రమం 'మన బడి - మన భవిష్యత్' గా మార్పు ,అమ్మఒడి పథకం పేరు 'తల్లికి వందనం'గా మార్పు గోరుముద్ద పథకం పేరు 'డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజనం'గా మార్పు,జగనన్న ఆణిముత్యాలు పథకానికి 'అబ్దుల్ కలామ్ ప్రతిభా పురస్కారం'గా నామకరణం,స్వేచ్ఛ పథకానికి 'బాలికా రక్ష'గా పేరు మార్పు,విద్యాకానుక పథకానికి 'సర్వేపల్లి రాధాకృష్ణన్ మిత్ర'గా పేరు మార్పు

# ఏపీలో ఇవి ఇండస్ట్రీయల్ పాలిటిక్స్...?

మొదటి పేజి తరువాయి

ఈ ఘటనలో దారుణంగా గాయపడి ఆసుపత్రిలో చేరిన వారిని పరామర్శించిన చంద్రబాబు.. వ్యవస్థలను నాశనం చేశారంటూ.. వైసీపీ పై విమర్శలు చేశారు. అంతేకాదు.. పారిశ్రామిక సేఫ్టీ విషయంలో వైసీపీ ప్రభుత్వం సరిగా వ్యవహరించలేదని కూడా దుయ్యబట్టారు. అయితే.. ఇదేసమయంలో వైసీపీ నాయకులు కూడా రంగం లోకిదిగారు. విశాఖ పట్నం కేజీహెచ్ ఆసుపత్రి లో పర్యటించి బాధితులను పరామ ర్శించారు. ఇది పూర్తిగా కూటమి సర్కారు వైఫల్యం అంటూ.. సీనియర్ నాయకుడు బొత్స సత్యనారాయణ వ్యాఖ్యానించారు. ఇది రాజకీయ దుమారానికి దారి తీసింది. ఇక, మరోవైపు.. టీడీపీ అధికారిక ఎక్స్ లోనూ..వైసీపీని విమర్శిస్తూ.. పెద్ద ఎత్తున పోస్టు పెట్టారు. వ్యవస్థలను నాశనం చేసిన జగన్ కార ణంగా.. అచ్యుతాపురం సెజ్ ఘటన జరి గిందని పేర్కొ న్నారు. థర్డ్ పార్టీ సేఫ్టీ మెజర్ తీసుకోక పోవడంతో పాటు.. పారిశ్రామిక వేత్తలతో రాజీ పడిన కారణంగానే.. ఇప్పుడు ఇలాంటి ఘటన చోటు చేసుకుందన్న విమర్శలు గుప్పించారు. దీంతో ఇది రాజకీయ దుమారానికి దారి తీసింది. ఈ రెండు కోణాలను పరిశీలిస్తే.. అసలు వాస్తవం.. ఏంటనేది.. డిప్యూటీ సీఎం పవన్ చెప్పిన వ్యాఖ్యల్లో స్పష్టంగా కనిపించింది. రాజకీయ ఒత్తిళ్లు.. పారిశ్రామిక వేత్తలు ఎక్కడ వెళ్లిపోతారోనన్న భయంతోనే.. ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని అందుకే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని ఆయన చెప్పారు. ఇదీ.. అసలు వాస్తవం. పరిశ్రమలు తీసుకురావడం లేదని, ఉన్న పరిశ్రమలను వెళ్లిపోయేలా చేస్తున్నా రని.. గతంలో వైసీపీ సర్కారుపై టీడీపీ నాయకులు విమర్శలు చేశారు. కానీ, వాస్తవం ఏంటి? అనేది చూస్తే.. ఇలాంటి మెజర్ మెంట్స్ పాటించాలని కంపెనీలపై ఒత్తిడి తీసుకువచ్చినందునే ఆయా కంపెనీలు వెళ్లిపోయాయి. ఓ ప్రముఖ బ్యాటరీల కంపెనీలో కార్మికులకు భద్రత లేకుండా పోయిందని... బ్యాటరీల్లో వస్తున్న రసాయనాలను పీల్చి కార్మికుల ఆరోగ్యం దెబ్బ తింటోందని హెచ్చరించినందుకు.. సదరు కంపెనీ వేరే రాష్ట్రానికి వెళ్లిపోయింది. ఇక, తాజాగా అచ్యుతాపురం సెజ్‌లో కూడా.. కూటమి సర్కారు వచ్చిన తర్వాత.. ఘటన జరిగిన రోజే.. సేఫ్టీ తనిఖీలు జరిగాయి. అంతా బాగుందని సర్టిఫికెట్ ఇచ్చేందుకు అధికారులు సిద్ధమై..




అక్కడ నుంచి వెళ్లి పోయాక.. గంటలోనే ఈ ఘోర ప్రమాదం ది. సంభవించింఅంటే.. అటు వైసీపీ అయినా.. ఇటు కూటమి ప్రభుత్వమైనా.. చేసిన తప్పులు లేవు. ఇవి.. యాజమాన్యాల లోపం. వీటిని సరిదిద్దే ప్రయత్నం చేస్తే.. పవన్ చెప్పినట్టు ఎక్కడ పారిపోతాయో.. అన్న బెంగ సర్కార్లను వేధిస్తోంది. ఇంతకుమించి.. ఇక్కడ ఏమీలేదు. కానీ, పరిశ్రమ ప్రమాదాలు కూడా రాజకీయంగా ఆయుధాలు అయ్యాయి అంతే!!

# రైతులు రాజును చేయడమే ఏకైక లక్ష్యం

మొదటి పేజి తరువాయి

రూ.7 లక్షల కోట్ల అప్పులు ఉన్నప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన 100 రోజుల్లోనే 5 గ్యారెంటీలు అమలు చేసిందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శుక్రవారం గాంధీ భవన్ లో మీడియాతో ఆయన మాట్లాడారు. మేము బాధ్యతలు చేపట్టేనాటికి రాష్ట్ర ప్రభుత్వ అప్పు రూ.7.19 లక్షల కోట్లు ఉందన్నారు. ఇంత అప్పు భారం ఉన్నప్పటికీ వీటిని కుంటిసాకులుగా చూపి ఇచ్చిన హామీల విషయంలో వెనుకడుగు వేయబోమన్నారు. రైతులకు రుణమాఫీనే ఇందుకు ఉదాహరణ అన్నారు. దుబార ఖర్చులన్నింటిని దూరంగా పెట్టి రైతులు రాజును చేయడమే ఏకైక లక్ష్యంగా 26 రోజుల్లో సుమారు రూ.18 వేల కోట్లతో 22 లక్షలకు పైగా రైతులకు రుణమాఫీ చేశామన్నారు. రుణమాఫీ మొత్తానికి రూ.31 వేల కోట్ల పైచిలుకు ఖర్చు వస్తుందని ముందే మేము ఊహించామని దానికి తగ్గ ఏర్పాట్లు చేసుకున్నామన్నారు. ఇంకా సుమారు రూ.12 వేల కోట్లు రైతుల ఖాతాల్లో వేయాల్సి ఉందని త్వరలోనే వాటిని జమ చేస్తామన్నారు. బీఆర్ఎస్ మాదిరిగా శనగలు తిని చేతులు దులుపు కున్నట్లుగా రూ.18 వేల కోట్ల రుణమాఫీ చేసి టాటా బైబై అని మేము చెప్పడం లేదన్నారు. దేశంలో ఏ రాష్ట్రం కూడా చేయని విధంగా రుణమాఫీ చేశామన్నారు. రూ.20 వేల కోట్లు రావాల్సిన ఓఆర్ఆర్ ను బీఆర్ఎస్ స్వార్థం కోసం తాకట్టు పెట్టి రూ.7 వేల కోట్లకు తాకట్టు పెట్టి రైతుల ఎన్నికల సమయంలో రైతుల మీద




ప్రేమ ఉన్నట్లుగా రుణమాఫీకి బదలాయించారని ఆరోపించారు.

కేటీఆర్ నీ సలహాకు థాంక్స్:

రుణమాఫీ విషయంలో మంత్రులకే సమన్వయం లేదని కేటీఆర్ చేసిన వ్యాఖ్యలకు పొంగులేటి కౌంటర్ ఇచ్చారు. మా కేబినెట్ కు ఎంత స్వేచ్ఛాయుత వాతావరణం, ఏ రకమైన అధికారాలు ఉన్నాయో మాకు తెలుసన్నారు. మీ సూచన ఇచ్చినందుకు థాంక్స్ అంటూ సెటైర్ వేశారు. నిజమే మా కేబినెట్ కు మీకు లా అబద్ధాలు చెప్పుకోవడం, గోబెల్స్ ప్రచారం చేసుకోవడం రాదన్నారు. చేసిన మంచి పనిని కూడా మేం ప్రచారం చేసుకోవడం లేదని, గత ప్రభుత్వం వలే ప్రభుత్వ సొమ్ముతో వేలాది కోట్ల రుపాయలను పబ్లిసిటీకి ఉపయోగించుకోవడం లేదన్నారు. భవిష్యత్ లోనూ వాడుకోబోమన్నారు. మీకులా మాటలు చెప్పబోమని, చేతనైతే చేస్తామని చెయని పక్షంలో అంతే ధైర్యంగా చేయలేకపోతున్నామని చెబుతామన్నారు.

త్వరలోనే ఆ రైతులకు కటాఫ్ తేదీ:

రుణమాఫీ చేయకపోతే వదలమని అంటున్న బీఆర్ఎస్ కు నైతిక హక్కు ఎక్కడిదన్నారు. పదేళ్లు పరిపాలించి కేవలం రూ.17 వేల కోట్లు మాత్రమే రుణమాఫీ చేసిన మీ మొహాలకు పదినెలలు కూడా కానీ ఈ ప్రభుత్వంపై విమర్శలు చేసే నైతిక హక్కు ఎక్కడిదన్నారు. అర్హులైన ప్రతి రైతుకు రూ. 2 లక్షల రుణమాఫీ చేసే బాధ్యత ఈ ప్రభుత్వానిదని రైతులకు తెలియజేస్తున్నానన్నారు. గత ప్రభుత్వంలా మాయమాటలు చెప్పడం లేదన్నారు. అవాక్కులు చెవాక్కులు పేలే, రెచ్చగొట్టే బీఆర్ఎస్ నాయకుల మాటలను రైతులు నమ్మొద్దన్నారు. రెండు లక్షలకు పైగా రుణం ఉన్న వారు పై మొత్తాని కట్టాలని ముందుగానే నిర్ణయ తీసుకున్నామని కొంత మంది ఆ పై సొమ్మును చెల్లించని కారణంగా వారికి రూ.2 లక్షల నగదు జమ కావడం లేదన్నారు. రాబోయే కొద్ది రోజుల్లోనే రైతులకు ఒక కటాఫ్ తేదీని పెడతామన్నారు. వారు మిగిలిన డబ్బులు కట్టిన మరుక్షణమే వారి రూ.2 నట్లుగా రూ.31 వేల లక్షల రుణం మాఫీ చేస్తామన్నారు. అప్పుడు అనుకున్నోట్ల అంఖ్యలు వస్తాయన్నారు. దీనికంటే మరో 15 వదల కోట్లు అదనంగా అయినా అర్హులైన వారందరికీ రేవంత్ రెడ్డి ప్రభుత్వం రుణమాఫీ చేయడానికి సిద్ధంగా ఉందన్నారు. ఉచిత కరెంట్, గ్యాస్ రాయితీ లబ్ధిదారుల సంఖ్య నిరంతరం ప్రక్రియ అన్నారు.

# సీఎం రేవంత్ రెడ్డికి హరీశ్ రావు బహిరంగ లేఖ

హైదరాబాద్ : తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బీఆర్ఎస్ సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు శుక్రవారం బహిరంగ లేఖ రాశారు. ప్రభుత్వ పశు వైద్యశాలల్లో మందులు లేని పరిస్థితి నెలకొందన్నారు. వ్యవసాయానికి దన్నుగా, పాడిసంపదతో అదనపు ఆదాయాన్ని సమకూర్చే మూగజీవాల సంరక్షణ పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని లేఖలో విమర్శలు గుప్పించారు. పశుసంవర్ధక శాఖ ముఖ్యమంత్రి వద్దే ఉందని గుర్తు చేశారు. ప్రభుత్వ పశు వైద్యశాలల్లో మందుల కొరత, 1962 పశువైద్య సంచార వాహన సేవల్లో అంతరాయం, మూగజీవాల మౌన రోదనను తొలగించడంలో ప్రభుత్వ వైఫల్యంపై తాను సీఎంకు లేఖ రాశానని హరీశ్ రావు ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. "వ్యవసాయంలో దన్నుగా నిలుస్తూ, పాడిసంపదతో అదనపు ఆదాయాన్ని సమకూర్చే మూగజీవాల సంరక్షణ పట్ల మీ ప్రభుత్వం నిర్లక్ష్యాన్ని ప్రదర్శించడం శోచనీయం. పశుసంవర్ధక శాఖ కూడా మీ వద్దే ఉన్నప్పటికీ మూగజీవాల మౌనరోదనను మాత్రం పట్టించుకోవడం లేదు." అని హరీశ్ రావు ఆ లేఖలో పేర్కొన్నారు. రాష్ట్రంలో ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలకు వ్యాధులు సోకితే తగిన వైద్యం అందించేందుకు ప్రభుత్వ పశువైద్యశాలల్లో మందులు లేని దుస్థితి నెలకొందని, ఎమర్జెన్సీ మందులు సహా పెయిన్ కిల్లర్స్, విటమిన్స్, యాంటీ బయాటిక్స్ వంటి అన్ని రకాల మందుల సరఫరా తొమ్మిది నెలలుగా నిలిచిపోయిందన్నారు. పాలిచ్చే జీవులకు పొదుగు వాపు, గాలి కుంటు వ్యాధులు సోకితే ఒక్కో మూగ జీవిపై పాడి రైతులు రూ.2 వేల దాకా ఖర్చు చేయాల్సి వస్తోందన్నారు. ఇది వారికి అదనపు ఆర్థిక భారంగా మారిందన్నారు. మూగజీవాల్లో అంతర పరాన్నజీవులను నివారించేందుకు మూడు నెలలకోసారి నట్టల నివారణ మందులను తప్పనిసరిగా వేయాల్సి ఉంటుందని, 9 నెలల నుంచి నట్టల నివారణ మందులు సరఫరా చేయకపోవడంతో కాలేయం, జీర్ణాశయం, చిన్నపేగు భాగాల్లో పరాన్న జీవులు చేరి రక్తహీనతకు గురి చేస్తున్నాయన్నారు. దీంతో రోగ నిరోధకశక్తి తగ్గి మూగజీవాలు బలహీనంగా మారుతున్నాయన్నారు. దీంతో వ్యాధుల బారిన పడ్డ జీవులు ఆసుపత్రుల్లో మందుల కొరత కారణంగా సకాలంలో వైద్యం అందక మృత్యువాత పడుతున్నాయన్నారు. పశు వైద్యశాలల్లో మందులు లేకపోవడంతో మూగజీవాలకు చికిత్స అందించలేకపోతున్నామని, తప్పనిసరి పరిస్థితిలో మందుల చిట్టీ రాసి





బయట కొనుగోలు చేసుకోవాలని సూచిస్తున్నట్లు వెటర్నరీ డాక్టర్లు సైతం ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు. అనారోగ్యం పాలైన మూగజీవాల వద్దకే వైద్య సిబ్బంది వచ్చి తక్షణ చికిత్స అందించేందుకు గాను '1962' నెంబర్‌తో పశువైద్య సంచార వాహనాలను తమ ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. ఇది దేశానికి రోల్ మోడల్‌గా నిలిచిందని పేర్కొన్నారు. ఈ విధానంపై ప్రశంసలు కురిపించిన కేంద్ర ప్రభుత్వం అన్ని రాష్ట్రాల్లోనూ అమలు చేయాలని సూచించిందన్నారు. అంతటి గొప్ప కార్యక్రమ నిర్వహణను కాంగ్రెస్ ప్రభుత్వం గాలికి వదిలేసిందని విమర్శించారు. సంచార వాహనాల్లో మందుల కొరత కారణంగా అత్యవసర పరిస్థితుల్లో మూగజీవుల ప్రాణాలు కాపాడాలనే సదాశయం నీరుగారిపోతోందన్నారు. మరోవైపు వాహన ఉద్యోగులు సకాలంలో వేతనాలు అందక నానా అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వారికి కుటుంబ పోషణ భారంగా మారిందన్నారు. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఇప్పటి వరకు మీరు గాని, ఉన్నతాధికారులు గానీ ఒక్కసారి కూడా సమీక్ష నిర్వహించకపోవడం మూగజీవుల సంరక్షణ పట్ల మీ ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధిని తెలియజేస్తుందని రేవంత్ రెడ్డిని ఉద్దేశించి అన్నారు. ఇప్పటికే గొర్రెల పంపిణీ కార్యక్రమాన్ని అటకెక్కించారని... చేపల పంపిణీని ఆలస్యం చేస్తున్నారన్నారు. ఇప్పుడు మందులు సరఫరా చెయ్యక మూగజీవాల మరణాలకు కారణమవుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వానాకాలంలో వ్యాధులు ఎక్కువగా వచ్చే అవకాశం ఉంటుందని, నిర్లక్ష్యం వీడి తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అన్ని పశు వైద్యశాలల్లో, పశు వైద్య సంచార వాహనాల్లో అవసరమైన మందులు ఉండేలా చూడాలని, నట్టల నివారణ మందులు సరఫరా చేయాలని, '1962' పశువైద్య సంచార వాహనాల్లో విధులు నిర్వర్తించే ఉద్యోగులకు సకాలంలో వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

# ప్రతి అధికారి రాష్ట్రాభివృద్ధి కోసం బాధ్యతగా పని చేయాలి

మొదటి పేజి తరువాయి

ఇవాళ ఆయన అన్నమయ్య జిల్లా రైల్వే కోడూరు నియోజకవర్గ పరిధిలోని మైసూరవారిపల్లి గ్రామ సభకు హాజరయ్యారు. ముందుగా ఆయన గ్రామస్తుల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేటికి 75 శాతం గ్రామాల్లో వైసీపీకి చెందిన వారే సర్పంచ్‌లు కొనసాగుతున్నారని అన్నారు. పల్లెల అభివృద్ధి విషయంలో ప్రభుత్వానికి అలాంటి తారతమ్యాలు లేవని తేల్చి చెప్పారు. గ్రామ స్థాయి నుంచి వచ్చిన లీడర్లే జాతీయ స్థాయికి ఎదుగుతారని గుర్తు చేశారు. రాజకీయలకు అతీతంగా రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడమే కూటమి లక్ష్యమని అన్నారు. గ్రామ స్థాయి నంచి రాష్ట్ర స్థాయి వరకు ప్రతి అధికారి రాష్ట్రాభివృద్ధి కోసం బాధ్యతగా పని చేయాలని పిలుపునిచ్చారు. స్వర్ణ పంచాయతీల ఏర్పాటే తమ ముందు ఉన్న లక్ష్యమని తెలిపారు. ఇప్పటికే తన దృష్టిలో సినిమాలు వేరు.. రాజ కీయాలు వేరని అన్నారు. తనకు సినిమాల కంటే సమాజం, గ్రామాలే ముఖ్యమని పవన్ స్పష్టం చేశారు. దేశంలోనే మొదటిసారి రాష్ట్రంలోని మొత్తం 13,326 గ్రామ పంచా యతీల్లో గ్రామ సభలను (శుక్రవారం) ఒకేసారి నిర్వహి స్తున్నామని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తెలిపారు. ఈ నేపథ్యంలో అన్నమయ్య జిల్లా రైల్వే కోడూరు నియోజ కవర్గ పరిధిలోని మైసూరావారి పల్లెలో ఏర్పాటు చేసిన సభలో డిప్యూటీ సీఎం పవన్ మాట్లాడారు. దేశభక్తి పంచాయతీల నుంచే రావాలని పవన్ అన్నారు. గ్రామస్థాయి నుంచి వచ్చిన నాయకులే జాతీయ స్థాయికి వెళ్లారని తెలిపారు. చంద్రబాబు నుంచి నేర్చు కోవడానికి నేను ఎప్పుడూ సిద్ధంగా ఉంటాను అన్నారు. పదవులు నాకు





అలంకరణ కాదు..బాధ్యత అని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చెప్పారు. ఏపీలో కుప్పకూలిన పంచాయతీరాజ్ వ్యవస్థకు జవసత్వాలు నింపేందుకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. గ్రామ పంచాయతీలకు అత్యంత కీలకమైన గ్రామ సభ నిర్వహణపై మొట్టమొదటి దృష్టి సారించింది. గ్రామాల్లో స్థానిక పాలన సక్రమంగా జరగాలంటే గ్రామస్థుల సమష్టి నిర్ణయం ఉండాలి. దానికి మూలం గ్రామ సభలు అని తెలియజేశారు. అవి మొక్కుబడిగా కాకుండా వాస్తవంగా ప్రజల భాగస్వామ్యంతో జరిగితే ప్రజల మనోభావాలను పంచుకునే అవకాశం ఉంటుందన్నారు. కేంద్రం కూడా గ్రామ సభలను బలోపేతం చేసేందుకు నిర్ణయ్ అనే పోర్టల్‌ను ఏర్పాటుచేసింది. ప్రజల భాగస్వామ్యం కల్పించడం, పారదర్శకత, జవాబుదారీతనం పెరిగేలా గ్రామ సభలు నిర్వహించేందుకు పోర్టల్‌ను అభివృద్ధి చేసింది. ఈక్రమంలో 'మన గ్రామాలను మనమే పరిపాలించుకుందాం' అనేలా వీటి నిర్వహణ ఉంటుంది' అని పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు.

## మహెూత్సవంలో భాగంగా నేషనల్ హైవే నాటిన చెట్లను కటింగ్

మున్సిపల్ కమిషనర్. టీ మోహన్





మెట్ పల్లి **(గౌతమ్ న్యూస్):** మున్సిపల్ కమిషనర్ టీ మోహన్ శుక్రవారం డ్రై డే పురస్కరించుకొని కమిషనర్ మాట్లాడుతూ పదవ వార్డులో రోడ్లపై ఉన్నటువంటి కుండీలలో నిల్వ ఉన్న నీటిని తొలగించి కుండీని బోర్లా పెట్టించడం జరిగిందని తెలిపినారు ప్రజలు మీ ఇళ్లలో ఉన్న కుండీలలో నీరు నింపి వాడకుండా పెట్టకండి అలా ఉంచితే ఆ నీటిలో ఆంటీ లార్వా తయారై డెంగ్యూ వ్యాధులు రావచ్చును ప్రజలందరూ మీ ఇళ్లలో ఉన్నటువంటి కుండీలలో నిల్వ ఉన్న నీటిని మూడు రోజులకు ఒకసారి తొలగించాలని తెలిపినారు అనివార్డులలో ఆంటీ లార్వా స్ప్రే ఫాగింగ్ చేయించబడుతుందని తెలిపినారు వన మహెూత్సవంలో భాగంగా నేషనల్ హైవే నాటిన చెట్లను కటింగ్ చేస్తూ సర్వ సుందరంగా తీర్చిదిద్దుతున్నామని తెలిపినారు ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ సానిటరీ ఇన్స్పెక్టర్ రత్నాకర్ ముజీబ్ నిజాం అశోక్ నరేష్ పాల్గొన్నారు



## కంకర బోర్డు హై స్కూల్ కు ప్రహరీ గోడను నిర్మించాలి

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి పాఠశాల ముందు నిరసన

ఎస్ఎఫ్ఐ జిల్లా కన్వీనర్ పట్ల మధు



మానుకోట జిల్లా ప్రతినిధి**(గౌతమ్ న్యూస్):** మహబూబాబాద్ పట్టణంలోని కంకర బోర్డు పాఠశాలకు ప్రహరీ గోడను నిర్మించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కన్వీనర్ పట్ల మధు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పాఠశాల ముందు నిరసన వ్యక్తం చేశారు. మధు మాట్లాడుతూ కలెక్టరేట్ కూట వేతు దూరంలో ఉన్న పాఠశాలకు కనీసం ప్రహరీ గోడ విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతుంటే, విద్యాశాఖ అధికారులు కనీసం పట్టించుకోవడం లేదు అని విమర్శించారు. ప్రహరీ గోడ లేకపోవడం వలన పాఠశాలలోకి పందులు, కుక్కలు వస్తున్నాయని అన్నారు. దానితో పాటు బాలురకు మూత్ర శాలలు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. కావున విద్యార్థులకు కనీస అవసరాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనింగ్ కమిటీ సభ్యులు రాజేష్ నాయకులు చందు, లక్మణ్, నరేందర్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## క్షయ వ్యాధి నివారణ పరీక్షలను పరిశీలించిన

సబ్ యూనిట్ అధికారి వడ్డబోయిన శ్రీనివాస్



మానుకోట జిల్లా ప్రతినిధి**(గౌతమ్ న్యూస్):** యూపీఎస్సీ మహబూబాద్ నందు నిర్వహించిన క్షయ వ్యాధి నివారణ పరీక్షలను పరిశీలించి తగు జాగ్రత్తలు సూచనలు చేశారు. ఈ పరీక్షలను అంబేద్కర్ నగర్ మరియు గుమ్ముదూర్ బెస్త బజార్ సబ్ సెంటర్ల పరిధిలో సేకరించిన 51 తెమడ కప్పులను గవర్నమెంట్ హాస్పిటల్ లోని టీ హబ్ నందు పరీక్షించి ఒకవేళ పాజిటివ్ అని తేలినచో ఉచితంగా మందులు అందజేసి, అలాగే రెడ్యానాయక్ కాలనీ నందు ఫ్రైడే డ్రైడే కార్యక్రమంను పరిశీలించి దోమలను అరికట్టేందుకు తిమోపాస్ బ్లీచింగ్ పౌడర్ ను చల్లించడం, అలాగే డెంగ్యూ పాజిటివ్ కేసైనా జీలకర్ర వినయ్ ని పరీక్షించి తగు జాగ్రత్తలు సలహాలు సూచనలు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో డాక్టర్ కిరణ్మయి, ఏఎన్ఎంలు విజయ కుమారి, సుమలత, హెల్త్ అసిస్టెంట్ శ్రీహరి, ఆశాలు ప్రజలు పాల్గొన్నారు.

## మానుకోట జిల్లా అధ్యక్షులుగా -గుగులోత్ నందులాల్ నాయక్



మానుకోట జిల్లా ప్రతినిధి**(గౌతమ్ న్యూస్):** సేవాలాల్ సేన రెండవసారి మానుకోట జిల్లా అధ్యక్షులుగా గుగులోత్ నందులాల్ నాయక్ నియామకం. ఆగస్టు 18 న మానుకోట జిల్లా కేంద్రంలో జరిగిన జిల్లా సదస్సులో వ్యవస్థాపక అధ్యక్షులు భూక్యా సంజీవ్ నాయక్, రాష్ట్ర కో కన్వీనర్ వెంకన్న నాయక్, జాతీయ నాయకులు మోతిలాల్ నాయక్ చేతుల మీదుగా నూతన జిల్లా కమిటీ నియామకం జరిగింది. జిల్లా అధ్యక్షులుగా 2 వ సారి గుగులోత్ నందులాల్ నాయక్ ను నియమిస్తూ నియామక పత్రం అందజేశారు. తనపై నమ్మకంతో మరల జిల్లా అధ్యక్ష బాధ్యతను అప్పగించిన రాష్ట్ర కమిటీకి, వ్యవస్థాపక అధ్యక్షులు భూక్యా సంజీవ నాయక్ కి కృత్ఞతలు తెలిపారు. జాతి ఐక్యత కోసం, సంస్కృతి సంప్రదాయాలు పండుగలు హక్కుల కోసం ఉద్యమం ఉధృతం చేస్తామని, జిల్లాలోని 18 మండలాల్లో సంఘాన్ని బలోపేతం చేస్తానని, జాతి కి ద్రోహం జరిగితే సహించేది లేదని అన్నారు. సెప్టెంబర్ 9 న చలో హైదరాబాద్ సేవా లాల్ సేన గిరిజన సింహ గర్జన సభను విజయవంతం చేయాలని కోరారు.

## రైతుల శ్రేయసే తమ ధ్యేయం!

రైతు సమస్యలను పరిష్కరిస్తా!!- డిసిసిబి చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి!




ఉమ్మడి మహబూబ్నగర్**(గౌతమ్ న్యూస్):** జిల్లాలో రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ రైతులకు చేదోడు వాదోడుగా అందుబాటులో ఉంటూ వాళ్ళ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తానని నూతనంగా ఎన్నికైన ఉమ్మడి జిల్లా కోపరేటివ్ సొసైటీ డిసిసిబి చైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్ రెడ్డి హామీ ఇచ్చారు, శుక్రవారం డిసిసిబి అధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎన్నికైన సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు ప్రభుత్వంగా రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం రైతుల కోసం శ్రమిస్తూ రైతు సంక్షేమమే తమ ధ్యేయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర మంత్రులు శాసనసభ్యులు నిరంతరం రైతుల సమస్యల కోసం పనిచేస్తున్నారని ఇందులో భాగంగానే రాష్ట్రంలో రెండు లక్షల రూపాయల రుణమాఫీ, రైతు భరోసా పథకం కింద ఎకరాకు 7500 రైతు బీమా, పండించిన పంటకు గిట్టుబాటు ధర, వరి పంటపై బోనసు వంటి అనేక పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిందని ఇందుకోసం తనపై నమ్మకం పెట్టుకొని బాధ్యతలు అప్పజెప్పిన జిల్లా రైతాంగానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దలకు పార్టీ శ్రేణులకు తాను ఎప్పటికీ రుణపడి ఉంటానని ఆయన ఈ సందర్భంగా అన్నారు, ఏకగ్రీవంగా తన ఎన్నికకు సహకరించిన జిల్లాలోని ప్రతి ఒక్కరికి ఆయన పేరుపేరునా ధన్యవాదాలు కృతజ్ఞతలు తెలిపారు,



# డిసిసిబి చైర్మన్ ఏకగ్రీవ ఎన్నిక!!

## చైర్మన్గా మామిళ్లపల్లి విష్ణువర్ధన్ రెడ్డి ఎన్నిక!?

## రైతు నాయకుడు ఎన్నిక !!



డిసిసిబి చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి

నాగర్ కర్నూల్ వనపర్తి బ్యూరో**(గౌతమ్ న్యూస్):** ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లా కోపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ డిసిసిబి చైర్మన్ గా కొల్లాపూర్ నియోజక వర్గం లోని కేతపల్లి గ్రామానికి చెందిన మామిళ్ళపల్లి విష్ణువర్ధన్ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు, 2020 సంవత్సరంలో జరిగిన ప్రాథమిక సహకార సంఘం ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాల్లో మొత్తం 67 సొసైటీలకు జరిగిన ఎన్నికల్లో అప్పటి టిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 67 మంది సొసైటీలకు అధ్యక్షులుగా టిఆర్ఎస్ పార్టీ అభ్యర్థులు మద్దతుదారులు గెలుపొందారు, అప్పట్లో డిసిసిబి చైర్మన్గా నిజాం భాషను ఎన్నుకున్న నేపథ్యంలో ఇటీవల గత కొన్ని నెలల క్రితం మాజీ డిసిసిబి చైర్మన్ నిజాం పాషా అనారోగ్యంతో బాధపడుతూ తన పదవికి రాజీనామా చేసిన నేపథ్యంలో ఈ ఎన్నికలు అనివార్యమయ్యాయి, గత నాలుగు నెలల నుంచి డిసిసిబి చైర్మన్ పదవి కోసం ఎంతోమంది ఆశావాహులు పోటీపడుతున్న నేపథ్యంలో శుక్రవారం జరిగిన ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి, మొత్తం 15 మంది జిల్లాల్లో డైరెక్టర్లు అప్పట్లో టిఆర్ఎస్ పార్టీ నుంచి జిల్లాలో గెలుపొందినప్పటికీ ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా రాష్ట్రంలో రాజకీయ పరిణామాల నేపథ్యంలో గెలుపొందిన మెజార్టీ డైరెక్టర్లు అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ వైపు డైరెక్టర్లు మొగు చూపుతూ ఆ పార్టీలో చేరారు, ఈ ఎన్నికల కోసం జిల్లా కోపరేటివ్ సొసైటీ అధికారులు ఎన్నికలు నిర్వహించడానికి నోటిఫికేషన్ జారీ చేసినప్పటికీ కేవలం ఒక్క మాత్రమే నామినేషన్ వేయడం వల్ల ఎన్నిక ఏకగ్రీవంగా అయింది, గతంలో టిఆర్ఎస్ పార్టీలో ఉన్న మామిళ్ళపల్లి విష్ణువర్ధన్ రెడ్డి ఇటీవల కాంగ్రెస్ పార్టీలో చేరి చైర్మన్ పదవి దక్కించుకున్నారు, ప్రస్తుతం డిసిసిబి చైర్మన్ పదవి కాలం మరో ఆరు నెలలు మాత్రమే ఉన్నప్పటికీ కాంగ్రెస్ పార్టీ ఈ స్థానాన్ని దక్కించుకున్నది, మొత్తం 13 మంది డైరెక్టర్లు ఉండగా అందులో 11 మంది డైరెక్టర్లు ఈ ఎన్నికలకు హాజరయ్యారు, రాజకీయాలలో సుదీర్ఘకాలం మంగలపల్లి విష్ణువర్ధన్ రెడ్డి గతంలో కాంగ్రెస్ పార్టీ నుంచి కొల్లాపూర్ అసెంబ్లీ నియోజకవర్గంలో శాసనసభ్యునిగా పోటీ చేసి ఓడిపోయారు, ఆ తర్వాత భారత రాష్ట్ర సమితి అధికారంలోకి వచ్చిన సమయంలో టిఆర్ఎస్ పార్టీలో ఆయన డిసిసిబి జిల్లా డైరెక్టర్ గా కొనసాగుతున్న ఆయన జిల్లా డిసిసిబి చైర్మన్ మళ్లీ కాంగ్రెస్ పార్టీ నుంచి గెలుపొందడం విశేషం, ఆయన గెలుపు పట్ల ఆయన నియామకం పట్ల సహకరించిన పార్లమెంటు సభ్యుడు డాక్టర్ మల్లు రవి, రాష్ట్ర ఎక్సైజ్ పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, జిల్లాలోని శాసనసభ్యులు వేనం శ్రీనివాసరెడ్డి, వనపర్తి శాసనసభ్యులు మెగా రెడ్డి, దేవరకద్ర శాసనసభ్యులు, జి, మధుసూదన్ రెడ్డి, జడ్చర్ల శాసనసభ్యులు అనిరుద్దిన్ రెడ్డి, శ్రీహరి, పరిణికా రెడ్డి, కూచుకుల రాజేష్ రెడ్డి, కసిరెడ్డి నారాయణరెడ్డి, వంశీకృష్ణ, తో పాటు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు కార్యకర్తలకు నూతనంగా ఎన్నికైన చైర్మన్ మామిళ్ళపల్లి విష్ణువర్ధన్ రెడ్డి ప్రత్యేక ధన్యవాదాలు కృతజ్ఞతలు తెలిపారు,

# వైద్యం కోసం హాస్పిటల్ కి వస్తే కొత్త జబ్బులతో ఇంటికి వెళ్తున్న రోగులు

## సర్వజన హాస్పిటల్ లో మౌలిక వసతులు కల్పించాలి.

## సిపిఎం జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య.



భద్రాద్రి కొత్తగూడెం ఆర్ సి **(గౌతమ్ న్యూస్):** కొత్తగూడెం : అపరిష్కృతంగా ఉన్న సర్వజన హాస్పిటల్ సమస్యలు పరిష్కరించాలని సిపిఎం ఆధ్వర్యంలో ప్రభుత్వ హాస్పిటల్ ఎదుట ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య మాట్లాడుతూ పాత జబ్బు నయం చేసుకోవడానికి రోగులు హాస్పిటల్ కి వస్తే హాస్పిటల్ లో ఉన్న డ్రైనేజీ సమస్య వలన కొత్త రోగాలతో ఇంటికి వెళ్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గత నెలలో హాస్పిటల్లో ఉన్న సమస్యలను అధ్యయనం చేయడానికి సిపిఎం టౌన్ కమిటీ సర్వే నిర్వహించిందని ఈ సర్వేలో అనేక సమస్యలు వెలుగులోకి వచ్చాయని ఆయన అన్నారు. సర్వేలో వచ్చిన సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్ గారి దృష్టికి తీసుకెళ్లిన నేటికీ ఒక్క సమస్య కూడా పరిష్కారం కాలేదని ఆయన ఆరోపించారు. హాస్పిటల్ కి వచ్చిన రోగులు ముఖ్యంగా డ్రైనేజీ లీక్ అవడం వలన డ్రైనేజీ ద్వారా వచ్చే దుర్గంధం తోటి ప్రజలు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. హాస్పిటల్లో ఈ ఎమర్జెన్సీ వార్డులో కనీసం వెంటిలేటర్లు పనిచేయడం లేదని మానిటర్లు పనిచేయడం లేదని డెంగ్యూ వ్యాధి నివారణకు అవసరమైన ప్లేట్లెట్ మిషన్ కూడా సక్రమంగా లేదని దీనివలన మెరుగైన వైద్యం కోసం ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయించి ఆర్థికంగా నష్టపోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. డాక్టర్ పోస్టులు నర్సింగ్ పోస్టులు ల్యాబ్ టెక్నీషియన్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని రోజుకి ఐదు మంది రోగులు వస్తున్న హాస్పిటల్ లో కేవలం మూడు స్ట్రేచర్లు మాత్రమే ఉన్నాయని ఆయన అన్నారు. జిల్లా కేంద్ర హాస్పిటల్ పరిస్థితులే ఈ రకంగా ఉంటే మారుమూల గ్రామాల్లో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిస్థితి ఏంటి అని ఆయన ప్రశ్నించారు సీజనల్ వ్యాధుల నుండి ఏజెన్సీ ప్రజలను కాపాడాలంటే మెరుగైన వైద్య సౌకర్యం అందించాలని ఆయన డిమాండ్ చేశారు మెరుగైన వైద్య సౌకర్యం అందించాలంటే ప్రభుత్వ హాస్పటల్ అభివృద్ధి చేయాలని హాస్పిటల్ అభివృద్ధికి తగినన్ని నిధులు కేటాయించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హాస్పటల్ సమస్యలు పరిష్కారం అయ్యేవరకు పోరాటం కొనసాగిస్తామని ఆయన తెలియజేశారు ఈ కార్యక్రమంలో సిపిఎం టౌన్ కార్యదర్శి లిక్కి బాలరాజు జిల్లా కమిటీ సభ్యులు భూక్య రమేష్ టౌన్ కమిటీ సభ్యులు డి వీరన్న సందకూరి లక్ష్మి నందిపాటి రమేష్ నాయకులు బుర్ర వీరభద్రం ప్రమోద్ రామ్ చరణ్ నాగ దుర్గ రమా రామ కోటమ్మ రుహీన తదితరులు పాల్గొన్నారు.

# హెల్మెట్ లేకుండా ఎస్పీ కార్యాలయంలోకి అనుమతి లేదు!!

## నాగర్ కర్నూల్ పోలీసుల వినూత్న ప్రచారం!!








నాగర్ కర్నూల్ వనపర్తి బ్యూరో**(గౌతమ్ న్యూస్):** ప్రతి ఒక్కరు తప్పకుండా హెల్మెట్ ధరించాలని ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని రాష్ట్రంలోని పోలీసులు ఎప్పటికప్పుడు ప్రజలను వాహన దారులను చైతన్యం చేస్తున్నప్పటికీ హెల్మెట్ ధరించకుండా చలవిడిగా వాహనాలు నడుపుతున్న నేపథ్యంలో ఆఖరి కర్నూల్ జిల్లా పోలీస్ అధికారులు ప్రచారాన్ని మొదలుపెట్టారు, హెల్మెట్ లేకుండా జిల్లా ఎస్పీ కార్యాలయంలోకి అనుమతి లేదని బోర్డు పెట్టి అక్కడ పోలీసు సిబ్బంది ఎలిమెంట్ లేని వాహనాలను లోపలికి అనుమతించకపోవడం అందరిలో మార్పు కనిపిస్తుంది, హెల్మెట్ ధరించకుండా రోడ్డు ప్రమాదాలకు గురవుతూ చిన్నతనంలోనే ప్రాణాలుబలి కొంటున్నారని రాష్ట్ర పోలీస్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నాగర్ కర్నూల్ జిల్లాతో పాటు వనపర్తి, గద్వాల, నారాయణపేట, మహబూబ్నగర్, జిల్లాలోని వివిధ ప్రాంతాలలో నియోజకవర్గాలలో ప్రతి ఒక్కరు తలపై ఎలిమెంట్ ధరించి వాహనాలు నడపాలని పదేపదే అనేక రూపాలలో అవగాహన సదస్సులు ప్రచారాలు చేస్తున్నప్పటికీ హెల్మెట్ ధరించకుండా విచ్చలవిడిగా వాహనదారులు వాహనాలు నడుపుతున్నారని ఇది ఎంతవరకు సమంజసం కాదని పోలీసులు ఎన్నిసార్లు చెప్పినా మార్పు రాకపోవడంతో నాగర్ కర్నూల్ జిల్లా ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ ఆదేశాల మేరకు జిల్లా కార్యాలయంలోనికి వెళ్లాలంటే తప్పకుండా హెల్మెట్ ధరించాలని కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవడం పట్ల జిల్లా ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు, అదేవిధంగా వనపర్తి జిల్లాలో కూడా జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ ఇటీవల హెల్మెంట్ గురించి ట్రాఫిక్ నిబంధనలు వంటి అనేక అంశాలను ప్రజలను ఎప్పటికప్పుడు చైతన్యం చేస్తున్నప్పటికీ వనపర్తి జిల్లాలో కూడా హెల్మెట్ ధరించకుండా వాహనాలు నడుపుతున్న వాహన దారుల పైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ హెచ్చరించారు, ఇప్పటికైనా ద్విచక్ర వాహనాల యజమానులు హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలని అదే విధంగా ట్రాఫిక్ రూల్స్ పాటించాలని సెల్ఫోన్ లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం, త్రిబుల్ రైడింగ్, వంటి అనేక విషయాల పట్ల పోలీసులు ఎప్పటికప్పుడు గట్టినిగాతో పనిచేస్తున్నారు, ప్రజలు వాహనదారులు ఈ విషయాన్ని గమనించి ట్రాఫిక్ నిబంధనలతో పాటు తమ ప్రాణాలను కాపాడుకోవడానికి తప్పకుండా హెల్మెట్ ధరిస్తూ వాహనాలు నడపాలని పోలీసులు పిలుపునిచ్చారు,

### యస్.ఐ ని మర్యాదపూర్వకంగా కలసి సన్మానం చేసి, శుభాకాంక్షలు తెలిపిన

## కాంగ్రెస్ పార్టి జిల్లా అధికార ప్రతినిధి భూక్యా బాలు నాయక్



మానుకోట జిల్లా ప్రతినిధి**(గౌతమ్ న్యూస్):** మానుకోట జిల్లా కురవి యస్.ఐ గంద్రతి సతీష్ ని మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్చం అందించి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపిన కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి ప్రముఖ సామజిక వేత్త ప్రపంచ శాంతి అవార్డు గ్రహీత అందరివాడు భూక్యా బాలు నాయక్. శుక్రవారం ఇటివల నూతంగా కురవి యస్.ఐ గా భాద్యతలు స్వీకరించిన శుభసందర్భంగా కురవి పి.యస్ లోని వారి కార్యాలయంలో ఘనంగా సన్మానం చేసారు. భూక్యా బాలు నాయక్ మాట్లాడుతూ కులమత వర్గలింగ భేదాలు లేకుండా అన్నివర్గాల ప్రజలకు న్యాయం చేయాలని ఆశా భావ వ్యక్తంచేసారు, ఈ ఆధునిక కాలంలో యువత చెడు మార్గాల్లో ప్రయాణిస్తూ డ్రగ్స్, గంజాయి, మద్యం కు బానిసై ఉన్నత చదువులకు దూరం అవుతూ తల్లి దండ్రులకు తీవ్ర మైన విబ్బందులకు గురి చేస్తున్నారన్నారు, ఇలాంటి విద్యార్దులకు కౌన్సెలింగ్ విచ్చి వారు భవిష్యత్ కు బంగారు బాటలు వేయాలన్నారు. అదే విదంగా తాగి వాహనం నడిపే వారిపై ఉక్కు పాదం మోపాలన్నారు కురవి మండలాన్ని ఒక ఆదర్శవంతమైన మండలంగా మరియు నెర రహిత మండలంగా తీర్చి దిద్దలని కోరారు. ఈ కార్యక్రమములో కాంగ్రెస్ పార్టి జిల్లా నాయకులు వద్దుల ప్రశాంత్ రెడ్డి, బాలునాయక్, చారిటబుల్ ట్రస్ట్ ఉపాధ్యక్షులు గుగులోతు వేణుగోపాల్ నాయక్, గ్లోబల్ పీస్ ఫౌండేషన్ సలహ దారులు భూక్యా సురేందర్ నాయక్, సంస్థ సభ్యులు భూక్యా సురేష్, యస్. కె.భాసిరుద్దిన్, రపురెడ్డి నవీన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వనమహెూత్సవం లో భాగంగా 235 మొక్కలను నాటిన

సింగరేణి ఛైర్మన్ - మేనేజింగ్ డైరక్టర్ ఎన్.బలరాం, ఐఆర్ఎస్.



భద్రాద్రి కొత్తగూడెం ఆర్ సి**(గౌతమ్ న్యూస్):** కొత్తగూడెం : వనమహెూత్సవం కార్యక్రమము లో భాగముగా సింగరేణి సంస్థ ఛైర్మన్ - మేనేజింగ్ డైరక్టర్ ఎన్.బలరాం, ఐఆర్ఎస్ గారు ఇల్లందు గెస్ట్ హౌస్ ప్రాంగణం లో తేదీ. 23.08.2024, శుక్రవారం నాడు మొక్కలను నాటారు. ఈ సందర్భంగా సింగరేణి సంస్థ ఛైర్మన్ - మేనేజింగ్ డైరక్టర్ ఎన్.బలరామ్, ఐఆర్ఎస్ వన మహెూత్సవం లో భాగముగా మరియు సింగరేణిలో కూడా మనం పర్యావరణాన్ని కాపాడాలనే ఉద్దేశ్యంతో ప్రతీ అడుగు పచ్చదనం అనే నినాదం తో సమీప గ్రామాలలో, మైన్లు మరియు డిపార్ట్మెంట్లలో అలాగే ఓబి దంప్ లలో మొక్కలు నాటి పర్యావరణ సమతుల్యం పాటిస్తున్నామని అన్నారు.. సమాజంలోని ప్రతీ ఒక్కరికీ ఈ మొక్కలను నాటే కార్యక్రమం లో భాగస్వాములను చేయడం వలన పర్యావరణంపై అవగాహన పెరిగి భావి తరాలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించవచ్చని అన్నారు. మొదటి నుండి కూడా మన సంస్థ పర్యావరణంపై ప్రత్యేక శ్రద్ద చూపి మొక్కలు నాటడం వల్ల అడవులను పెంచే కార్యక్రమంలో సింగరేణి సంస్థ కృషి మరువలేనిది అన్నారు. సింగరేణి సంస్థ 2023 సంవత్సరం వరకు 14,680.5 హెక్టార్లలో 7.32 కోట్ల పైబడి మొక్కలు నాటుకున్నామని తెలియజేశారు. ఈ సంవత్సరం సింగరేణి సంస్థ 664 హెక్టార్లలో 13.30 లక్షల మొక్కలను పెంచాలనే లక్ష్యం తో సింగరేణి సంస్థ వ్యాప్తముగా గనులలో, ఓబి దంప్ లలో మొక్కలను నాటుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగముగా సింగరేణి సంస్థ ఛైర్మన్ - మేనేజింగ్ డైరక్టర్ ఎన్.బలరామ్, ఐఆర్ఎస్ ఒక్కరే కొత్తగూడెం ఇల్లందు గెస్ట్ హౌస్ ప్రాంగణం లో 235 వివిధ రకాల పండ్ల మొక్కలను( జామ, సీతా ఫలం, వాటర్ ఆపిల్, నేరేడు, సపోటా) నాటారు. ఈ రోజు నాటిన మొక్కలతో కలిపి మొత్తం సంస్థ ఛైర్మన్ - మేనేజింగ్ డైరక్టర్ గారు సింగరేణి వ్యాప్తముగా మొత్తం 40 ఎకరాల విస్తీర్ణం లో 18,291 మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో సింగరేణి సంస్థ ఛైర్మన్ - మేనేజింగ్ డైరక్టర్ ఎన్.బలరామ్, ఐఆర్ఎస్ తో పాటు జిఎం(ఐఏ) జి.వెంకట రమణ ఏజిఎం(ఫారెస్ట్) డబల్యూ.వివేక్ బాబు, డిజిఎం(ఫారెస్ట్) ఏబి.హరినారాయణ, డిజిఎం (ఈ-ఎం) వర్క్ షాప్ రాజీవ్ కుమార్, మేనేజర్(ఫారెస్ట్) ఆర్బి దేవిడ్ అభిలాష్, ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు.

## టీ మరియు టిఫిన్ సెంటర్ ప్రారంభం



టేకులపల్లి **(గౌతమ్ న్యూస్):** శుక్రవారం టేకులపల్లి మండలం ముత్యాలంపాడు ఎక్స్ రోడ్డు లోని గవర్నమెంట్ హాస్పటల్ ఎదురుగా (చాయ్ దునియా) టి మరియు టిఫిన్ సెంటర్ ను ప్రారంభించిన కాంగ్రెస్ జిల్లా నాయకులు కోరం సురేందర్ ఈ టీ టిఫిన్ సెంటర్ ప్రారంభోత్సవంలో ఉండేటి ప్రసాద్, బానోతు రవి, మాలోత్ రాందాస్, అజ్మీర శివ, లాకావత్ లింబ్య, అంతోటి రాకేష్, కాలే అభినయ్, కాలే భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# అధైర్య పడొద్దు అండగా ఉంటా

### మిర్చీ బోర్డ్ డైరెక్టర్ సీనియర్ కాంగ్రెస్ నాయకులు నాశిరెడ్డి సాంబశివరెడ్డి.



ఏటూరునాగారం(మంగపేట)**(గౌతమ్ న్యూస్):** ములుగు జిల్లా స్టాపర్: ములుగు జిల్లా మంగపేట మండలానికి చెందిన పాత్రికేయుడు బోడ ప్రవీణ్ ఇటీవల అనారోగ్యానికి గురై ఆసుపత్రి నుంచి ఇంటికి రాగా సహచరులద్వారా సమాచారం తెలుసుకున్న జాతీయ మిర్చీ బోర్డ్ డైరెక్టర్ సీనియర్ కాంగ్రెస్ నాయకులు నాసిరెడ్డి సాంబశివరెడ్డి శుక్రవారం స్థానిక పాత్రికేయులు కటుకూరి సాంబశివరావు,జానపట్ల జయరాజు తో కలిసి మండలంలోని తిమ్మంపేట గ్రామంలో బోడ ప్రవీణ్ నివాసానికి వెళ్లి పరామర్శించి కుటుంబసభ్యులతో మాట్లాడి మనోధైర్యం నింపి ఆర్థిక సహాయం అందించారు.కొద్ది రోజుల్లోనే పూర్వపు స్థితి వస్తుందని ధైర్యంగా ఉండాలన్నారు తాను ఎప్పటికి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.పాత్రికేయుడు బోడ ప్రవీణ్ అనారోగ్యం విషయాన్నీ రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క దృష్టికి తీసుకెళ్లి ముఖ్యమంత్రి సహాయనిధి మంజూరుకి కృషి చేస్తానన్నారు. పాత్రికేయులకు మంత్రి సీతక్క కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ అండగా ఉంటారన్నారు. ఈ కార్యక్రమం లో తిరుపతి రావు, సమ్మయ్య పాల్గొన్నారు.

## సాయిబాబా దేవాలయం కమిటీ ఆధ్వర్యంలో.. నిర్వహిస్తున్న

### ఎంబ్రాయిడరీ, మగ్గం వర్క్ సాయి ఫంక్షన్ హాల్ ను,సందర్శించిన సిఐ అనుముల శ్రీనివాస్,ఎసై ఎస్కె తాజోద్దీన్.





ఏటూరునాగారం,**(గౌతమ్ న్యూస్):** ములుగు జిల్లా స్టాపర్: ఏటూరునాగారం లోని,సాయిబాబా దేవాలయం కమిటీ,ఆధ్వర్యంలో,నిర్వహిస్తున్న ఎంబ్రాయిడరీ, మగ్గం వర్క్ సాయి ఫంక్షన్ హాల్ ను,సీఐ అనుముల శ్రీనివాస్, ఎసై తాజోద్దీన్ శుక్రవారం సందర్శించడం జరిగింది. ఈ సందర్భంగా సిఐ శ్రీనివాస్ మాట్లాడుతూ, మహిళలు కూడా,స్వయం ఉపాధి రంగంలో ముందు ఉండాలని,మహిళలు ప్రతి కుటుంబంలో ఏవిధంగా, తెలివితో పైకి రావాలంటే, ఆరు సూత్రాలను వారికి ,సవివరంగా వివరించారు. అలాగే స్థానిక ఎసైతాజోద్దీన్మాట్లాడుతూ,మహిళలు కూడా కుటుంబ భారం,ఎక్కువగా ఉండటంతో ,వ్యాపార రంగంలో కూడా ముందు ఉండాలని,వారి కాళ్లపై నిలబడి,కుటుంబాన్ని పోషించుకునే స్థాయిలో ఉండాలని సూచించారు.అలాగే వారు స్వయంగా చేతితో వేస్తున్న, ఎంబ్రాయిడరీ ,మగ్గం వివిధ డిజైన్ లను చూసి,మహిళలను సంతోష బుచ్చారు. అలాగే ఇప్పటి వరకు నేర్చుకున్న వివిధ ప్రాంతాలకు చెందిన నలుగురు మహిళలు,నేర్చుకున్న పనిని వారి ఆనందాన్ని వెలిబుచ్చారు.అనంతరం మొదటి బ్యాచ్, రెండవ బ్యాచ్ మహిళలతో గ్రూపు ఫోటో దిగారు.అనంతరం వారికి డ్రెస్ పంపిణీ చేశారు. ఇట్టి కార్యక్రమంలో శిక్షకురాలు రజిత, సృజన డైరెక్టర్ రవి, ఆలయ చైర్మన్ ప్రభాకర్, సహాయ కార్యదర్శి గంజి రమేష్ తోపాటు శిక్షణ పొందుతున్న మహిళలు తదితరులు పాల్గొన్నారు.



## ఈనెల 27, 28 తేదీలలో గవర్నర్ పర్యటనకు పక్కడ్బందీ ఏర్పాట్లు చేయాలి: జిల్లా కలెక్టర్ దివాకర టి. ఎస్.

### అన్ని శాఖల జిల్లా అధికారులు సమన్వయంతో పనిచేయాలి.



ఏటూరునాగారం(ములుగు)**(గౌతమ్ న్యూస్):** ములుగు జిల్లా స్టాపర్: తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ ఈనెల 27, 28 తేదీలలో జిల్లా పర్యటన నేపథ్యంలో పక్కడ్బందీ ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టి. ఎస్. అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎస్ పి షభరిష్, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు పి. శ్రీజ, డి ఎఫ్ ఓ రాహూల్ కిషన్ జాదవ్, ఏఎస్పి శివం ఉపాధ్యాయ, లతో కలిసి గవర్నర్ పర్యటన ఏర్పాట్లపై జిల్లా అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 27 న ములుగు జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లాకు చెందిన ప్రముఖ రచయితలు కళాకారులు వివిధ జాతీయ రాష్ట్రస్థాయి అవార్డు గ్రహీతలతో గవర్నర్ పరస్పరంగా చర్చిస్తారని, తదనంతరం జిల్లాలోని రామప్ప దేవాలయం, లక్నవరం సరస్సును సందర్శించి రాత్రి బస చేసి, మరుసటి రోజు హనుమకొండ చేరుకుంటారని కలెక్టర్ తెలిపారు. జిల్లా అధికారులకు కేటాయించిన విధులను అత్యంత జాగ్రత్తగా నిబద్ధతతో నిర్వర్తించాలన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఏర్పాట్లలో ఎలాంటి పొరపాట్లకు తావివ్వకూడదని అన్నారు. ముఖ్యంగా పోలీస్ శాఖ పటిష్ట బందోబస్తు చేయాలని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో ఆర్డీఓ సత్య పాల్ రెడ్డి, జెడ్పీ సీఈవో సంపత్ రావు, డిపీస్పీ రవీందర్, అన్ని శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# కార్యాలయంలో అవసరానికి మించిన ఉద్యోగులుగా పనిచేస్తున్నారు

- గిరిజన సంక్షేమ శాఖ జిల్లా అధికారిని వెంటనే సస్పెండ్ చేయాలి
- జిల్లా కార్యాలయంలో ఐ టి డి ఏ పి ఓ పేరు చెప్పుకుంటూ తన ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న డిడి
- అవినీతి అక్రమాలకు పాల్పడుతున్న ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు సహకరిస్తున్న జిల్లా డిడి
- ట్రాన్స్ఫర్ పై జిల్లా కార్యాలయానికి ఉద్యోగులు రాకుండా తప్పుడు సమాచారం ఇస్తున్న డిడి
- అవినీతి అక్రమాలకు పాల్పడుతున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగితో బేరసారాలు మాట్లాడుకోండి అని అంటున్న డిడి
- ఆదాయానికి మించిన ఆస్తులు సంపాదించిన అవినీతి అవుట్సోర్సింగ్ ఉద్యోగిపై వెంటనే ఏసీబీ దాడులు నిర్వహించాలి
- బోడ రమేష్ నాయక్ లంబాడి హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు



మహబూబాబాద్ మానుకోట జిల్లా ప్రతినిధి**(గౌతమ్ న్యూస్):** మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ సమీకృత కార్యాలయంలో జిల్లా గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయంలో జిల్లా అధికారి అయిన సైదా నాయక్ ని గిరిజన ఐక్య సంఘాల నాయకులు కలిసి ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు బోడ రమేష్ నాయక్ మాట్లాడుతూ జిల్లా కార్యాలయంలో సాధారణ ట్రాన్స్ఫర్ లు జరిగినా కూడా కొంతమంది తమకు ట్రాన్స్ఫర్ అయిన ప్రదేశానికి వెళ్లకుండా జిల్లా కార్యాలయంలోనే తిష్ట వేసుకున్నారు. అటువంటి వ్యక్తులు గత పది సంవత్సరాల నుండి జిల్లా కార్యాలయాన్ని వదిలి పెట్టకుండా ఉండటాన్ని అదేవిధంగా అధికారులకు ఉద్యోగులకు తప్పుడు సమాచారాన్ని ఇస్తూ జిల్లా కార్యాలయాన్ని వదిలిపెట్టకుండా ఇంకా ఇక్కడే పనిచేస్తున్నాడు అని ప్రశ్నించారు. మరి కొంతమంది హాస్టల్ వర్కర్లు జిల్లా కార్యాలయంలో అవసరానికి మించిన ఉద్యోగులుగా పనిచేస్తున్నారు ఈ విధంగా జిల్లా గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయంలో జరుగుతున్న అక్రమాలపై జిల్లా డిడి అయిన సైదా నాయక్ ను వివరణ కోరగా అతను ఒక సందర్భంలో పిఓ చెప్పినప్పుడు ఇక్కడ పని చేస్తున్నాడు అని మరొక సందర్భంలో పిఓ సిసి ఫోన్ చేసినప్పుడు ఇక్కడ పనిచేస్తున్నాడని చెప్తున్నారు. మరి ఈ విషయంలో మీకు ఎటువంటి లిఖితపూర్వమైన ఆర్డర్ కాపీ ఏమైనా ఉంటే మాకు రాతపూర్వకంగా ఇవ్వవలసిందిగా మేము కోరగా అటువంటి సమాచారం నా దగ్గర ఏమీ లేదు. నేను ఇవ్వను మీరు ఏం చేసుకుంటారో చేసుకోండి అని మమ్మల్ని భయభ్రాంతులకు గురి చేస్తున్నాడు. అదేవిధంగా ఒక జిల్లా అధికారి సంబంధం లేకుండా, అతని ప్రమేయం లేకుండా ఒక అవుట్సోర్సింగ్ ఉద్యోగి ఏ విధంగా తన జిల్లా కార్యాలయంలో పనిచేస్తున్నాడో అతనికి జిల్లా అధికారి సైదా నాయక్ ఏ విధంగా సహకరిస్తున్నాడో సమాధానం చెప్పాలి. ఈ విధంగా గత పది సంవత్సరాల నుండి అవినీతి అక్రమాలకు పాల్పడుతున్న ఒక ఔట్సోర్సింగ్ ఉద్యోగి జిల్లా అధికారి ప్రమేయం లేకుండా జిల్లా కార్యాలయంలో ఏ విధంగా పనిచేస్తాడు సాధారణ ట్రాన్స్ఫర్ లలో ఏ జిల్లాస్థాయి అధికారి గానీ జిల్లాలో పని చేస్తున్నటువంటి ఉద్యోగులు గాని తనకు ట్రాన్స్ఫర్ అయిన ప్రదేశానికి వెళ్ళిపోయారు. కానీ ఒక అవినీతి అక్రమాలకు పాల్పడుతున్న అధికారి జిల్లా కార్యాలయాన్ని వదిలి పెట్టకపోవడంలో ఆంతర్యమేముంది అని ప్రశ్నించారు. హాస్టల్ లలో ఉండి ఆశ్రమ పాఠశాలలో చదువుకునే నిరుపేద పిల్లల పొట్టలు కొట్టి, నోర్లు కొట్టి ఆయన దోచుకోవాల్సిన సొమ్ము ఏమైనా మిగిలి ఉందా అని అని ప్రశ్నించారు. ఏ విధంగా జిల్లా అధికారికి అతనికి సహకరిస్తున్నారు. అవినీతి అక్రమాలకు పాల్పడ్డ ఒక ఔట్సోర్సింగ్ ఉద్యోగి ట్రాన్స్ఫర్ అయిన కూడా వెళ్లకుండా దౌర్జన్యంగా జిల్లా కార్యాలయంలో పనిచేస్తున్న ఉద్యోగిపై డిడి సైదా నాయక్ కు కంప్లైంట్ చేయడానికి వెళ్తే ఒక జిల్లా అధికారి ఒకే లంబాడి సామాజిక కులానికి చెందిన వ్యక్తులు మీరు ఏమైనా ఉంటే మాట్లాడుకోమని ఉచిత సలహాలు ఇస్తున్నాడు. ఈ విధంగా అవినీతి అక్రమాలకు పాల్పడ్డ ఉద్యోగులకు సహకరిస్తున్న జిల్లా అధికారి అయిన సైదా నాయక్ ను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎల్ హెచ్ పి ఎస్ రాష్ట్ర అధ్యక్షులు గుగులోతు భీమా నాయక్, జిల్లా నాయకులు హత్తిరం నాయక్, మంగీలాల్ నాయక్, సాయి నాయక్ చక్రవర్తి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగులను నిస్సహాయ పరిస్థితి నుండి బయటకు తీసుకురావడమే

# ఈ గుర్తింపు శిబిరం ముఖ్య ఉద్దేశ్యం

### అర్హులైన దివ్యాంగులందరికీ సహాయ ఉపకరణాలు తప్పకుండా అందించడం జరుగుతుంది.

### ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి చిత్రా మిశ్రా.




ఏటూరునాగారం**(గౌతమ్ న్యూస్):** ములుగు జిల్లా స్టాపర్: మూడవ రోజు మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ మంత్రివర్యులు గౌరవనీయులు సీతక్క ప్రత్యేక చొరవతో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆలీంకో సంస్థ హైదరాబాదు వారి సహకారంతో దివ్యాంగులకు సహాయ ఉపకరణాలను అందించుటకు గాను అర్హులను గుర్తించు శిబిరమును ఎటూరునాగారం లోని గిరిజన భవన్ నందు నిర్వహించడం జరిగింది. ఇట్టి కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి చిత్రా మిశ్రా హాజరై కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దివ్యాంగులు విభిన్న ప్రతిభాపాటవాలు కలిగి ఉన్న నైపుణ్యవంతులని, వారికి సరైన చేయూతను అందిస్తే అద్భుతాలు సృష్టించగలరని అన్నారు. సాటి వారి తోడ్పాటు, సరైన సహకారం అందిస్తే దివ్యాంగులు కూడా ఎవరిపైనా ఆధార పడకుండా వారి పనులు వారే చేసుకోగలుగుతారని అన్నారు. ఆ ముఖ్య ఉద్దేశ్యంతో నే దివ్యాంగులు వారి వెనుకబాటుకు కారణమైన వైకల్యాన్ని జయించి ముందడుగు వేసేలా వారికి అవసరమైన సహాయ ఉపకరణాలు మరియు పరికరాలు అందించుటకు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని, కావున ఇక్కడికి విచ్చేసిన దివ్యాంగులు ఈ అవకాశాన్ని సద్వినియోగ పర్చుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఈ కార్యక్రమం ద్వారా ఉపకరణాలు అందిస్తున్న అలింకో సంస్థ ప్రతినిధులను మరియు ఈ శిబిరాలను విజయవంతంగా నిర్వహిస్తున్న మహిళలు, పిల్లలు, దివ్యాంగులు మరియు వయోవృద్ధులు సంక్షేమ శాఖ - ములుగు జిల్లా సిబ్బందిని అభినందించారు. అనంతరం ఈ కార్యక్రమానికి వచ్చిన వారిలో కొందరికి సదరం సర్టిఫికెట్లు లేవనే విషయాన్ని దివ్యాంగులు కొందరు ఐటిడిఎ పీవో దృష్టికి తీసుకురాగా డి ఆర్ డి ఏ తరపున ప్రత్యేకంగా ఓ అధికారిని ఇక్కడ ఏర్పాటు చేశామని కావున సదరం సర్టిఫికెట్లు రానివారు ఆ అధికారికి తమ దరఖాస్తులను సమర్పిస్తే సదరం క్యాంపు సమయం లో సమాచారం అందించడం జరుగుతుందని అన్నారు. అనంతరం జిల్లా సంక్షేమాధికారిణి స్వర్ణలత మాట్లాడుతూఏటూరునాగారం, మంగపేట, కన్నాయిగూడెం, వెంకటాపురం, వాజేడు ప్రాంతాలకు చెందిన దివ్యాంగులకు సహాయ ఉపకరణాలు, పరికరాలను అందించుట కొరకు అర్హులైన దివ్యాంగుల గుర్తింపు శిబిరాన్ని ఇక్కడ ఏర్పాటు చేయడం జరిగిందని, దివ్యాంగులు దూర ప్రాంతాల నుండి రావడం వారికి ఇబ్బంది అవుతుందనే ఉద్దేశ్యంతో వారి సౌకర్యార్థమై ఏటూరునాగారం కేంద్రంగా గిరిజన భవన్ లో ఈ అర్హులను గుర్తించు శిబిరంను ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. కావున హాజరైన దివ్యాంగులు అందరూ ఇట్టి శిబిరాన్ని ఉపయోగించుకొని వారికి అవసరమైనటువంటి సహాయ ఉపకరణాలను పొందాలని తెలిపారు. ఈ రోజు కన్నాయిగూడెం మండలం నుండి హాజరు కాలేకపోయిన వారు శనివారం రోజు కన్నాయిగూడెం మండల కేంద్రం లో నిర్వహించబోవు శిబిరానికి హాజరు కావచ్చని తెలిపారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ ఏటూరునాగారం ప్రాజెక్టు సీడీపీవో శ్రీమతి ఈపి ప్రేమలత మాట్లాడుతూ ఈరోజు ఈ శిబిరానికి 5 మండలాల నుండి అధికసంఖ్యలో దివ్యాంగులు హాజరు కావడం జరిగిందని, ఈ కార్యక్రమాన్ని క్షేత్రస్థాయి లోకి వెళ్లేలా చర్యలు చేపట్టిన ఈ 5 మండలాల ఎంపిడివో లు, ఎంపీవోలు లు, పంచాయతీ కార్యదర్శులు, అంగన్వాడీ టీచర్లందరికీ ధన్యవాదాలు తెలిపారు. అన్నారు. ఈ కార్యక్రమంలో ఆలీంకో సంస్థ ప్రతినిధి ఆశిష్ మాట్లాడుతూ దివ్యాంగులు 40 శాతం వైకల్యం పైబడినటువంటి వారిని మరియు 80 శాతం వైకల్యం పైబడినటువంటి వారిని ప్రత్యేకంగా గుర్తించి వారి వారి అవసరాలను బట్టి వారికి రకరకాల సహాయ ఉపకరణాలను నిర్ణయించి అందివ్వడం జరుగుతుందని తెలిపారు. దివ్యాంగుల కొరకు ప్రత్యేకంగా ఈరోజు ఏటూరునాగారం లోని గిరిజన భవన్ లో ఈ సహాయ ఉపకరణాలు అందించుటకు అర్హులను గుర్తించు శిబిరాన్ని ఏర్పాటు చేయడం సంతోషకరమని, ఈ శిబిరం ద్వారా ఈ పరిసర ప్రాంతాల్లోని అనేకమంది దివ్యాంగులు లబ్ధి పొందుతారని తెలిపారు. అనంతరం దివ్యాంగుల సంక్షేమ సంఘం రాష్ట్ర మరియు జిల్లా నాయకులు పూజారి మాణిక్యం, భాస్కర్ లు మాట్లాడుతూ మంత్రి వర్యులు ధనసరి అనసూయ (సీతక్క) తన పుట్టిన నేలపై, తన నియోజకవర్గంపై మమకారంతో ముఖ్యంగా దివ్యాంగులకు ఈ సహాయ ఉపకరణాలు అందించు కార్యక్రమం చేపట్టడం మా దివ్యాంగులకు ఎంతో ప్రయోజనకరం అని అన్నారు. ఈ సందర్భంగా ఈ కార్యక్రమానికి చొరవ చూపినందుకు మంత్రికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏటూరునాగారం వెంకటాపురం మండలాల ఎంపిడివో లు, జిల్లా బాలల పరిరక్షణ అధికారి జె.ఓంకార్, అలీమ్ కో సంస్థ ప్రతినిధులు, ఎంపీ ఓ శరత్, డిఆర్డీఏ అధికారులు, ఐసిడిఎస్ సూపర్వైజర్లు, సిబ్బంది, జిల్లా బాలల పరిరక్షణ విభాగం, చైల్డ్ హెల్ప్ లైన్ సిబ్బంది 5 మండలాల నుండి వచ్చిన దివ్యాంగులు తదితరులు పాల్గొన్నారు.





## ట్రైకార్ పథకాల సెక్టోరియల్ అధికారుల సమీక్ష



ఏటూరునాగారం**(గౌతమ్ న్యూస్):** ములుగు జిల్లా స్టాపర్: ట్రైకర్ చైర్మన్ డా. బెల్లయ్య నాయక్ ఐటిడిఏ ఏటూరు నాగారం నందు ట్రైకర్ ద్వారా అమలు చేయుచున్న పథకముల తీరుపై ఐటిడిఏ సెక్టోరియల్ అధికారులతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ యొక్క సమావేశంలో ట్రైకార్ పథకాలైన ఎం ఎస్ ఎమ్ ఈ, ఎస్ ఎస్, గిరి వికాసం, రూరల్ ట్రాన్స్పోర్టేషన్ మరియు స్కిల్ డెవలప్మెంట్ పథకాల అమలు తీరుపై సంబంధిత అధికారులతో సమక్షసమావేశంనిర్వహించినారు. ట్రై కార్ ర్ చైర్మన్ . డా. బెల్లయ్య నాయక్ ట్రైకార్ ద్వారా అమలకు పథకాలు గిరిజనులకు అందే విధంగా చూడాలని అధికారులను సూచించినారు. అదే విధంగా ఇప్పుడు అమలు అవుతున్న పథకాలు కాకుండా గిరిజనలు ఆర్థికంగా అభివృద్ధి చెందుటకు వినూత్న రీతిలో పథకాలు అమలు చేయడానికి అధికారులు ప్రణాళికలు తయారు చేయాలని కోరినారు. ఈ యొక్క సమావేశంలో చిత్రా మిశ్రా ఐఏఎస్ ప్రాజెక్ట్ అధికారిని కె. శంకర్రావు జనరల్ మేనేజర్ ట్రైకార్ లక్ష్మీ ప్రసాద్, స్టేట్ మిషన్ మేనేజర్, ట్రై కార్ పోచం, డిడి ట్రైబల్ వెల్ఫేర్ ప్రతాప్ రెడ్డి, డి ఎం జిసిసి రాజకుమార్, ఎస్ ఓ ఐ టి డి ఎ ఏటూరునాగరం దేశి రామ్, ఏ టి డి ఓ కొండలరావు జేడీఎం ఐటీడీఏ మరియు ఐటీడీఏ సిబ్బంది పాల్గొన్నారు.



## సీజనల్ వ్యాధుల పట్ల అధికారులు అలసత్వాన్ని వీడాలి

### మాజీ కొత్తగూడెం మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మునిగడప డిమాండ్.



భద్రాద్రి కొత్తగూడెం ఆర్ సి **(గౌతమ్ న్యూస్):** కొత్తగూడెం : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వ్యాప్తంగా విష జ్వరాల వల్ల ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారని ,విష జ్వరాలను అరికట్టడంలో ప్రభుత్వ వైద్యాధికారులు విఫలమవుతున్నారని మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్, సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు మునిగడప వెంకటేశ్వర్లు విష జ్వర పిడుతుల పట్ల వైద్యాధికారులు అలసత్వం వీడి తక్షణమే వైద్య సహాయం అందించాలని డిమాండ్ చేశారు. శుక్రవారం పదో వార్డులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైద్య సహాయం అందించడంలో తగు జాగ్రత్తలు తీసుకొని ప్రజలను అనారోగ్యం నుండి కాపాడాలని ఆయన ప్రభుత్వ వైద్యులకు విజ్ఞప్తి చేశారు. రక్త నమోనాలను తీసుకున్నాక రెండు రోజుల తర్వాత రక్తనమోన ఫలితాలను ఇస్తే ఏమి ఉపయోగం ఉంటుందని రోగికి ఆ రెండు రోజుల్లో విష జ్వరాల ప్రభావం పెరుగుతుందని దీనివల్ల రోగులు ప్రాణాపాయ స్థితికి చేరుకుంటారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రక్త పరీక్షలు తీసుకున్న ఘంటా రెండు గంటల్లోనే ఫలితాలను అందిస్తే తక్షణ వైద్య సహాయం అందుతుందని అలా కాకుండా రెండు రోజుల తర్వాత వైద్య పరీక్ష ఫలితాలు ఇస్తే ఎలా ఉంటుందని ప్రశ్నించారు ఇప్పటికైనా వైద్యాధికారులు రక్తరమోన పరీక్షల్ని అదే రోజు రోగులకు అందించి తక్షణ వైద్యాన్ని అందించాలని ప్రభుత్వ వైద్యులకు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో మేడిపల్లి కవిత ,రావిశెట్టి పద్మ ,రాజేశ్వరి నాయకులు వాసం బాబు, ఉపతల శీను ,సందీప్ ,అఫ్జల్ తదితరులు పాల్గొన్నారు.

## కొత్తగూడెం ఏరియా రామవరంలో

# త్వరలో ఈఎస్ఐ డిస్పెన్సరీ హాస్పిటల్

**హాస్పిటల్ స్థలాన్ని పరిశీలించిన ఈఎస్ఐ డాక్టర్ చందు, కాంట్రాక్ట్ కార్మిక నేత రాసూరి శంకర్.**



భద్రాద్రి కొత్తగూడెం ఆర్ సి **(గౌతమ్ న్యూస్):** కొత్తగూడెం : కాంట్రాక్ట్ కార్మికుల హక్కుల పరిరక్షణ సంఘం కృషి పట్టుదల పేదవాడికి అందని ద్రాక్ష పండు అలాంటి వైద్యం ఈఎస్ఐ హాస్పిటల్ ద్వారా సాకారం అవుతుందని గ్రహించి కాంట్రాక్ట్ కార్మికుల హక్కుల పరిరక్షణ సంఘం అధ్యక్షుడు రాసూరి శంకర్ ఆధ్వర్యంలో గత రెండున్నర సంవత్సరాల కాలంగా ఈఎస్ఐ హాస్పిటల్ కొత్తగూడెం ఏరియాలో ఏర్పాటు చేయుటకు ప్రయత్నించడం, దానికి సంబంధించి సింగరేణి చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ బలరాం కూడా సానుకూలంగా స్పందించి వారి కృషి వల్ల ఈఎస్ఐ వారు డిస్పెన్సర్ ఏర్పాటు చేయుటకు అంగీకరించడం జరిగింది. దాన్లో భాగంగా ఈ రోజున ఈఎస్ఐ బృందం రామవరంలో పాత ఈఎస్ఐ హాస్పిటల్ కి సంబంధించిన ప్రదేశం అక్కడున్నటువంటి వాతావరణాన్ని అధ్యక్షుడు రాసూరి శంకర్ ఆధ్వర్యంలో స్థలం పరిశీలించడం జరిగింది. ఈఎస్ఐ డాక్టర్. చందు ఈఎస్ఐ హాస్పిటల్ కొత్తగూడెం ఏరియాలో ఏర్పాటు చేయుట సంతోషకరమైన విషయమని సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల నిరుపేద కుటుంబ సభ్యులందరికీ వైద్యం అందించడం మాకు ఎంతో సంతోషమని వారు తెలియజేయడం జరిగింది. అతి త్వరలోనే కొత్తగూడెం ఏరియాలో ఈఎస్ఐ డిస్పెన్సరీ రావడం చాలా సంతోషకరమైన విషయం అని అధ్యక్షులు రాసూరి శంకర్ వారితో అనడం జరిగింది ఈ యొక్క కార్యక్రమంలో భాష బోయిన రవికుమార్,సాదిక్ పాల్గొనడం జరిగింది.

## రైతు రుణమాఫీ లో పలు సమస్యల పరిష్కారానికి నిర్వహించిన ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తుల వివరాలు వెల్లడించిన

**జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్.**




భద్రాద్రి కొత్తగూడెం ఆర్ సి **(గౌతమ్ న్యూస్):** కొత్తగూడెం కలెక్టరేట్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రైతు రుణమాఫీలో అమలులో భాగంగా సమస్యల పరిష్కారానికి నిర్వహించిన ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులు వివరాలను భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటివరకు వివిధ కారణాలవల్ల రుణమాఫీ జమ కాని రైతులు మొత్తం దరఖాస్తులు 5893 కాగా 4230 దరఖాస్తులను అప్డేట్ చేయడం జరిగిందని, ఈరోజు 1663 దరఖాస్తులు రైతుల నుండి స్వీకరించామని ఆయన తెలిపారు. ఇప్పటివరకు జిల్లాలోని అన్ని మండలాల్లో స్వీకరించిన దరఖాస్తుల వివరాలను క్రింది పట్టికలో పొందుపరచడం జరిగింది.

## సింగరేణి తెలుగు ఉపాధ్యాయుడు పై సస్పెన్షన్ వేటు

**సింగరేణి ఎడ్యుకేషనల్ సొసైటీ జీఎం బి.నికోలస్ వెల్లడి.**



భద్రాద్రి కొత్తగూడెం ఆర్ సి**(గౌతమ్ న్యూస్):** కొత్తగూడెం : సింగరేణి ఉపాధ్యాయుడిపై సస్పెన్షన్ వేటు ఆరోపణలు రుజువైతే కఠిన చర్యలు తీసుకుంటాం జీఎం(ఎడ్యుకేషన్) వెల్లడి కొత్తగూడెం, ఆగస్టు 23, 2024 కొత్తగూడెంలోని సింగరేణి కాలరీస్ ఉన్నత పాఠశాలలో ఇటీవల బదిలీపై వచ్చిన తెలుగు ఉపాధ్యాయుడు బాలికల పట్ల అసభ్యంగా ప్రవర్తించినట్లు వచ్చిన ఆరోపణలపై నేపథ్యంలో అతడిపై సస్పెన్షన్ వేటు వేస్తూ సింగరేణి ఎడ్యుకేషనల్ సొసైటీ నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం ఉపాధ్యాయుడు పోలీసుల అదుపులో ఉన్నారని, తక్షణమే ఇతనిపై పూర్తి స్థాయి విచారణకు ఆదేశించామని జనరల్ మేనేజర్(ఎడ్యుకేషన్) బి.నికోలస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విచారణ తర్వాత ఆరోపణలు రుజువైతే తీవ్ర చర్యలు తీసుకోవడానికి వెనకాడబోమని స్పష్టం చేశారు. ఈ విషయంలో బాలికలు, వారి తల్లిదండ్రులకు పూర్తి భరోసా ఇస్తున్నామని, అలాగే ఇటువంటి ఉదంతాలు పునరావృతం కాకుండా కఠిన నిబంధనలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. సత్ప్రవర్తన లేని ఉపాధ్యాయుల పట్ల కఠినంగా వ్యవహరిస్తామని స్పష్టం చేశారు. ఈ విషయంలో తల్లిదండ్రులు, విద్యార్థులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, విద్యార్థుల భద్రతకు యాజమాన్యం పూర్తి అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.

# డిసిసిబి చైర్మన్ కు ఘన సన్మానం




నాగర్ కర్నూల్ వనపర్తి బ్యూరో**(గౌతమ్ న్యూస్):** ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లా ఓపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ డిసిసిబి చైర్మన్ గా ఏకగ్రీవంగా ఎన్నికైన మామిళ్ళపల్లి విష్ణువర్ధన్ రెడ్డిని శుక్రవారం వనపర్తి నియోజకవర్గం నుంచి సింగిల్ విండో చైర్మన్ లు ఘనంగా సన్మానించారు, నూతన చైర్మన్ ను సన్మానించిన వారిలో రాజనగరం సింగల్ విండో చైర్మన్. రఘు వర్ధన్ రెడ్డి పెబ్బేరు సింగిల్ విండో చైర్మన్ కోదండరామిరెడ్డి గారు, వనపర్తి సింగిల్డా చైర్మన్ గా పెద్దలు సీనియర్ నాయకులు వెంకట్రావు , నాగవరం సింగల్ విండో చైర్మన్ మధుసూదన్ రెడ్డి గారు, పెద్దమందడి సింగల్ వీడియో చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది, అంతేకాక నాగర్ కర్నూలు జిల్లా పెద్దకొత్తపల్లి మండల జడ్పిటిసి సభ్యురాలు మేకల గౌరమ్మ చంద్రయ్య తో పాటు మరికొంతమంది కాంగ్రెస్ పార్టీ శ్రేణులు సింగల్ విండో చైర్మన్లు డైరెక్టర్లు ఘనంగా శాలువులతో పూలమాలలతో సత్కరించారు,

## ప్రముఖ వైద్యులు డాక్టర్ రాఘవులు సతీమణి మృతి

**పరామర్శించిన మాజీ ఎంపీ రావుల**




నాగర్ కర్నూల్ వనపర్తి బ్యూరో**(గౌతమ్ న్యూస్):** వనపర్తి జిల్లా కేంద్రంలో సుదీర్ఘకాలం దాదాపు 30 సంవత్సరాల నుంచి సీనియర్ వైద్యులు డాక్టర్ గడుసు రాఘవులు సతీమణి అనారోగ్యంతో మృతి చెందగా విషయం తెలుసుకున్న మాజీ పార్లమెంట్ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే రావుల చంద్రశేఖర్ రెడ్డి వారి ఇంటికి వెళ్లి



వారి మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులు అర్పించారు , డాక్టర్ గడుసు రాఘవులు తో మాట్లాడి మనోధైర్యం చెప్పారు, వారితో పాటు నాయకులు తిరుమల్ , సయ్యద్ ముదసర్, కొత్తకోట బాలయ్య నాయుడు తదితరులు ఉన్నారు. నాగర్కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలం చెన్నప్ప రావు పల్లి గ్రామానికి చెందిన డాక్టర్ గడుసు రాఘవులు వైద్య వృత్తిలో అలుపెరుగని పెరగని సేవలందించి ఎంతో అనుభవం కలిగిన డాక్టర్ గా ఈ ప్రాంతంలోనే కాక నాగర్కర్నూల్ జిల్లాలో కూడా ఆయన వైద్య సేవలు పేద బడుగు బలహీన వర్గాల ప్రజలకు అతి తక్కువ ఫీజులతో వైద్యం అందించి పేరు పొందడం గర్వకారణం ఆయన సతీమణి మృతి పట్ల పలువు రాజకీయ పార్టీల నాయకులు ప్రజాసంఘాల నాయకులు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు, సందర్భంగా గౌతమ్ న్యూస్ తెలుగు దినపత్రిక తెలంగాణ రాష్ట్రం నెట్వర్క్ ఇన్చార్జి కే ,రవిశంకర్ గౌడు ఆమె పట్ల తీవ్ర ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేస్తూ దేవుడు ఆయురారోగ్యాల ప్రసాదించాలని ఆకాంక్షించారు,

# జిల్లాలో రోడ్లపై ప్రమాదాలు జరగకుండా నివారించాలి. జిల్లా కలెక్టర్ దివాకర టి. ఎస్

**ప్రమాదాలు కారణమయ్యే ప్రాంతాలను గుర్తించి రక్షణ జాగ్రత్తలు తీసుకోవాలి.**

ఏటూరునాగారం (ములుగు)**(గౌతమ్ న్యూస్):** ములుగు జిల్లా స్టాపర్: జిల్లాలో రోడ్లపై ప్రమాదాలు జరగకుండా నివారించాలని, ప్రమాదాలు కారణమయ్యే ప్రాంతాలను గుర్తించి రక్షణ జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టి. ఎస్. అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరం లో జిల్లాలో ఉన్న జాతీయ రాష్ట్ర రహదారులపై ప్రమాదాలు తగ్గించడానికి అవలంబించాల్సిన విధానాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., ఎస్ పి శభరిష్ తొ కలసి జిల్లా రోడ్డు సేఫ్టీ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రహదారులపై ఎక్కువగా ప్రమాదాలు చోటుచేసుకునే ప్రాంతాలలో






ప్రమాదాలు జరగకుండా నివారించడం కోసం పోలీసు, రోడ్లు మరియు భవనాలు, ఎక్సైజ్, ఆర్టీవో , ఆర్టీసీ తదితర శాఖలు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ ఆదేశించారు. జాతీయ రహదారి 163 పై ఎక్కువగా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని, ఆ ప్రమాదాలు జరిగే బ్లాక్ స్పాట్స్ వద్ద ఎటువంటి చర్యలు తీసుకోవాలి అనే విషయాలపై సమావేశంలో చర్చించారు. మొదట అధికంగా ప్రమాదాలు జరిగే బ్లాక్ స్పాట్స్ ప్రాంతాల వద్ద పోలీసులు, ఆర్ అండ్ బి అధికారులు వెళ్లి తనిఖీ చేసి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై నివేదిక ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు. నెల రోజుల్లో మళ్లీ ఒకసారి సమావేశం నిర్వహించి ప్రమాదాలు నివారించడానికి అన్ని శాఖల సమన్వయంతో రహదారుల వారిగా సమీక్ష చేస్తామన్నారు. సాంకేతిక సమస్య వల్ల ఒక ప్రమాదం కూడా జరగవద్దని, అని శాఖలు సమన్వయతో పనిచేసి ప్రాణాలను నిలబెట్టాలని కోరారు. ఎస్పి శభరిష్ మాట్లాడుతూ వేగాన్ని తగ్గించే నివారణ చర్యలు ఏమైనా ఉంటే వాటిని అభివృద్ధి చేయాలని, వేగాన్ని తగ్గించడానికి బారికేట్స్ తో పాటు, డంబుల్ స్ట్రిప్స్ పెట్టాలని, సైన్ బోర్డ్ లు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రమాదాలు జరగకుండా పోలీస్ శాఖ ఇతర శాఖలతో సమన్వయంగా పనిచేయడానికి సిద్ధంగా ఉందని తెలిపారు. అన్ని శాఖలు కలిసి ఒక్క ప్రాణం కూడా పోకుంట చూడాలని కోరారు. ఈ సమావేశంలో డి ఎఫ్ ఓ రాహూల్ కిషన్ జాదవ్, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు పి. శ్రీజ, ఏ ఎస్పి శివం ఉపాధ్యాయ, ఆర్డిఓ సత్య పాల్ రెడ్డి, డిఎస్పీ రవీందర్, ఆర్ అండ్ బి, జాతీయ రహదారుల, పి ఆర్ ఇంజనీరింగ్ అధికారులు, ఆర్టీసీ అధికారులు, జిల్లా రవాణా శాఖ అధికారి, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మానవత్వం మంట కలిసింది!!

## కన్న కొడుకులే కాదన్నారు!!

## వనపర్తి ఆర్డీవో కు ఫిర్యాదు!!

నాగర్ కర్నూల్ వనపర్తి బ్యూరో**(గౌతమ్ న్యూస్):** కన్న కొడుకులే కాదన్నారు మానవత్వాన్ని మంటగలిపి తండ్రిని ఆలన పాలన చూడకుండా అనాధనుగా చేసిన ఘటన జిల్లాలోని మండల ఎవరు పెద్దమందడి మండల కేంద్రానికి కొత్త కాపు రామ్ రెడ్డి వయసు 70 సంవత్సరాలు తన ముగ్గురు కొడుకులు ఆలన పాలన చూడకుండా తన పోషణను సంరక్షణను విస్మరించి కాదంటున్నారని బాధితుడు శుక్రవారం వనపర్తి రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో తన భార్య అనసూయ ఇద్దరు కలిసి ఆర్డీవోకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు, మారుతున్న కాలానికి అనుగుణంగా శాస్త్రీయ సాంకేతిక పరిజ్ఞానం పెరిగినప్పటికీ నేటికి భారతదేశానికి స్వాతంత్రం సిద్ధించి 78 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఇప్పటికి తల్లిదండ్రులను పోషించకుండా దుర్మార్గంగా ప్రవర్తిస్తున్న సొంత కొడుకులు రక్త సంబంధానికి పేగు బంధానికి శత్రువులుగా మారుతున్నారని చెప్పడానికి ఈ సంఘటన దిక్కు తోచని స్థితిలో తల్లిదండ్రుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు, పెద్దమందడి మండల కేంద్రం కొత్త కాపు రాంరెడ్డి భార్య కొత్త కాపు అనసూయమ్మ కు ముగ్గురు కొడుకులు ఒక కూతురు ఉన్నారు, కానీ వారి వృద్ధాపములో చూసుకోవాల్సిన కుమారులు పట్టించుకోవటం లేదని శుక్రవారం నాడు వనపర్తి ఆర్డిఓ కార్యాలయం నందు న్యాయం జరపాలని ఆర్డీవో కి వినతి పత్రం అందజేశారు. రాంరెడ్డి స్వయంకృషితో 17 ఎకరాల 17 గుంటల భూమిని తన కష్టార్జితంతో కొనుగోలు చేసిన వాటిని ముగ్గురి కొడుకులకు ప్రతి ఒక్కరికి 3.18 చొప్పున బాగా పరిష్కారాలు చేసి ఇవ్వటం జరిగిందని ఫిర్యాదులో పేర్కొన్నారు, తల్లిదండ్రులను బాధ్యతగా చూసుకోవలసిన కుమారులు ఎవరి పనులు వారు చేసుకుంటూ గత 6 సంవత్సరాల నుండి మా బాగోగులు పట్టించుకోవడంలేదని ఆరోపించారు, 2019-20 సంవత్సరంలో దేశంలో కరోనాతో బాధపడుతున్న సమయంలో కూడ మా దగ్గరికి రాలేదని అన్నారు, అప్పటినుంచి తమ మనసును



బాధించిందని వారు కన్నీళ్లు పెట్టారు కన్న కొడుకులే పలకరింపు కూడ కరువయ్యారని ఆవేదన వెలబుచ్చారు. భర్త రాం రెడ్డికి ఈ మధ్య కాలంలో పచ్చవాతం తో మంచాన పడ్డవారికి సేవలు చేయటానికి ఇబ్బంది కలుగుతుందని తన కొడుకులకు సమాచారం ఇచ్చిన వచ్చి చూడలేదని కనీసం పలకరించకపోవడం బాధ కలిగించిందని ఆవేదన వెళ్ళబుచ్చారు. తన కూతురు గత 3 నెలల నుండి సేవలందించటాన్ని వారు గుర్తు చేసుకున్నారు. వారికి ఎలాంటి ఆదాయం లేకపోవడంతో వారు నివసిస్తున్న ఇంటి స్థలాన్ని అమ్మటానికి వెళితే కుమారులు భార్యలు అయినా ఇంటి కోడలు అడ్డుపడుతున్నట్లు వారు ఫిర్యాదులో పేర్కొన్నారు. వారి ఇంటి అవసరాల కోసం తర్వాత వారి నివాసగృహానికి మరమ్మతులు చేసుకొనటానికి డబ్బులు అవసరం ఉండి ఇతరులతో అప్పులు చేసినందుకు అప్పులు తీర్చడానికి ఇంటి స్థలాన్ని అమ్మటానికి వెళ్తే కొడుకులు వారి కుటుంబ సభ్యులు బెదిరింపులకు దిగుతున్నారని తల్లి తండ్రి ఈ సందర్భంగా చెప్పుకొచ్చారు. తల్లిదండ్రులు చిన్ననాటి నుండి పెంచి పెద్ద చేసి పెండ్లి చేసి వారి కుటుంబాల బాగోగులు చూసిన కన్న తల్లిదండ్రులని



కసాయితనంతో చూడటాన్ని చుట్టుపక్కల ప్రజలు అసహ్యించుకుంటున్న కుమారులు మాత్రం ససే మీరా సంఘటన చరిత్రలో మారుపేరుగా పెద్దమందడి ఉంటుందని అన్నారు, ఇట్టి విషయంపై వనపర్తి ఆర్డీవో స్పందిస్తూ ప్రభుత్వం తగు చర్యలు తీసుకుంటుందని ఆర్డిఓ హామీ ఇచ్చినట్లు ఫిర్యాదుదారులు రామ్ రెడ్డి , ఆయన సతీమణి అనసూయమ్మ తెలిపారు.

# బెల్ట్ షాపుల నిర్మూలనపై పూర్తిగా విఫలమైన అబ్కారి శాఖ

**మద్యానికి చింద్రమౌవుతున్న పేద,మధ్యతరగతి కుటుంబాలు.**

**దృష్టి సారించాలని ప్రజల వేడుకోలు**

బయ్యారం **(గౌతమ్ న్యూస్):** మహబూబాబాద్ జిల్లా య్యారం మండలంలోని గ్రామాలలో మధ్యం ఏరులై పారుతున్నా కనీసం కన్నెత్తి కూడా చూడని అబ్కారీ అధికారులు మండలంలోని గ్రామ పంచాయతీలలో మధ్యం విక్రయాలు జోరందుకున్నాయి. మండల వ్యాప్తంగా ప్రతి గ్రామంలో మూడు నుండి ఐదు పైగా బెల్ట్ షాపులు యదేచ్ఛగా మధ్యం అమ్మకాలు జరుగుతున్నాయి. మండల కేంద్రంలో గల మూడు వైన్ షాపులపై పటిష్టమైన పర్యవేక్షణ మాత్రం కరువైంది. మధ్యానికి బానిసైన కొందరు సమయపాలన లేకుండా మధ్యం సేవిస్తుండడంతో ఆయా కుటుంబాలలో భార్యభర్తల మధ్య తగాదాలు ఏర్పడుతున్నాయి.

### నిద్రావస్థలో అబ్కారీ శాఖ అధికారులు

మండల పరిధిలోని వివిధ గ్రామాలతో పాటు మండల కేంద్రంలోనూ బెల్టుషాపులు విచ్చలవిడిగా నిర్వహిస్తున్నా అబ్కారీ శాఖ



అధికారయంత్రాంగం మాత్రం చూసి చూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. మండల కేంద్రంలో మూడు వైన్ షాపులున్నాయి. కానీ మండల పరిధిలోని గ్రామాలలో మూడు లేదా అంతా కంటే ఎక్కువ బెల్టుషాపులు నిర్వహణ జరుగుతుందంటే ఆబ్కారీ శాఖ వైన్ షాప్ నిర్వాహకులకు మధ్య ఎంతటి ఒప్పందం ఉందో అర్ధమవుతుంది. గ్రామాల్లో తెల్లారింది మొదలు అర్ధరాత్రి వరకు విచ్చలవిడిగా మద్యం విక్రయాలు సాగుతున్నాయి. గ్రామాల్లోని బెల్టుషాపులు నిర్వాహకులు వైన్స్ యజమానులతో మాట్లాడుకొని కుమ్మక్కు అయ్యి ఎమార్పీ ధర కంటే ఒక్కో మద్యం సీసాపై 10 నుంచి 15 రూపాయలు ఎక్కువగా కొని గ్రామాల్లో మద్యం ప్రియుల నుండి ఒక్క సీసా నుండి 20 నుంచి 25 రూపాయల వరకు అదనంగా వసూలు చేసి సొమ్ము చేసుకుంటున్నారు. వైన్ షాపులలో దొరకని బ్రాండ్లు కూడా బెల్టు షాపులలో దొరుకుతున్నాయంటే ఆబ్కారీ శాఖ పర్యవేక్షణ పనితీరు ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు . పేద,మధ్యతరగతి కుటుంబాలు గల గ్రామాలలో రోజంతా కాయకష్టం చేసి సంపాదించిన కూలీ డబ్బులు మద్యం కోసం ఖర్చు చేస్తున్నారు. దీంతో ఆయా కుటుంబాలలో తగాదాలకు దారి తీస్తుంది. మద్యం మత్తులో కుటుంబాలలో ఘర్షణలకు దారితీసి హత్యలు జరిగిన ఘటనలు కోకొల్లలు, విచ్చలవిడి మద్యం విక్రయాల వల్ల విద్యార్థులు సైతం చెడు వ్యవసనాలకు అలవాటు పడుతున్నారు. ఇకనైనా బెల్ట్ షాపులపై దృష్టి సారించాలని ప్రజలు ఎక్సైజ్ శాఖ అధికారులు వేడుకుంటున్నారు.


## విద్యార్థులు అంతరిక్ష పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి

**ప్రధానోపాధ్యాయులు పి.వెంకటేశ్వర్లు.**

బయ్యారం,**(గౌతమ్ న్యూస్):** ప్రతి విద్యార్థి విద్యార్థి దశ నుండే శాస్త్ర,సాంకేతిక,అంతరిక్ష పరిజ్ఞానాన్ని




పెంపొందించుకోవాలంటూ జడ్ పి హెచ్ ఎస్ కొత్తపేట ప్రధానోపాధ్యాయులు తమ విద్యార్థులకు శుక్రవారం మండలంలోని కొత్తపేట జడ్ పి హెచ్ ఎస్ పాఠశాలలో జాతీయ అంతరిక్ష దినోత్సవం ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా విద్యార్థులు తయారు చేసిన చంద్రయాన్ 3 మోడల్ మరియు ప్రత్యేక వ్యోమగామి వేశాదారణలో నమూనాలను రూపొందించారు.



ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు పి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ విద్యార్థుల్లో అంతరిక్ష పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని, భావి భారత శాస్త్రవేత్తలు గా ఎదగాలని,నేటి విద్యార్థులే భావితరాల భవితవ్యపు మేదావులు అని వారు తెలిపారు. ఈ కార్యమమంలో ప్రధానోపాధ్యాయులు తో పాటు ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు తిరు వెంకటాచార్యులు, సైన్స్ టీచర్ ప్రకాష్ రెడ్డి, నహెద్,సరస్వతి, గోవర్దన్,పాఠశాల బృందం,విద్యార్థినీ,విద్యార్థులు పాల్గొన్నారు.

## శివంపేట్ మండలంలో పలు వివాహ, పుట్టినరోజు కార్యక్రమాలకు పాల్గొన్న

**నర్సాపూర్ మాజీ ఎమ్మెల్యే చిలుముల మదన్ రెడ్డి**

**శివంపేట్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొడకంచి సుదర్శన్ గౌడ్**



నర్సాపూర్**(గౌతమ్ న్యూస్):** శివంపేట మండలంలో కార్యక్రమలలో లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో పూజా కార్యక్రమంలో పాల్గొని పలు వివాహ ది శుభకార్యాలు మరియు జన్మదిన కార్యక్రమామం లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే మదన్ రెడ్డి గారు మరియు మండల పార్టీ అధ్యక్షులు కోడకంచి సుదర్శన్ గౌడ్ ఎక్స్ జెడ్పిటిసి లక్ష్మి కాంతారావు ఎక్స్ ఎంపిటిసి జంగం వెంకటేష్ కొడకంచి శ్రీనివాన్ బానంపల్లి శ్రీనివాన్ మంతూరి రమేష్ దొంతి శ్రీనివాస్ చెందినారా గౌడ్ రాజేష్ కాముని నాగేష్ తిరుపతి రాథోడ్ గణేష్ గౌడ్ పాండియా నాయక్ మహేష్ ఆంజనేయులు రాజేష్ చంద్రం మరియు నాగరాజు హనుమత్ రెడ్డి లింగం భూమయ్య తదితరులు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు



# రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మున్సిపల్ పరిధిలో దారుణం జరిగింది

శంషాబాద్ (గౌతమ్ న్యూస్): శంషాబాద్ మున్సిపల్ పరిధిలోని తొండుపల్లి ఇందిరమ్మ కాలనీ లో దారుణ హత్య కేసు యొక్క వివరములు ఏమనగా గత 35 సంవత్సరాల క్రితం దూలప్ప సరస్వతి కి ముగ్గురు కొడుకులు కలరు మరియు సరస్వతి కుటుంబ సభ్యులతో కలిసి కర్ణాటక రాష్టము నుండి తొండూపల్లి గ్రామానికి బ్రతుకుదేరువు గురించి వచ్చి ఇందిరమ్మ కాలనీ లో తాను, తన భర్త ధులప్ప రెడ్డి, వయస్సు 71 సంవత్సరాలు మరియు తన రెండవ కుమారుడు అగు శివ కుమార్ రెడ్డి, వయస్సు 36 సంవత్సరాలు ముగ్గురు కలిసి ఇందిరమ్మ కాలనీ లో నివాసముంటున్నారు. సరస్వతి రెండవ కుమారుడు శివ కుమార్ రెడ్డి మొదటగా డ్రైవింగ్ పనికి వెళ్ళేవాడు, ప్రస్తుతం గైడు గా వెళ్తున్నాడు. తన కొడుకు అగు శివ కుమార్ రెడ్డి కి చాలా సంవత్సరాల నుండి మద్యం తాగే అలవాటుంది. తాను పనికి వెళ్ళగా వచ్చే రూయపాయాలతో మద్యానికి మరియు ఇతర ఖర్చులకి వాడుకునేవాడు, గత కొంత కాలంగా శివ కుమార్ రెడ్డి తాను మద్యం తాగడానికి డబ్బులు కావాలని నా భర్త ను పెన్షన్ డబ్బులు ఇవ్వాలని వేదిస్తున్నాడు. అయితే ఈ రోజు అనగా 23.08.2024 నాడు సరస్వతి కొడుకు శివ కుమార్ రెడ్డి మద్యం తాగి ఇంటికి రావడం తో సరస్వతి భర్త మరియు సరస్వతి కొడుకు గొడవ పడుతుండగా సరస్వతి వారిని సముదాయించి బయటకు వెళ్ళినది. తర్వాత కొద్ది సేపటికి అందజ సమయం 14:00 గంటలకు ఆమె కొడుకు అరిచిన శబ్దం వినిపించగ వెంటనే సరస్వతి తన ఇంట్లోకి వెళ్ళి చూడగా ఆమె కొడుకు మంచం పై పడి మేడ బాగం లో మరియు ఎడమ కాలుకి కత్తి గాట్లు ఉండి రక్తం కారుతూ



కొట్టుకుంటూ వున్నాడు మరియు ఆమె భర్త చేతిలో కత్తి వున్నది కొద్ది సేపటికి ఆమె కొడుకు శివ కుమార్ రెడ్డి ఊపిరి ఆడక చనిపోయి వున్నాడు. వెంటనే ఆమె తన భర్త అగు ధులప్ప రెడ్డిని ఏమి జరిగినది అని అడుగగా మా కొడుకు శివకుమార్ రెడ్డి తరచుగా మద్యం త్రాగి డబ్బులు ఇవ్వాలని మమ్మల్ని వేధిస్తుండగా అట్టి వేధింపులు బాధలు పడలేక విసిగిపోయి మా ఇంట్లో వున్న చిన్న చిన్న చెట్లు కొట్టడానికి ఉపయోగించే కత్తితో మా కొడుకు యొక్క మెడపై కాలుపై నరికి చంపినట్లు తెలిపినాడు. ఇట్టి విషయం పై ఫిర్యాదురాలు %ూా% కివచ్చి అవసరమైన చర్య తీసుకోవాలి అని పిర్యాదు చేశారు. ఇట్టి విషయం పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునాము.

## బయ్యారం గ్రామ అభివృద్ధి స్థలం( సిఎంసి )ని కాపాడాలని మంత్రులని కలిసిన అఖిలపక్ష నాయకులు



బయ్యారం(గౌతమ్ న్యూస్): మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలంలోని అఖిలపక్షం పార్టీల నాయకులు హైదరాబాద్ లో ఇల్లందు నియోజకవర్గం శాసనసభ్యులు కోరం కనకయ్య, మరియు మహబూబాబాద్ ఎంపీ బలరామ్ నాయక్, రాష్ట్ర వ్యవసాయ శాఖ మాత్యులు తుమ్మల నాగేశ్వర్ రావు



మినిష్టర్ కోటర్స్ లో రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ షాక మాత్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ని కలిసి చౌదరి మైనింగ్ కంపెనీ( సిఎంసి ) గ్రామకంఠం భూమిని గ్రామానికే దక్కలని కోరుతూ మెమోరాండం ఇవ్వగా సానుకూలంగా స్పందించడం జరిగింది,ఈ కార్యక్రమంలో బయ్యారం పిఏసిఎస్ ఛైర్మెన్ మూల మధుకర్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ సిపిఐఎంల్ జిల్లా కార్యదర్శి,గౌని ఐలయ్య, సిపిఐఎంల్ రాష్ట్ర నాయకులు ములుకూరి జగ్గన్న,. సిపిఎం జిల్లా నాయకులు మంద రాజన్న, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కంబాల ముసలయ్య, సిపిఐ మండల కార్యదర్శి,సారిక శ్రీనివాస్, సిపిఐఎంల్ నాయకులు నందగిరి వెంకటేశ్వర్లు,టిడిపి నామబాబురావ్, ఆర్ఎస్ నాయకులుగంగులసత్యానారాయణ,జిల్లా కార్యదర్శి,ములుకూరి వీరారెడ్డి, టౌన్ కాంగ్రెస్ అధ్యక్షులు నాయిని శ్రీనివాస్ రెడ్డి, తిరుమల ప్రభాకర్ రెడ్డి, రాసామళ్ళ నాగేశ్వర్ రావ్,పగడాల శ్రీనివాస్,వెంకటపతి, పాల్గొన్నారు

## తాటి చెట్టు పై నుండి పడి చికిత్స పొందుతూ గౌడ మృతి



బయ్యారం(గౌతమ్ న్యూస్): మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలం కొత్తపేట ఈనెల 26న తాటి చెట్టు ఎక్కుతూ పైనుండి క్రింద పడిన వ్యక్తి చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందిన సంఘటన మండలంలోని కొత్తపేట గ్రామంలో చోటుచేసుకుంది. కొత్తపేట గ్రామానికి చెందిన చిర్ర సాంబయ్య(52) అనే గౌడ గత



నెల 26 సాయంత్రం తాటి చెట్టు పై నుండి పడగా చికిత్స నిమిత్తం జిల్లాలోని ఏరియా ఆసుపత్రికి తరలించారు. నాటి నుండి చికిత్స పొందుతూ ఆరోగ్యం విషమించి శుక్రవారం మధ్యాహ్నం తుది శ్వాస విడిచారు.కుటుంబ పోషణకు పెద్ద దిక్కుగా ఉన్న తను మరణించడంతో ఆ కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి. తమ ఏరియాలో గౌడ సొసైటీ లేకపోవడం వలన ఇలాంటి ప్రమాదాలు జరిగితే గౌడ లకు ప్రభుత్వం నుండి రావలసిన ఎటువంటి ఆర్థిక సహాయ సహకారాలు అందడం లేదని, దీనిని దృష్టిలో ఉంచుకొని మరే గౌడు కి ఇటువంటి అన్యాయం జరగకుండా గౌడ్స్ కి సొసైటీ ఏర్పాటు చేసుకునే విధంగా మంత్రులను,ప్రభుత్వాన్ని కలిసి గౌడ్స్ కు న్యాయం జరిగే విధంగా చూడాలని పలువురు గౌడన్నలు కోరుకుంటున్నారు.

## వరంగల్ జిల్లా కేంద్రంలో రోడ్డుపై తుపాకీ కలకలం

వరంగల్ (గౌతమ్ న్యూస్): వరంగల్ జిల్లా కేంద్రంలోని ఎంజీఎం జంక్షన్ లో గన్ ను పారేసుకున్నాడు ఓ సీఆర్ పీఎఫ్ కానిస్టేబుల్. ఈ సంఘటన శుక్ర వారం ఉదయం వెలుగులోకి వచ్చింది. వరంగల్ ఎంజీఎం జంక్షన్ యూనివర్సిటీ పరిధిలో ఉన్న బెటాలియన్ ను తరలించే క్రమంలో రోడ్డు పైన గన్ పడిపోయినట్టు తెలుస్తుంది..ఆ గన్ ను గుర్తించిన వరంగల్ మహానగరపాలక సంస్థ పారిశుద్ధ కార్మికుడు.. వెంటనే అధికారులకు సమాచారం అందించారు. ఆ తుపాకీని వరంగల్ మహానగర పాలక సంస్థ కమిషనర్ కు అందించాడు వరంగల్ మహా నగరపాలక సంస్థ పారిశుద్ధ కార్మికుడు. ఇక తుపాకీ సమాచారాన్ని పోలీసులకు చేరవేశారు వరంగల్ మహా నగర పాలక సంస్థ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే. ఇక దీనిపై పోలీసులు విచారణ చేస్తున్నారు. ఈ సంఘటన పై ఇంకా వివరాలు తెలియాల్సి ఉంది.

## మూడ్రోజులపాటు గవర్నర్ జిల్లాల పర్యటన

హైదరాబాద్ (గౌతమ్ న్యూస్): మూడ్రోజులపాటు గవర్నర్ జిల్లాల పర్యటన ఈ నెల 27 నుంచి



మూడు రోజులపాటు రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ జిల్లాల పర్యటన చేయనున్నారు. వరంగల్, యాదాద్రి జిల్లాల్లో ఆయన పర్యటించనున్నట్లు రాజ్ భవన్ వర్గాలు తెలిపాయి. ఆగస్టు 27న యాదాద్రి ఆలయం దర్శించుకోనున్నారని వెల్లడించాయి. అక్కడి నుంచి నేరుగా ములుగు జిల్లాకు వెళ్లి వివిధ రంగాల్లో విశేష ప్రతిభ చూపిన అవార్డు గ్రహీతలతో సమావేశమవనున్నట్లు పేర్కొన్నాయి. యునెస్కో గుర్తింపు పొందిన కాకతీయ కళా ఖండం రామప్ప ఆలయాన్ని వీక్షించి గవర్నర్ లక్నవరం సరస్సును సందర్శించనున్నారు.

## నర్సంపేటలో పాపన్నగౌడ్ జయంతికి బహుజనులు తరలిరండి

### మోకుదెబ్బ జిల్లా ప్రధాన కార్యదర్శి బుడిగె మల్లేష్ గౌడ్



నర్సంపేట (గౌతమ్ న్యూస్): నర్సంపేట పట్టణంలోని పాపన్నగౌడ్ సెంటర్ లో అదివారం జరుగు బహుజన వీరుడు శ్రీ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 374 వ జయంతి ఉత్సవాలకు బహుజనులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని గౌడ జన హక్కుల పోరాట సమితి (మోకుదెబ్బ) జిల్లా కమిటి ప్రధానకార్యదర్శి బుడిగె మల్లేష్ గౌడ్ పిలుపునిచ్చారు. విగ్రహాకమిటి, మోకుదెబ్బ అద్వర్యంలో నర్సంపేట పట్టణంలో నిర్వహించే సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి ఉత్సవాలు జయప్రదం చేయాలని ఖానాపురం మండలం మంగళవారిపేటలో కరపత్రాలను అవిష్కరించడం జరిగింది.ఈసందర్భంగా అయన మాట్లాడుతూ ఈ వేడుకను పురస్కరించుకొని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుండి ఉదయం 10 గంటలకు బహుజన సోదరులతో (గౌడ) బైక్ ర్యాలీ పాపన్న గౌడ్ విగ్రహం వరకు జరుగుతుంది. ర్యాలీ అనంతరం పాపన్న గౌడ్ విగ్రహాం వద్ద 11 గంటలకు సమావేశం నిర్వహించడం జరుగుతుందన్నారు. డివిజన్ లోని అన్ని మండలాల పరిధిలోని ప్రతి గ్రామం నుండి గౌడ్ లు,బహుజన సోదరులు సకాలంలో హాజరై పాపన్న గౌడ్ జయంతి కార్యక్రమం విజయవంతం చేయాలన్నారు.ఈకార్యక్రమంలో మంగళవారిపేట గౌడ సంఘం పెద్దలు,మోకుదెబ్బనాయకులు కోయ్యడి మల్లేశంగౌడ్ , మేర్గు గంగాధర్ గౌడ్ ,మక్కా పెద్ద వెంకన్నగౌడ్ ,బొమ్మగాని నవీన్ గౌడ్ ,రేఖశ్రీనుగౌడ్ ,మోడెం కొమ్మాలుగౌడ్ ,తాళ్ళపెల్లిచిన్న కమాలకర్ గౌడ్ ,తొట్లప్రసాద్ గౌడ్ ,మక్కా రాములుగౌడ్ ,మక్కాలింగన్నగౌడ్ తదితరులు పాల్గోన్నారు.

## కొండాపూర్‌లో హైటెక్ వ్యభిచార గుట్టురట్టు




హైదరాబాద్ (గౌతమ్ న్యూస్): హైదరాబాద్‌లో హైటెక్ వ్యభిచార ముఠా గుట్టును రట్టు చేశారు. పోలీసులు విదేశీ యువతులతో ఆన్‌లైన్ వెబ్‌సైట్ ద్వారా ఆర్గనైజ్డ్‌గా వ్యభిచారం చేయిస్తున్న గ్యాంగ్ ఆటకట్టించారు. కొండాపూర్ ఒక ఇండి పెండెంట్ హౌస్‌లో గుట్టుగా గలీజు దందా సాగుతుం దన్న సమాచారంతో గచ్చి బౌలి, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ పోలీసులు దాడులు చేశారు. 17 మంది విదేశీ యువతు లను అదుపులోకి తీసుకుని సేఫ్ హౌస్‌కు తరలించారు. వీరిలో కెన్యా దేశానికి చెందిన 14 మందితో పాటు ఉగాండా, టాంజానియా దేశాలకు చెందిన యువ తులు ఉన్నట్టు గుర్తించారు. వ్యభిచార ముఠా నిర్వా హకుడు శివ కుమార్‌తో పాటు ఇద్దరు విటులను పోలీసులు అరెస్టు చేశారు. లోకాంటో అనే వెబ్‌సైట్‌లో యువతుల ఫోటోలు పెట్టి విటులను రప్పిస్తున్నట్టు పోలీసులు తెలిపారు. స్పాట్ నుంచి 4 మొబైల్ ఫోన్లు, 25 హెచ్ఐవీ కిట్లు, హుక్కా పాట్స్, 20 వేల రూపాయల నగదు స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. వ్యభిచార దందాలపై నగర వాసులు అప్రమత్తంగా ఉండాలని, ఇటువంటి గురించి తెలిస్తే తమకు సమాచారం అందించాలని సూచించారు.

## గౌతమ్ న్యూస్ కు స్పందన!! తెలంగాణ పిసిసి అధ్యక్షులుగా మహేష్ కుమార్ గౌడ్!!!

నాగర్ కర్నూల్, వనపర్తి బ్యూరో(గౌతమ్ న్యూస్): ఎన్నో రోజుల నుంచి ఉత్కంఠగా ఎదురుచూస్తున్న తెలంగాణ పిసిసి అధ్యక్షునిగా బీసీ సామాజిక వర్గానికి చెందిన ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ నియమిస్తూ కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకులు నిర్ణయం తీసుకున్నట్లు



ఆ పార్టీ వర్గాల ద్వారా తెలిసింది, దీంతో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుని ఎంపిక కు సస్పెన్షన్ వీడింది, ఇటీవల తెలంగాణ పిసిసి అధ్యక్షునిగా మహేష్ కుమార్ గౌడ్ ను కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం ఎంపిక చేసినట్లు గౌతమ్ న్యూస్ తెలుగు దిన పత్రికలో ప్రత్యేక కథనం ప్రచురించిన విషయం పాఠకులకు తెలిసిందే అందుకు అనుగుణంగా మహేష్ కుమార్ గౌడు ను పిసిసి అధ్యక్షులు గా నియమిస్తూ ఢిల్లీలోని అగ్ర నాయకులతో జరిగిన సమావేశంలో నిర్ణయం తీసుకున్నట్లు ఆ పార్టీ వర్గాలు పేర్కొన్నాయి, బీసీ సామాజిక వర్గానికి చెందిన నాయకునికి బాధ్యతలు అప్పజెప్పడం వల్ల రాబోయే రోజుల్లో తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ మరింత పూర్తిస్థాయిలో బలోపేతం అవుతుందని ఉద్దేశంతో కాంగ్రెస్ అగ్ర నాయకులు పిసి సామాజిక వర్గం వైపు మొగ్గుచూపినట్లు తెలుస్తుంది, త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల లో పిసిసి బిసి సామాజిక వర్గానికి చెందిన మహేష్ కుమార్ గౌడ్ ఎంపిక ఎంతో దోహదపడుతుందని పలువురు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అంటున్నారు, పిసిసి పదవి కోసం ఇంతకాలం ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన నాయకులు

## బీసీలకే పీసీసీ బెర్త్ ఖరారు!!





గౌతమ్ న్యూస్ తెలుగు దిన పత్రిక

కొత్త పిసిసి రథసారథి మహేష్ గౌడ్

స్థానిక సంస్థల ఎన్నికల దృష్ట్యా కాంగ్రెస్ కమిటీలు!!

చింతలమోరి గుడిసెల్లో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసిన డిప్యూటీ డీ.ఎం.హెచ్.ఓ క్రాంతి కుమార్

పోటీ పడినప్పటికీ ఇప్పటికీ రాష్ట్రంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన ఉప ముఖ్యమంత్రిగా కొనసాగుతున్న తరుణంలో అత్యంత ప్రాముఖ్యత గల పీసీసీ అధ్యక్ష పదవి బీసీలకు కట్టబెట్టడంలో కాంగ్రెస్ పార్టీ సక్సెస్ అయిందని చెప్పవచ్చు రాష్ట్రంలో బీసీ జనాభా అధికంగా ఉన్న నేపథ్యంలో



ప్రధాన బాధ్యతలు బీసీలకు ఇవ్వాలని ఉద్దేశంతో పార్టీ ఈ నిర్ణయం తీసుకోవడం జరిగిందని పలువురు కాంగ్రెస్ పెద్దలు అంటున్నారు, ముందుగానే ఊహించిన విధంగా పిసిసి అధ్యక్ష పదవి మహేష్ కుమార్ గౌడు కు దక్కుతుందని ముందుగానే ఊహించి రాజకీయ విశ్లేషణ జరుగుతున్న పరిణామాలపై గౌతమ్ న్యూస్ తెలుగు దినపత్రిక ఇటీవల ప్రత్యేక కథనాన్ని ప్రచురించిన విషయం పాఠకులు గుర్తు చేసుకుంటున్నారు, పిసిసి అధ్యక్షుని ఎంపిక పట్ల తెలంగాణ రాష్ట్రంలోని బీసీ కులసంఘాల నాయకులు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలుపుతున్నారు,

## విష జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలి

### : జిల్లా కలెక్టర్ డాక్టర్ డాక్టర్ సత్య శారద

### బానోజీపేట పి హెచ్ సి, ఆరోగ్య శిబిరం, అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్ లను తనిఖీ



నర్సంపేట (గౌతమ్ న్యూస్): మలేరియా, డెంగ్యూ విష జ్వరాలు ప్రబలకుండా వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ డాక్టర్ సత్య శారద పేర్కొన్నారు. శుక్రవారం నర్సంపేట మండలంలోని బానోజీపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ తనఖీ చేశారు. ఫీవర్ సర్వే మందుల రికార్డులను తనిఖీ చేశారు. మలేరియా డెంగ్యూ , విష జ్వరాల వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గత నాలుగు రోజులుగా జ్వరాలు ఉన్నట్లయితే తప్పనిసరిగా పరీక్షలు చేయాలన్నారు ఇప్పటికే జిల్లాలోని అన్ని ఆరోగ్య ఉప కేంద్రాలకు జ్వరాల టెస్ట్ కిట్లను అందించామని, ఆశ వర్కర్లు, ఏఎన్ఎంలు తప్పనిసరిగా క్షేత్రస్థాయిలో తిరగాలని కలెక్టర్ సూచించారు. ఒకవేళ మలేరియా, డెంగ్యూ, విష జ్వరాలతో సీరియస్ గా ఉంటే ఎంజీఎం ఆసుపత్రికి రిఫర్ చేయాలని అన్నారు. నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సిబ్బందితో పాటు మందులు అందుబాటులో ఉండేలా చూసుకోవాలన్నారు. బానోజీపేటలో నిర్వహిస్తున్న ఆరోగ్య శిబిరాన్ని కలెక్టర్ సందర్శించి అందిస్తున్న వైద్యం గురించి రోగులకు కలెక్టర్ నేరుగా అడిగి తెలుసుకున్నారు.హెల్త్ క్యాంప్ లో రోగులకు అందిస్తున్న ఔషధాలను ఈ సందర్భంగా కలెక్టర్ పరిశీలించారు. అనంతరం నర్సంపేట లోని అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్ ను కలెక్టర్ సందర్శించి విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులతో కలిసి కలెక్టర్ భోజనం చేశారు. విద్యార్థులకు గుణాత్మక విద్య అందించడంతోపాటు మెనూను తు.చ. తప్పకుండా పాటిస్తూ నాణ్యమైన ఆహారాన్ని అందించాలని సూచించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతోపాటు పారిశుద్ధ్యం మెరుగుపరచు కోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ అరుణ్ చంద్ర, రెసిడెన్షియల్ స్కూల్ ప్రత్యేక అధికారి ఇసాక్ అలీ, వైద్యాధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ రేషన్ కార్డుదారులకు శుభవార్త ఇకపై రాయితీపైనే వస్తువులు..!!!



హైదరాబాద్ (గౌతమ్ న్యూస్): తెలంగాణ రాష్ట్ర రేషన్ కార్డుదారులకు అదిరిపోయే శుభవార్త చెప్పింది రేవంత్ రెడ్డి ప్రభుత్వం. రేషన్ కార్డులు ఉన్నవారికి రాయితీపైన గోధుమలను పంపిణీ చేయాలని రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఓ నిర్ణయానికి వచ్చింది. ప్రస్తుతానికి అయితే హైదరాబాద్ మహానగరంలో మాత్రమే గోధుమలను డిస్కౌంట్ ధరలో రేషన్ కార్డుదారులకు అందిస్తుంది తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం. అయితే ఇకపై తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా హైదరాబాద్ మాదిరిగానే పంపిణీ చేయాలని.. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కీలక ఆదేశాలు ఇవ్వడం జరిగింది. అలాగే 500 రూపాయలకు గ్యాస్ సిలిండర్ల పంపిణీ పైన కూడా ఆయన సమీక్ష నిర్వహించడం జరిగింది. సిలిండర్ కొనుగోలు చేసిన వినియోగదారులకు 48 గంటల సమయంలోనే వారి డబ్బులను అకౌంట్లో వేయాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

## సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల ప్రావిడెంట్ ఫండ్ పాస్ బుక్ అందజేతలో జాప్యం ...

### కమిషనర్ కనకమ్మకు వినతి పత్రం అందజేసిన కాంట్రాక్ట్ కార్మికులు



కొత్తగూడ (గౌతమ్ న్యూస్): సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల సి ఎం పి ఎఫ్ పాస్ బుక్ లు అందజేతలో జాప్యం ఎందుకని సత్వరమే 2024 మార్చి 31వ తేదీ వరకు మూడు సంవత్సరాల కు సంబంధించిన సంబంధిత కాంట్రాక్ట్ కార్మికుల పిఎఫ్ జమ వివరాలు తెలియజేయాలని కోరుతూ ఐ ఎఫ్ టి యు ఆధ్వర్యంలో శుక్రవారం పివి కాలనీ కమ్యూనిటీ హాల్ లో జరిగిన సింగరేణి కార్మికుల పెన్షన్ అదాలత్ కార్యక్రమానికి విచ్చేసిన అతిథులు కొత్తగూడెం రీజియన్ సీఎం పి ఎఫ్ కమిషనర్ ఎం కనకమ్మ కి, ఏరియా జిఎం దుర్గం రామచందర్ కి ఏరియా అధికార ప్రతినిధి ఎస్ రమేష్, పిఎఫ్ అధికారి చిరంజీవి, ఏరియా గుర్తింపు సంఘం నాయకులు వై రాంగోపాల్ , ప్రాతినిధ్య సంఘం నాయకులకు వి కృష్ణంరాజు ల సమక్షంలో అదాలత్ వేదికపైనే వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ మణుగూరు ఏరియా అధ్యక్షులు అంగోత్ మంగీలాల్ మాట్లాడారు 2024 మార్చి 31 వరకు మూడు సంవత్సరాల కాంట్రాక్ట్ కార్మికుల పిఎఫ్ జమ వివరాలు అందజేతలో జాప్యం జరుగుతోందని వీలైనంత త్వరగా ఇచ్చే విధంగా తగు చర్యలు చేపట్టాలని కోరారు. దీంతోపాటు చనిపోయిన లేదా అనివార్య కారణాల వలన పని మానివేసిన కాంట్రాక్ట్ కార్మికులకు సంబంధించి పిఎఫ్ వాపస్ (రిటర్న్)త్వరగా పరిష్కారం అయ్యేలా చూడాలని, కొత్తగా పనిలో చేరిన వారికి ఐడి తో పాటు పిఎఫ్ నెంబర్ లు కూడా వెంటనే ఇవ్వాలని, మాజీ కాంటాక్ట్ కార్మికులకు డిపెండెంట్ లకు పెన్షన్ సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్.కె ఇమామ్ బీ, భాషా నాయక్, యోహాన్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## నా పదవి పోయినా పర్వాలేదు.. ఆ స్థలం లీజుకు ఇచ్చేది లేదు..!

**అమరావతి,:** నర్సీపట్నం ఆర్టీసీ కాంప్లెక్స్ ఖాళీ స్థలంలో ప్రైవేటు నిర్మాణాల కోసం కేటాయించిన స్థలంలో కాంట్రాక్టరు డంపింగ్ చేసిన మట్టిని పరిశీలించి ఆగ్రహం వ్యక్తం చేసాడు ఏపీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు. అవసరమైతే నా పదవి పోయినా పర్వాలేదు.. కానీ ఆర్టీసీ స్థలం మాత్రం లీజుకు ఇచ్చేది లేదు అని స్పష్టం చేసారు. రైతుల్ని ఒప్పించి అప్పట్లో ఆర్టీసీకి స్థలం సేకరించాం. దీనిని ఆర్టీసీకే వినియోగించాలి. ఇది ప్రజల స్థలం.. ప్రజలే దీనిని కాపాడుకోవాలి. ఆ రోజు రైతులు త్యాగం చేసి స్థలం ఇస్తే.. ప్రస్తుతం ఎవరో వచ్చి వ్యాపారం చేయడమేంటి..? గతంలో సీఎం చంద్రబాబు, మంత్రి అచ్చెన్నాయుడు వద్ద ఈ విషయం ప్రస్తావించా. అయితే ఇక్కడ ప్రైవేటు వ్యక్తులు మట్టి వేసినా విషయం తెలిసినా డిపో మేనేజరు ఎందుకు ప్రశ్నించలేదు అని అడిగారు. దీన్ని బట్టి చూస్తే డిపో మేనేజరు, కాంట్రాక్టరు కుమ్మక్కయ్యారని అనుకోవాల్సి ఉంటుంది. వెంటనే ఇక్కడ ఆర్టీసీ సెక్యూరిటీని సస్పెండ్ చేసి పనులు ఆపాలి. ఆలాగే ఆర్టీసీ స్థలంలో మట్టిని తరలించిన కాంట్రాక్టర్ పై పోలీస్ కేసును పెట్టాలని 24 గంటల్లో యాక్షన్ తీసుకోవాలని ఆ సమాచారాన్ని నాకు ఇవ్వాలని ఆర్టీసీ డిపో మేనేజర్ ను ఆదేశించారు అయ్యన్నపాత్రుడు.

## యుద్ధ పీడిత ఉక్రెయిన్ ప్రధాని జెలెన్స్కీకి భుజం తట్టిన మోడీ.. భావోద్వేగం



న్యూఢిల్లీ: పోలాండ్‌లో రెండు రోజుల పర్యటన ముగించుకుని ప్రధాని నరేంద్ర మోడీ ఉక్రెయిన్‌కు చేరుకున్నారు. దాదాపు పది గంటల రైలు ప్రయాణం తర్వాత కీవ్ నగరంలో కాలు మోపారు. నగరంలోని భారతీయులను మోడీ కలిశారు. 'భారత్ మాతాకీ జై ' అనే నినాదాలు చేస్తూ ఎంతో ఉత్సాహంగా వారు మోడీనికి స్వాగతం పలికారు. వారి యోగక్షేమాలను ప్రధాని అడిగి తెలుసుకున్నారు. అనంతరం అక్కడున్న మహాత్మా గాంధీ విగ్రహానికి నివాళులర్పించారు. దాదాపు ఏడు గంటల పాటు ప్రధాని నగరంలో పర్యటించనున్నారు. ఈ సమయంలో మోడీ.. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీ సమావేశంపై ఆ దేశంలో ఉత్కంఠ నెలకొంది. అంతకు ముందు భారత ప్రధాని నరేంద్ర మోడీ యుద్ధ పీడిత ఉక్రెయిన్ రాజధాని కీవ్ చేరుకోగా.. ఆయనకు ఉక్రెయిన్ అధ్యక్షుడు వోలోడిమిర్ జెలెన్స్కీ స్వాగతం పలికారు. 1991లో సోవియట్ యూనియన్ నుంచి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత భారత ప్రధాని ఉక్రెయిన్‌లో పర్యటించడం ఇదే తొలిసారి. రష్యా, ఉక్రెయిన్ మధ్య మరోసారి యుద్ధ వాతావరణం పెరిగిన తరుణంలో మోడీ పర్యటన కీలకంగా మారనుంది. దీనికి సంబంధించిన ఓ వీడియో బయటకు వచ్చింది. ఇందులో నేతలిద్దరూ ఆలింగనం చేసుకున్నారు. ఇద్దరు నాయకులు ముందుకు సాగారు. అక్కడ టీవీ స్క్రీన్ ఏర్పాటు చేశారు. 'మే 2022 లో ఖార్కివ్‌లో జరిగిన బాంబు దాడిలో 5 నెలల చిన్నారి మరణించింది.' అని టీవీ స్క్రీన్ పై రాశారు. రష్యా-ఉక్రెయిన్ యుద్ధంలో అమరులైన ఉక్రెయిన్ సైనికులకు ప్రధాని మోడీ నివాళులర్పించారు.

## మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లికి బెయిల్



**అమరావతి,:** మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డికి ఏపీ హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది. ఎన్నికల టైమ్‌లో టీడీపీ ఏజెంట్ నంబూరి శేషగిరిరావుపై దాడి కేసు, పోలింగ్ తర్వాత కారంపూడిలో సీఐ నారాయణస్వామిపై దాడి కేసుల్లో పిన్నెల్లికి ఏపీ ఉన్నత న్యాయస్థానం బెయిల్ ఇచ్చింది. షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేస్తూ ఏపీ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. పాస్ పోర్ట్ సమర్పించాలని పిన్నెల్లికి కోర్టు ఆదేశాలు జారీ చేసింది. విచారణ అధికారి దగ్గరకు వారానికి ఒకసారి వెళ్లి సంతకం చేయాలని షరతు విధించింది.50 వేలతో రెండు పూచీ కత్తులు సమర్పించాలని, దేశం విడిచి వెళ్లొద్దని పిన్నెల్లికి హైకోర్టు ఆదేశించింది. షరతులకు కట్టుబడి ఉంటానని.. బెయిల్ ఇవ్వాలని పిన్నెల్లి కోరగా ఈ మేరకు కోర్టు బెయిల్ మంజూరు చేసింది. మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డికి హైకోర్టు బెయిల్ మంజూరు చేసిన నేపథ్యంలో నెల్లూరులోని కేంద్ర కారాగారం వద్ద పోలీసులు అప్రమత్తమయ్యారు. జైలు వద్ద బారికేడ్లు ఏర్పాటు చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో ఈ ఏడాది మే 13వ తేదీన జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఈవీఎంలు ధ్వంసం చేసిన ఘటనలు చోటు చేసుకున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి పై ఈవీఎం ధ్వంసం చేసిన కేసు, హత్యాయత్నం వంటి కేసులు నమోదయ్యాయి. దీంతో పిన్నెల్లిని పోలీసులు కొన్ని నెలల క్రితం అరెస్ట్ చేశారు. జూన్ 26 నుంచి పిన్నెల్లి నెల్లూరు జైలులోనే ఉన్నారు. ఎన్నికల టైమ్‌లో టీడీపీ ఏజెంట్ నంబూరి శేషగిరిరావుపై దాడి కేసు, పోలింగ్ తర్వాత కారంపూడిలో సీఐ నారాయణస్వామిపై దాడి కేసులో బెయిల్ ఇవ్వాలని పిన్నెల్లి పిటిషన్ దాఖలు చేసిన సంగతి తెలిసిందే. అయితే ఆయన తనకు బెయిల్ ఇవ్వాలని హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై పిన్నెల్లి రామకృష్ణారెడ్డి తరఫున న్యాయవాదులు తమ వాదనలు వినిపించారు. ప్రభుత్వం తరఫున న్యాయవాదుల వాదనలు విన్న హైకోర్టు ధర్మాసనం తీర్పు రిజర్వ్ చేసింది. నేడు పిన్నెల్లికి బెయిల్ మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

## ఫార్మా బాధితులకు పరామర్శ.. ప్రభుత్వం తీరుపై జగన్ అభ్యంతరం..

**అమరావతి,:** ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అచ్యుతాపురం ఫార్మా కంపెనీ బాధితులను పరామర్శించిన మాజీ సీఎం వైఎస్ జగన్.. అచ్యుతాపురం ప్రమాదంపై ప్రభుత్వం తీరు బాధాకరం అన్నారు.. మధ్యాహ్నం 2.20 గంటలకు ప్రమాదం జరిగితే ప్రభుత్వం స్పందించ కూడదు అనే తాపత్రయం కనిపించిందని దుయ్యబట్టారు.. హోం మంత్రి సహాయచర్యలు పర్యవేక్షణ కోసం వెళుతున్నాను అనే మాటే చెప్పలేదు.. ఫ్యాక్టరీలు ఏ శాఖ పరిధిలోకి వస్తుందో పరిశ్రమల మంత్రికి తెలియదు ఎంత మంది చనిపోయారు తెలియదని చెప్పారు.. ఘటనా స్థలానికి అంబులెన్సులు కూడా పంపలేకపోయారు.. కంపెనీ బస్సుల్లో బాధితులను తరలించాల్సి వచ్చిందంటు మండిపడ్డారు.. అదే, ఎల్‌జీ పాలిమర్ ప్రమాదం అర్ధరాత్రి జరిగితే కలెక్టర్, పోలీసులు, అంబులెన్సులు సంఘటనా స్థలికి హుటాహుటిన తరలించాం.. 11 గంటలకు నేను స్పాట్ కు వచ్చాను అని గుర్తుచేసుకున్నారు. కోవిడ్ ఇబ్బందులు అధిగమించి సైతం రెస్క్యూ చేశాం తొలిసారి కోటి రూపాయల నష్ట పరిహారం చెల్లించామన్నారు. అయితే, అచ్యుతాపురం ఘటనలో ప్రమాదం జరిగినప్పుడు ప్రభుత్వం స్పందించిన తీరు అభ్యంతరకరం అన్నారు జగన్.. ప్రభుత్వం అనేది సానుభూతి, బాధ్యత తో వ్యవహరించాలన్న ఆయన.. జగన్ హయాంలో ప్రమాదాలు జరిగాయని చంద్రబాబు చెబుతున్నారు.. మరి చంద్రబాబు హయాంలో జరిగిన ప్రమాదాల సంగతేంటి? అని ప్రశ్నించారు. ప్రస్తుత సీఎస్ నీరాబ్ కుమార్ కమిటీ వేసి వైసీపీ ప్రభుత్వం హయంలో సమగ్ర నివేదిక రూపొందించి అమలు చేశాం.. కంపెనీలు సమర్పించే నివేదికలపై థర్డ్ పార్టీ ఆడిట్ లు, సేవలు దుబాటులోకి తీసుకుని వచ్చామని తెలిపారు. ప్రతీ పరిశ్రమను తనిఖీ చేసిన తర్వాత అందులో వెలుగు చూసిన లోపాలను సరిదిద్ది కోవడానికి గడవు ఇచ్చి ప్రోటో కాల్ ఖచ్చితంగా పాటించేలా జీవో ఇచ్చామని గుర్తుచేశారు. గత ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలను మానిటర్ చేయడం మానేశారు ఈ ప్రభుత్వానికి గవర్నెన్స్ మీద, సంక్షేమ పథకాల అమలు మీద లేదు.. కేవలం రెడ్ బుక్ మీదనే ధ్యాస్ వుంది రెడ్ బుక్ తెరవడం దానిని ఫాలో అవ్వడం మాత్రం కనిపిస్తోందని విమర్శించారు. స్కూళ్లు, హాస్పిటల్లో, పరిశ్రమలు ఇలా అన్ని వ్యవస్థలను ఇబ్బందుల్లోకి నెట్టేస్తునారని ఆరోపించారు వైఎస్ జగన్.. ఆరోగ్య శ్రీ, విద్యా దీవెన కింద బకాయిలు విడుదల చేయడం లేదు.. రోగులు. విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.. రైతులకు పెటుబడు సహాయం ఒక్క రూపాయి ఇవ్వలేదు.. 2023-24 ఇన్సూరెన్ ప్రీమియం చెల్లించని కారణంగా రైతుల బీమా ఎగిరిపోయింది.. ప్రభుత్వంలో అవినీతి పెరిగిపోయింది రాష్ట్రంలో కక్షలు, హింస తప్ప పాలనలో మంచి చేయాలనే పరిస్థితులు లేవు అన్నారు. పరిహారం సానుభూతితో సరైన సమయంలో ఇవ్వాలి.. హాస్పిటల్లో బాధితులకు ఒక్క రూపాయ కూడా అందలేదని విమర్శించారు.. గతంలో తెచ్చిన పరిశ్రమలపై ప్రొటోకాల్ పాటించాలి.. పరిశ్రమలో ఎస్ఓపి లు బాగా జరిగేవి కానీ ప్రమాదానికి కారణాలు తెలియవని బాధితులు చెప్పారని మీడియాకు వివరించారు వైఎస్ జగన్.. ప్రొటోకాల్ ఖచ్చితంగా అమలు చేయడం , సేఫ్టీ పరా మీటర్స్ పాటించాలి. మూడు వారాలు ప్రభుత్వానికి గడువు ఇస్తున్నాను పరిహారం చెల్లింపులో ఆలస్యం జరిగితే బాధితుల పక్షాన వైసీపీ పోరాడుతుంది. స్వయంగా నేనే ధర్నాకు వస్తాను ఇది ప్రభుత్వానికి హెచ్చరిక అంటూ హాట్ కామెంట్లు చేశారు మాజీ సీఎం వైఎస్ జగన్..

## తెలంగాణ రాష్ట్రంలో ఇప్పుడు మళ్లీ మంచి రోజులు వచ్చాయి




: ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి

మహబూబ్ నగర్ (గౌతమ్ న్యూస్): తెలంగాణ రాష్ట్రం లో ఇప్పుడు మంచి రోజులు వచ్చాయి అని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే శ్రీ యెన్నం శ్రీనివాస్ రెడ్డి గారు అన్నారు. మహబూబ్ నగర్ జిల్లా హన్వాడ మండలానికి చెందిన 100 మందికి కళ్యాణ లక్ష్మి మరియు షాది ముబారక్ లబ్దిదారులకు మహబూబ్ నగర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో చెక్కులను అందజేశారు. అంతకు ముందు ఆయన మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఇచ్చిన మాట ప్రకారం ఆరు గ్యారెంటీ పథకాలను అమలు చేస్తుందని, అన్ని వర్గాల అభ్యున్నతి కోసం గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి సారథ్యంలో తెలంగాణ రాష్ట్రాన్ని మొదటి స్థానంలో నిలిపేందుకు ఎంతో కృషి చేస్తున్నామని, మహిళా సంక్షేమానికి పెద్దపీట వేస్తూ ఇచ్చిన మాట నిలబెట్టుకోవడం కోసం ఎన్ని ఆటంకాలు ఎదురైనా ప్రజలకు అందించే ఉచిత పథకాలు అందిస్తూ, పేదల ఆత్మ గౌరవం పెంపొందిస్తున్నామని, మహిళల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత బస్సు ప్రయాణం ఇంకా సులభతరం చేయుటకు ఈ మధ్యనే కొత్తగా 1000 బస్సులు పెంచానామని, రానున్న రోజుల్లో ఇంకా ఎక్కువ బస్సులను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం జరుగుతుంది అని ఆయన స్పష్టం చేశారు. గత పాలకులు చేసిన అప్పులు ఎనిమిది లక్షల కోట్ల రూపాయలు తలకు మించిన భారంగా ఉన్నప్పటికీ, 25 లక్షల కుటుంబాలను రైతు రుణమాఫీ ద్వారా రుణ విముక్తి చేసిన విషయం గుర్తు చేశారు. ప్రభుత్వానికి ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ప్రజలకు అందించే సంక్షేమ పథకాలకు ఏ ఆటంకం మరియు లోటు లేకుండా ప్రజా పాలన కొనసాగిస్తున్నామని ఆయన స్పష్టం చేశారు. అందుకే మీరుకూడా మాకు అన్ని విధాలా సహకారం అందించి మీకు అభయం ఇచ్చే కాంగ్రెస్ పార్టీ కి అండగా నిలవాలి అని ఆయన సూచించారు. అనంతరం లబ్దిదారులకు కళ్యాణ లక్ష్మి మరియు షాది ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహేందర్, బుద్దారం సుధాకర్ రెడ్డి, నవనీత , శారద, జి. నర్సింహులు, యాదిరెడ్డి, రామకృష్ణ, యాదన్న యాదవ్, రామకృష్ణ, వెంకటాద్రి, వెంకటయ్య, బొట్టు శ్రీను, రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి రహిత వృద్ధి వృథాయే!




కోవిడ్ లాంటి విపత్కర పరిస్థితుల తరువాత ఎదురైన ఆర్థిక సవాళ్లను అధిగమించి ప్రపంచంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా భారత్ నిలబడింది. కాబట్టి భవిష్యత్తులో భారత్ ఒక బలమైన ఆర్థిక శక్తిగా ఎదిగే అవకాశాలు ఉన్నా యని ఆర్థిక రంగ నిపుణులు భావిస్తున్నారు. స్థిరమైన వృద్ధిరేటుతో పాటు ఉద్యోగ ఉపాధి అవకాశాల కల్పనతోనే 2047 నాటికి భారత్ 'వికసిత్ భారత్' లక్ష్యాన్ని చేరుకో గలుగుతుంది. ఒక్క సంపద సృష్టితోనే ఏ ఆర్థిక వ్యవస్థా బలంగా ఎదగలేదు. సంపద వృద్ధితో పాటు మానవ వనరుల ప్రమాణాలను పెంచే ఉపాధి ఉద్యోగ అవకాశాల కల్పన తోనే ఏ ఆర్థిక వ్యవస్థ అయినా బలంగా ఎదుగుతుంది. కానీ ఆరు దశాబ్దాల ప్రణాళికా యుగంలో భారత దేశంలో వృద్ధిరేటు ఉపాధి రహితంగా మందకొడిగా కొనసాగింది. ఫలితంగా ఉద్యోగ అవకాశాల సృష్టిలో వెనకబడటం వలన దేశంలో నిరుద్యోగ సమస్య తీవ్ర రూపం దాల్చింది. 1991 నుండి దేశంలో సరళీకృత ఆర్థిక విధానాలు ప్రవేశపెట్టిన తరువాత ఆర్థిక వృద్ధిరేటు పెరిగినా అది కూడా ఉపాధి రహితంగానే కొనసాగిందనే చెప్పాలి. ఢిల్లీ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ వజ్రోత్సవంలో పాల్గొన్న సందర్భంగా అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ గీతా గోపీనాథ్ మాట్లాడుతూ... భారత దేశంలోని ఉద్యోగ ఉపాధి కల్పనపై కీలక వ్యాఖ్యలు చేశారు. ఉద్యోగాల కల్పనలో భారతదేశం జీ-20 దేశాల కంటే వెనకబడి ఉంది. అలాగే 2010- 20ల మధ్యకాలంలో దేశంలో సగటు వృద్ధిరేటు 6.6 శాతంగా ఉంటే ఉపాధి కల్పన రేటు మాత్రం కేవలం రెండు శాతం గానే ఉంది. అంటే ఇప్పటికీ భారతదేశంలో ఉపాధి రహిత వృద్ధి కొనసాగు తోందని గీతా గోపీనాథ్ కూడా భావిస్తున్నారని చెప్పాలి. సులభతర వ్యాపారం ద్వారా దిగుమతి సుంకాలను తగ్గించి మరింత ప్రైవేటు పెట్టబడులను ఆకర్షించటం ద్వారా ఉద్యోగాల సృష్టి జరగటానికి అవకాశం ఉంటుందని గీతా గోపీనాథ్ సూచిస్తున్నారు. 2024- 25 ఆర్థిక సంవత్సరానికి జీడీపీ వృద్ధిరేటు 6.5 శాతం నుండి 7 శాతం వరకు ఉండే అవకాశం ఉందని ఆర్థిక సర్వే భావిస్తోంది. అలాగే ప్రపంచ బ్యాంకు కూడా భారత్ వార్షిక వృద్ధి రేటు 6.3 శాతంగా ఉండే అవకాశం ఉందని అంచనా వేస్తోంది. కానీ సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమీ (సీఎమ్ఐఈ) రిపోర్ట్ ప్రకారంగా 2014లో 5.4 శాతంగా ఉన్న నిరుద్యోగితా రేటు 2024 మొదటి త్రైమాసికానికి 9.2 శాతానికి పెరగటం, పీరియాడికల్ లేబర్ ఫోర్స్ సర్వే ప్రకారంగా 15 ఏళ్లు పైబడిన వయసుగల వారిలో నిరుద్యోగిత రేటు 17 శాతంగా ఉండటం కూడా ఆందోళన కలిగించే అంశం. ఆర్థిక మందగమనం వలన ప్రైవేట్ రంగంలో, ప్రభుత్వ విధానాల వలన ప్రభుత్వ రంగంలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయడంలో జాప్యం వలన నిరుద్యోగ సమస్య తీవ్రత దేశంలో పెరుగుతుందని చెప్పాలి. 3,942 అమెరికన్ డాలర్ల జీడీపీగా ప్రపంచంలో ఐదవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉన్న భారత్... గీతా గోపీనాథ్ చెప్తున్నట్లు 2027 నాటికి జర్మనీ, జపాన్‌లను కూడా అధిగమించి మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదగవచ్చు. కానీ ఆ ఎదుగుదల ఉపాధి ఉద్యోగాలను సృష్టించేదిగా ఉంటే యువ భారత్‌కి ఉపయోగకరంగా ఉంటుంది.

# మనిషితనం మాయమైందా



సమాజం సహించలేని కొన్ని ఘటనలు ఆవేదన కలిగిస్తాయి. ఆగ్రహం రప్పిస్తాయి. చట్టాలెన్ని ఉన్నా ఆగకుండా సాగుతున్న అకృత్యాలపై ఏమీ చేయలేమా అన్న ఆక్రోశం రగిలిస్తాయి. కోల్‌కతా వైద్యశిక్షణార్థి 'అభయ' ఘటన నుంచి దేశం ఇంకా తేరుకోక ముందే, మహారాష్ట్రలోని థానే జిల్లా బద్లాపూర్‌లో పసిపిల్లల పాఠశాలలో నాలుగేళ్ళ వయసు చిన్నారులు ఇద్దరిపై పాఠశాల పనివాడి అమానుష కృత్యం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఆ ఘటన వివరాలు వింటుంటేనే మనసు వికలమవుతుంది. ప్రజా నిరసనల రీత్యా మహారాష్ట్ర సర్కార్ ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ఏర్పాటు చేసింది సరే, పిల్లలకు బడిలోనే భద్రత లేకపోతే ప్రతి ఒక్కరికీ విద్యాహక్కు గురించి చర్చిస్తే ఏమి లాభమన్న బొంబాయి హైకోర్ట్ తాజా వ్యాఖ్యలు నిష్ఠురమైనా నిజమే. ఇప్పుడిక ప్రతి స్కూలులో నెలరోజుల్లోగా సీసీ టీవీ కెమెరాలు పెట్టాలి, వారంలో మూడుసార్లైనా ఆ ఫుటేజ్‌ను పరిశీలించాలి లాంటి సర్కారీ ఆదేశాలు షరా మామూలే. కానీ, కోల్‌కతా నుంచి బద్లాపూర్ దాకా అన్నిచోట్లా రాజ్యవ్యవస్థ చేతిలో ప్రజావిశ్వాసం కుప్పకూలడం సమకాలీన భారత విషాదం. పసిపిల్లలపై అకృత్యం జరిగితే, ఆ తల్లితండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేయడానికి సహకరించడానికి బదులు సదరు 'ఆదర్శ విద్యాలయం' ఘటనను కప్పిపుచ్చేందుకు ప్రయత్నించడం విషాదం. విద్యాబుద్ధుల కోసం బడికి పిల్లల్ని పంపి, వారు అక్కడ భద్రంగా ఉంటారని భావించే కన్నవారికి ఇది భరించలేని కష్టం. పైగా, ఫిర్యాదు దాఖలుకు వారిని 11 గంటల పైగా వేచి ఉండేలా చేయడం దేనికి సంకేతం? ఇలాంటి ఘటనల్లో పాఠశాల వారినీ బాధ్యుల్ని చేస్తూ, 'పోక్సో' చట్టం కింద కేసు కట్టాలి. ఆ కనీస బాధ్యతను సైతం పోలీసులు విస్మరించడం క్షమించరాని దుర్మార్గం. చివరకు బొంబాయి హైకోర్ట్ ఆ లోపాన్ని ఎత్తిచూపాల్సి వచ్చింది. 'అభయ' ఘటనలోనూ అచ్చంగా ఇలాంటివే జరిగాయి. ఇలాంటి ఆటవిక చర్యలు ఎక్కడ జరిగినా జెండాలకు అతీతంగా రాజకీయ పక్షాలన్నీ ముక్తకంఠంతో ఖండించాల్సి ఉండగా, స్వీయ రాజకీయలబ్ధికై ప్రయత్నించడం సిగ్గుచేటు. కోల్‌కతా ఘటనపై రచ్చ చేసే పార్టీ బద్లాపూర్‌పై నోరు మెదపదు. త్వరలో ఎన్నికలు జరగనున్న మహారాష్ట్రలోని బద్లాపూర్‌పై హంగామా చేసేవారు కోల్‌కతా ఘటనపై కంటితుడుపుకే పరిమితమవుతారు. రాజ్యాంగబద్ధ హోదాలోని బెంగాల్ గవర్నర్ టీవీ డిబేట్లలో కూర్చొని రాష్ట్ర సర్కార్‌ను దూషిస్తూ ఇంటర్వ్యూలిస్తుంటే ఏమనుకోవాలి? సమాజం సిగ్గుతో తలదించుకోవాల్సిన ఘటనలపైనా నిజాయతీ వదిలేసి నీచ రాజకీయాలు చేస్తే దేశం ఏటు పోతుంది ఉవ్వెత్తున ఎగసిపడ్డ భారీ నిరసనల నేపథ్యంలో కోల్‌కతా అంశంపై సుప్రీమ్ కోర్ట్, బద్లాపూర్ ఘటనపై బొంబాయి హైకోర్ట్ తమకు తాము స్వచ్ఛందంగా విచారణ చేపట్టడమే ఒకింత ఊరట. న్యాయవ్యవస్థ పట్ల సామాన్యుల్లో మినుకు మినుకుమంటున్న ఆశాదీపానికి కోర్టు చొరవ ఒక చిన్న కాపుదల. ఇవాళ దేశంలో రోజూ 90 అత్యాచారాలు జరుగుతున్నాయి. ఆనక హత్య చేసి, అడ్డు తొల గించడాలూ పెరిగిపోతున్నాయి. నోరు విప్పి చెప్పుకోలేని వారి పట్ల నీచప్రవర్తనలూ పెచ్చరిల్లుతున్నాయి. మన మధ్యే మామూలు వ్యక్తుల్లా తిరుగుతున్న మానవ మృగాలను నిరోధించడం కఠిన సమస్యే. అయితే, మనసుంటే మార్గాలుంటాయి. మహిళలు, పిల్లల కోసం 'మినీ - పోలీస్ స్టేషన్ల'ను ఏర్పాటు చేయాలని మహారాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ సంఘం లాంటివి సిఫార్సు చేస్తున్నాయి. సుప్రీమ్ కోర్ట్ గురువారం బెంగాల్ సర్కార్‌కు ముక్కచీవాట్లు పెట్టిన నేపథ్యంలో సీఎం మమత సైతం తీవ్రతను అంగీకరించారు. అత్యాచార నేరాలపై అత్యంత కఠిన చట్టాలు చేయాలనీ, ఇలాంటి కేసుల్ని 15 రోజుల్లో పరిష్కరించేలా ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు పెట్టాలనీ ప్రధానిని కోరారు. అంతకన్నా ముందు సమాజంగా మనం ఆత్మశోధన చేసుకోవాలి. 2012 నాటి 'నిర్భయ' ఘటన తర్వాత కఠినచట్టాలు చేసినా పరిస్థితులు మారలేదంటే లోపం ఎక్కడున్నట్టు? వావివరుసలు లేవు, వయసులో చిన్నాపెద్దా విచక్షణ లేదు, చట్టం పట్ల భయభక్తులు అసలే లేవు. ఇలా ఉచ్చం నీచం మరిచి, చివరకు చిన్నారులపైనా మనుషులు మృగాలుగా మారడానికి దారి తీస్తున్న సాంఘిక, మానసిక పరిస్థితుల్ని లోతుగా అధ్యయనం చేయాల్సిన అవసరం ఉంది. మన వెనకాలే ఊడలు దిగుతున్న ఈ వికృత ధోరణిని పెంచి పోషిస్తున్న మన వినోద, వినిమయ సంస్కృతులు, వైయక్తిక ప్రవర్తనల్ని సమీక్షించుకోవాల్సి ఉంది. ఈ భూతాన్ని ఆపేదెలా అని సత్వరమే ఆలోచించాల్సి ఉంది. ఇప్పటికీ ఆడవాళ్ళను ఆటవస్తువులుగా చూసే సామాజిక వైఖరి, మగవాళ్ళు ఏం చేసినా చెల్లుతుందనే ఆధిపత్య భావజాలం లాంటి అనేక అంశాల్లో మనం మారాల్సి ఉంది. కోర్టుల చొరవ, ఆదేశాలతో రానున్న రోజుల్లో కోల్‌కతా కేసు, బద్లాపూర్ కేసులు త్వరితగతినే తేలితే తేలవచ్చు. నిందితులకు కఠిన శిక్షలూ ఖాయం కావచ్చు. కానీ, దేశవ్యాప్తంగా సంచలనమైన ఈ ఒకటి రెండు కేసుల్లోనే కాదు... వెలుగులోకి రాని వందల ఘటనలకు మూలకారణమైన మౌలిక అంశాలపై మనం ఎప్పటికి కళ్ళు తెరుస్తాం? సాక్షాత్తూ శిష్యులపై రేప్‌తో 20 ఏళ్ళ జైలుశిక్ష అనుభవిస్తున్న డేరా బాబాకు హర్యానాలో ఎన్నికల వేళ పదేపదే పెరోల్ ఇస్తూ పోతుంటాం. గత నాలుగేళ్ళలో 234 రోజులు ఆయన జైలు బయటే ఉన్నారు. మైనర్ బాలిక రేప్ కేసులో జీవిత ఖైదులో ఉన్న మరో బాబా ఆశారామ్ బాపూను ఆయుర్వేద చికిత్సకై తాజాగా బయటకు వదులుతాం. అన్ని వ్యవస్థలనూ నీరుగార్చి, అధికారం సహా అనేక బలహీనతలతో పాలకులు చేసే ఈ పాపాలన్నీ శాపాలు కాక మరేమవుతాయి? జనం మూడోకన్ను తెరవాల్సిన సమయం వచ్చింది.

# వేలెత్తి చూపితే సరిపోతుందా మనం మారొద్దా



తెలంగాణ రాష్ట్రంలో అవినీతి నిరోధక శాఖ వారు, బాధితుల కంప్లయింట్ ఆధారంగా అవినీతి అధికారులు నేరుగా డబ్బులు తీసుకుంటున్న సమయంలో పట్టుకొని రిమాండ్‌కు పంపడం జరుగుతోంది. రాష్ట్రవ్యాప్తంగా ఈ చర్యలు ముమ్మరంగా సాగుతున్నాయి. వారు అవినీతికి పాల్పడిన అధికారులు ఏ శాఖలో ఉన్నా వదలడం లేదు. అయినా అవినీతి, అధికారులలో పరువు పోతదనే భయం లేదు, లంచం తీసుకోవడం తమ హక్కులా భావించి యధేచ్ఛగా తమ కార్యకలాపాలు కొనసాగిన్నారు. లంచం తీసుకునే అధికారులని ప్రతి ఏటా అవినీతి శాఖ వారు పసిగట్టి పట్టుకుంటున్నప్పటికీ, అవినీతికి పాల్పడితే తప్పేంటి అన్న ధోరణి వారిలో కనబడుతోంది. రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన హైడ్రా (హైదరాబాదు డిజాస్టర్ రెస్పాన్స్ అసెట్ ప్రొటెక్షన్) అక్రమ నిర్మాణాలను చెరువు ఎఫ్.టి.ఎల్, బఫర్ జోన్‌లో పెద్ద పెద్ద నిర్మాణాలను సైతం కూల్చివేస్తున్నారు. అయితే హైడ్రా కూల్చివేతలు కొనసాగిస్తున్న నేపథ్యంలో అసలు చెరువు స్థలంలో ఆ నిర్మాణాలకి వివిధ శాఖల అధికారులు ఎలా అనుమతి ఇచ్చారనేది ప్రజల్లో ప్రశ్నార్థకంగా మారింది. ఇదంతా పక్కకు పెట్టి కొందరు ప్రజలు, నాయకులు, అధికారులు ప్రభుత్వాలను బదనాం చేస్తున్నారు. హైదరాబాదులోని చాలా చెరువులు ఆక్రమణలకు గురై కాలనీలుగా వెలసిన సంగతి మనకు తెలిసిందే. గొలుసు కట్టు చెరువులు ఒక చెరువు నిండిన తరువాత మరొక చెరువు నిండుకుంటూ లోతట్టు ప్రాంతాలలోకి వెళ్లీ ముఖ్యంగా మూసీనదిలోనే కలుస్తాయి. ఆ చెరువులు ఆక్రమ ణలకు గురై ఇళ్ల నిర్మాణాలు జరిగిన తరువాత నగరంలో కొద్దిపాటి వర్షం పడినా లోతట్టు ప్రాంతాలలో ఉన్న ఇళ్లలోకి వర్షపు నీరు వెళుతుంది. కొంతమంది ప్రజలు, నాయకులు, అధికారులు ఈ తప్పులు చేస్తూ ప్రభుత్వాలను బదనాం చేస్తున్నారు. గత ప్రభుత్వాలు హైదరాబాద్ నగరాన్ని అభివృద్ధి చేయడానికి పూనుకున్నప్పుడు రియల్ ఎస్టేట్ వ్యాపారం హైదరాబాదు నగర శివారులలో 1980 తరువాత బాగా ఊపందుకుంది. ప్రస్తుతం ఇళ్ల స్థలాలు సామాన్యునికి అందకుండా ఉన్నాయి. చెరువుల ఆక్రమణకు ప్రభుత్వాలు ఎన్ని చర్యలు చేపట్టినప్పటికీ హైదరాబాదులో పార్కులు, చెరువులు ప్రభుత్వ స్థలాలు కబ్జాలకు గురౌతున్నాయి. కొత్తగా వచ్చిన ప్రభుత్వాలు అక్రమ నిర్మాణాలను తొలగి స్తున్నప్పటికీ ఈ తంతు మాత్రం ఆగడం లేదు.

### అవినీతికి ఆధారం అదే...

ప్రభుత్వ పనుల నిర్మాణాలు జరిగిన తరువాత ఎంక్వైరీల పేరుతో చాలా కాలయాపన జరుగుతూనే ఉంటుంది. అయినా ఎవరు అధికారంలో ఉన్నా టెండర్లు పిలిచే విధానంలో పారదర్శకత ఉండదు. పేమెంట్ విధానంలో ఒక జవాబుదారీతనం ఉండదు. ప్రభుత్వ పనులు చేయాలంటే రాజకీయనాయకుల, అధికారుల చేతులు తడపాల్సిందే. అప్పుడు పనులలో నాణ్యత లేదని ఎవరూ నిరూపించలేరు. ఆ నిర్మాణాలు కూలిపోయినప్పుడు మాత్రం గత ప్రభుత్వం కోట్ల అవినీతికి పాల్పడిందని పెద్దపెద్ద అక్షరాలతో వార్తా పత్రికలు, టి.వీలు మొరపెట్టుకుంటాయి. కానీ ఒక విషయం మనం గమనించాలి. ఒక రోడ్డు గుంతలు పడినా, ఒక బ్రిడ్జి కూలిపోయినా, నిర్మాణం చేసిన కాంట్రాక్టరు బాధ్యత వహించాలి. కానీ ఆ కాంట్రాక్టు ఇచ్చిన ప్రభుత్వాలను బదనాం చేస్తాయి ప్రతిపక్షాలు. అంటే అక్కడ అవినీతి జరుగుతుంది కాబట్టి ఆ బదనాంను వాళ్లు మోస్తున్నారు. ఒక నాయకుడు ముందుకు వచ్చి ఆ నిర్మాణాలకు ఆ కాంట్రాక్టరుదే బాధ్యత అని ఎక్కడా చెప్పలేదు.

### బోలెడు చట్టాలు.. అమలు అసాధ్యం

ప్రజాస్వామ్య పాలనలో మనం రాసుకున్న రాజ్యాంగం ప్రకారం, మూడు బలమైన స్థంభాలైన శాసనవ్యవస్థ, పాలనా వ్యవస్థ, న్యాయవ్యవస్థ. నాలగవదైన మీడియా అన్నీ కలసి ప్రజలకు మంచిపాలన అందించాలి. శాసన వ్యవస్థ ప్రథమ కర్తవ్యం, దేశానికీ, రాష్ట్రానికీ అవసరమైన చట్టాల శాసనాలను చెయ్యడం. పాలనా వ్యవస్థ ముఖ్య కర్తవ్యం, చట్టసభలు చేసిన శాసనాలను అమలుపరచడం. భారత రాజ్యాంగం ప్రకారం పాలనా వ్యవస్థ దేశాన్ని సంక్షేమరాజ్యంగా చెయ్యడంలో ముఖ్య పాత్ర వహించాలి. ప్రభుత్వాలు శాంతిభద్రతలను కాపాడుతూ, ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరిచే అభివృద్ధికి తోడ్పడాలి. ప్రజల ధన, మాన, ప్రాణాలను కాపాడవలసిన బాధ్యత మనం నిర్మించుకున్న ప్రభుత్వాలదే. మరి ఎక్కడ లోపం జరుగుతోంది?

### తప్పులు చేస్తూ వేలెత్తగలమా

రోజురోజుకూ ప్రజలకు ప్రభుత్వాలపై విశ్వాసం తగ్గుతోంది. నాయకులపై నమ్మకం సన్నగిల్లుతోంది. ఒక అధికారి ప్రభుత్వం నుండి జీతం పొందుతూ ప్రజలకు ఎంతవరకు న్యాయం చేస్తున్నానని నిజాయితీగా చెప్పగలుగుతాడు? 'నేరం నాది కాదు ఆకలిది' అని తెలుగు సినిమాలో ఎన్టీఆర్ ఒక పాటలో 'మంచిని సమాధి చేస్తారా.. ఇది మనుషులు చేసే పనియేనా.. మనలో పాపం చేయని వాడు... ఎవడో చెప్పండి.. ఏ దోషం లేని వాడు ఎవడో చూపండి..'అని నిలదీస్తారు. ఒక మహిళ తప్పు చేసిందని కొట్టడానికి కొందరు పిడికిలితో రాయి పట్టుకొని ఉన్నప్పుడు మీలో తప్పు చేయనివారు ముందుగా ఆ మహిళపై రాయి వేయండి అన్న సందర్భంలో ఒక్కరు కూడా అక్కడ ఉండరు. అంటే ప్రస్తుతం అందరం ఏదో ఒక పాపం చేస్తున్నామని హీరో మేలుకొలుపుతాడు. మంచిని గ్రహించి ఎవరికి వారు తప్పులు చేయకుండా స్వీయనియంత్రణ కలిగిఉండటమే సజ్జనుని లక్షణం.

### సత్యమేవ జయతే గీటురాయి

మన రాజ్యాంగం 1950 జనవరి 26న అమల్లోకి వచ్చింది. ఎన్నో పరిశోధనలు, సమాలోచనలు, ప్రముఖులైన ప్రజా ప్రతినిధులతో కూడిన కమిటీ రెండేళ్ల 11 నెలల 18 రోజులు శ్రమించి 1949 నవంబరు 26న రాజ్యాంగ నిర్మాణసభలో ఆమోదించుకొని సభ్యుల వివేకంతో కూడిన ఆలోచనా ధోరణుల వలన రాజ్యాంగం రూపుదిద్దుకొంది. లిఖిత రాజ్యాంగాన్ని అందించిన డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ దానిని అమలుపర్చడంలో ఆయాకాలాల్లో అవసరాలకు అనుగుణంగా అందరి సభ్యుల ఆమోదయోగ్యంతో మార్చుకునేందుకు అవకాశం కల్పించారు. స్వాతంత్ర్య ఉద్యమ స్ఫూర్తితో సత్యం మాత్రమే విజయం సాధిస్తుందని విస్తృత ప్రచారంతో ముందుకెళ్లినప్పుడే ప్రభుత్వాలపై ప్రజలకు విశ్వాసం కలుగుతుంది. మన దేశ జాతీయ నినాదంగా స్వీకరించబడిన సత్యమేవ జయతే ప్రేరణతోనే మనం కోరుకుంటున్న సుపరిపాలన సాధ్యపడుతుంది.

## నామినేటెడ్ పదవులపై గంపెడు ఆశలు పెట్టుకున్న గుంటూరు జిల్లా నేతలు..



**అమరావతి,:** కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో.. నామినేటెడ్ పదవుల కోసం ఆ పార్టీలోనే సీనియర్ నేతలు గంపెడు ఆశలు పెట్టుకున్నారు.. టిక్కెట్ త్యాగం చేయడంతో.. కచ్చితంగా తమకి నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యత ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.. గుంటూరు జిల్లాలో 17 అసెంబ్లీ స్థానాలకు గాను కూటం అభ్యర్థులు 17 చోట్ల గెలిచారు.. కొన్నిచోట్ల వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నుంచి జంప్ అయిన నేతల సహకారం.. మరికొన్నిచోట్ల టిక్కెట్ త్యాగాలతో కూటమి అభ్యర్థులు బయటపడ్డారు.. మొదటి లిస్టులోనే తమకు ప్రాధాన్యత ఉంటుందని ఆ జిల్లాలో ఉండే సీనియర్ నేతలు భావిస్తున్నారట.. వాళ్ళ అనుచరులైతే.. పలానా పోస్టు మా నాయకుడికి వస్తుందంటూ ప్రచారం కూడా చేసుకుంటున్నారట.. సీనియర్ నేతలతో పాటు ద్వితీయశ్రేణి నేతలు కూడా నామినేటెడ్ పదవులపై ఆశలు పెట్టుకున్నారని ప్రచారం నడుస్తుంది.. ఐదేళ్ల కష్టానికి ప్రతిఫలం దక్కబోతుందంటూ.. తమ ప్రొఫైల్ని అధిష్టానానికి సైతం పంపారట.. అయితే సీనియర్ల తర్వాతే తమకు అధిష్టానం ప్రాధాన్యతీస్తుందని చర్చించుకుంటున్నారు.. నామినేటెడ్ పదవులను ఆశిస్తున్న వారిలో.. మాజీ మంత్రి ఆలపాటి రాజా, డొక్కా మాణిక్య వరప్రసాద్ , మాజీ ఎమ్మెల్యేలతో పాటు.. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నుంచి టిడిపిలో చేరిన మాజీ ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి, మాజీ మంత్రి ఉండవల్లి శ్రీదేవి ఉన్నారు. వీళ్ళందరూ కూడా రాష్ట్రస్థాయి పదవిని ఆశిస్తున్నారని వారి శిబిరం చెపుతుంది.. టిడిపిలో చేరే సమయంలో ఎమ్మెల్సీగా ఉన్న జంగా కృష్ణమూర్తి దానికి రాజీనామా చేసి టిడిపిలో చేరారు.. పార్టీ అధికారంలోకి వస్తే ఎమ్మెల్సీ ని కొనసాగిస్తామని టిటిడిలో బోర్డు మెంబర్ గా అవకాశం కల్పిస్తామని అప్పట్లో చంద్రబాబు హామీ ఇచ్చారట.. దాని ప్రకారం తనకి రెండు పదవులు వస్తాయని ఆయన ఆశిస్తున్నారు.. అలాగే ఉండవల్లి శ్రీదేవి కూడా ఎస్సీ ఎస్టీ మహిళా కమిషన్ పోస్ట్ కోసం విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారట.. డొక్కా మాణిక్య వరప్రసాద్ కూడా తన సామాజిక వర్గానికి చెందిన నామినేటెడ్ పోస్ట్ ఇవ్వాలంటూ చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారని గుంటూరు జిల్లాలో టాక్ నడుస్తోంది.. సీఎం చంద్రబాబు కూడా గుంటూరు జిల్లా పై ప్రత్యేక దృష్టి పెట్టారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.. సీనియర్ నాయకులకి మొదటి ప్రయారిటీ ఇవ్వాలని.. వారికి ఇచ్చిన మాట ప్రకారం సముచిత స్థానం కల్పించాలని ఆయన భావిస్తున్నారట.. తొలి విడత నామినేటెడ్ పదవులు గుంటూరు జిల్లాకే ఎక్కువ పదవులు ఉంటాయనేది పార్టీ వర్గాల సమాచారం.. మొత్తంగా ఎవరికి ఏ పోస్ట్ ఇస్తారో చూడాలి..

## రైతులు, జర్నలిస్టులపై దాడులు..
## డీజీపీకి ఫిర్యాదు చేసిన కేటీఆర్



హైదరాబాద్ : రాష్ట్ర డీజీపీ కార్యాలయంలో డీజీపీ జితేందర్‌ను బీఆర్ఎస్ నాయకులు శుక్రవారం మధ్యాహ్నం కలిశారు. తుంగతుర్తి రైతులపై, నిన్న సీఎం రేవంత్ సొంతూరు కొండారెడ్డిపల్లిలో జర్నలిస్టులపై జరిగిన దాడులపై డీజీపీకి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఫిర్యాదు చేశారు. దాడులకు పాల్పడ్డ వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ నేతలు డిమాండ్ చేశారు. కేటీఆర్ వెంట ఎమ్మెల్యేలు జగదీశ్ రెడ్డి, ముఠా గోపాల్, మాగంటి గోపీనాథ్, కాలేరు వెంకటేశ్‌తో పాటు పలువురు మాజీ ఎమ్మెల్యేలు, సీనియర్ నాయకులు ఉన్నారు. నిన్న కొండారెడ్డిపల్లిలో రుణమాఫీ కవరేజ్ కోసం వెళ్లిన మహిళా జర్నలిస్టులపై దాడి జరిగిన విషయం విదితమే. దోషులను గుర్తించి చట్టపరంగా తగిన చర్యలు తీసుకోవాలని మహిళా జర్నలిస్టులు కూడా డీజీపీని కలిసి వినతి పత్రం అందజేశారు. కాగా, రాష్ట్ర ప్రభుత్వం గొప్పగా ప్రచారం చేసుకుంటున్న రుణమాఫీపై రైతుల అభిప్రాయాలు తెలుసుకునేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్వగ్రామమైన ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని కొండారెడ్డిపల్లి వెళ్లిన మహిళా జర్నలిస్టులపై పట్టపగలే దాడి జరిగింది. కాంగ్రెస్‌కు చెందిన దాదాపు 150 మంది వారిని చుట్టుముట్టి అసభ్యంగా ప్రవర్తించారు. ఇక్కడ మీకేం పని అంటూ దౌర్జన్యానికి దిగారు. వారు రికార్డు చేసిన దృశ్యాలు బయటకు రాకుండా మెమొరీ కార్డులు లాక్కున్నారు. పట్టపగలు సినిమాల్లోని వీధి గూండాలను తలపించారు. పోలీస్ స్టేషన్‌లోనే ఒక వ్యక్తి.. జర్నలిస్టుల్లో ఒకరిపై దాడికి యత్నించాడు. అయినా పోలీసులు చోద్యం చూశారు. దీంతో బాధిత జర్నలిస్టులు శుక్రవారం డీజీపీని కలిసి పరిస్థితిని వివరించారు.

## ఉక్రెయిన్లో మహాత్మాగాంధీ విగ్రహానికి మోడీ నివాళులు..



హైదరాబాద్ : భారత ప్రధాని మోడీ ఉక్రెయిన్లో పర్యటిస్తున్నారు. ఒక రోజు పర్యటన నిమిత్తం ఆయన ఇవాళ ఉదయం ఉక్రెయిన్కు చేరుకున్నారు. రష్యా-ఉక్రెయిన్ దేశాల మధ్య సుదీర్ఘకాలంగా యుద్ధం కొనసాగుతున్న నేపథ్యంలో ప్రధాని ఉక్రెయిన్ పర్యటనకు వెళ్లడం చర్చనీయాంశంగా మారింది. ఉక్రెయిన్ అధ్యక్షుడు వ్లాదిమిర్ జలెన్స్కీతో సమావేశంలో ప్రధాని మోదీ ఏం మాట్లాడుతారనే దానిపై ప్రస్తుతం సర్వత్రా ఆసక్తి నెలకొన్నది. ఉదయం ఉక్రెయిన్ రాజధాని కీవ్కు చేరుకున్న మోడీకి అక్కడి భారత సంతతి పౌరులు ఘన స్వాగతం పలికారు. మువ్వన్నెల జెండాలను ప్రదర్శిస్తూ ప్రధానితో కరచాలనం చేసేందుకు పోటీపడ్డారు. ఉక్రెయిన్ రాజధాని కీవ్లో ఉన్న జాతిపిత మహాత్మాగాంధీ విగ్రహానికి ప్రధాని నివాళులు అర్పించారు. పూలు చల్లి పుష్పాంజలి ఘటించారు. కాగా, ఈ సాయంత్రం ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీతో ప్రధాని భేటీ కానున్నారు. ఇరుదేశాల ద్వైపాక్షిక అంశాలతోపాటు, రష్యా-ఉక్రెయిన్ యుద్ధం విషయం కూడా వారి సమావేశంలో చర్చకు వచ్చే అవకాశం ఉన్నది.

## ఖర్గే, రాహుల్ గాంధీతో తెలంగాణ సీఎం రేవంత్ భేటీ



దిల్లీ: ఏఐసీసీ కార్యాలయంలో కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అగ్రనేత రాహుల్ గాంధీతో తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి భేటీ అయ్యారు. సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పలువురు మంత్రులు, సీనియర్ నేతలు పాల్గొన్నారు. పీసీసీ అధ్యక్షుడి మార్పు, మంత్రివర్గంలో మార్పులు-చేర్పులు, పెండింగ్‌లో ఉన్న నామినేటెడ్ పోస్టుల భర్తీపై ఈ భేటీలో చర్చ జరుగుతున్నట్లు సమాచారం. పీసీసీ కొత్త అధ్యక్షుడి ఎంపిక, మంత్రివర్గ విస్తరణపై గతంలో పలుమార్లు చర్చలు జరిగినా కొలిక్కి రాలేదు. ముఖ్య నాయకుల మధ్య ఏకాభిప్రాయం కుదరకపోవడంతో వాయిదా పడుతూ వచ్చింది. మంత్రివర్గంలోకి ఆరుగురిని తీసుకునే అవకాశం ఉండగా, ప్రస్తుతం నలుగురికి చోటు కల్పించవచ్చని తెలుస్తోంది. మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి, కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, వాకిటి శ్రీహరి ముదిరాజ్, మల్‌రెడ్డి రంగారెడ్డి, ప్రేమ్‌సాగర్‌రావు, వివేక్‌లలో నలుగురికి అవకాశం లభించవచ్చని భావిస్తున్నారు. పీసీసీ అధ్యక్ష పదవికి బీసీల నుంచి మహేశ్‌కుమార్‌గౌడ్, మధుయాస్కీగౌడ్, ఎస్సీల నుంచి సంపత్‌కుమార్, లక్ష్మణ్‌కుమార్, ఎస్టీల నుంచి ఎంపీ బలరాంనాయక్‌ల పేర్లు పరిశీలనలో ఉన్నాయి. ఎస్సీలకు అవకాశం ఇవ్వాలనుకుంటే వర్గీకరణ తీర్పు నేపథ్యంలో లక్ష్మణ్‌కుమార్‌కుబీ ఎస్టీలకు ఇవ్వాలనుకుంటే బలరాంనాయక్‌కుబీ బీసీలకైతే మహేశ్‌కుమార్‌గౌడ్‌కు ఎక్కువ అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. సామాజిక సమీకరణాలను పరిగణనలోకి తీసుకొని మంత్రివర్గం, పీసీసీ చీఫ్, డిప్యూటీ స్పీకర్, చీఫ్ విప్.. ఇలా అన్ని పదవులపై చర్చించి తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉన్నట్లు సమాచారం.

# చైనా-ఐరోపా వాణిజ్య పోరు!



డోనాల్డ్ ట్రంప్ గత ఏలుబడిలో చైనా మీద ప్రారంభించిన వాణిజ్య యుద్ధం కొనసాగుతుండగానే మరోసారి ఎన్నికలు వచ్చాయి. ఒక వేళ ట్రంప్ గెలిస్తే అనే భయం అమెరికాలో మొదలైంది.దానికి ఇంకా వ్యవధి ఉంది. ఈ లోగా ఐరోపా యూనియన్ మరోవాణిజ్య పోరుకు తెరలేపింది. చైనా నుంచి దిగుమతి అవుతున్న విద్యుత్ వాహనాలపై దిగుమతి పన్ను మొత్తాన్ని పదిశాతంగా ప్రస్తుతం ఉన్నదాన్ని గరిష్టంగా 36శాతానికి పెంచి త్వరలో అమలు చేయనుంది. 'మీ పని ఇట్లా ఉందా మా తడాఖా చూడండి' అంటూ ఐరోపా నుంచి దిగుమతి చేసుకుంటున్న జున్ను, ఇతర పాల ఉత్పత్తులు, మద్యంపై ప్రతికూల చర్యలు తీసుకొనేందుకు చైనా కూడా సమరశంఖం పూరించింది. తెగేదాకా లాగితే వాణిజ్యపోరు మరిన్ని వస్తువులకు విస్తరించటం ఖాయం. 2018 నుంచి 2023వరకు వివరాలను చూస్తే జర్మనీ, అమెరికా, జపాన్, ఫ్రాన్స్, దక్షిణ కొరియాలు అన్నీ కలసి చేసిన విద్యుత్ వాహనాల ఉత్పత్తి కంటే చైనా (పదమూడు మిలియన్లు) ఎక్కువగా చేసింది. దిగుమతులతో ఈ దేశాల్లో ఉన్న వినియోగదారులు ఎంతో లబ్దిపొందుతున్న ప్పటికీ స్థానిక కంపెనీలు పోటీలో నిలవలేకపోవటంతో వాటి ప్రయోజనాలను కాపాడేందుకు ప్రభుత్వాలు రంగంలోకి దిగాయి. పెట్రోలు, డీజిల్తో నడిచే వాహనాలను విద్యుత్ వాహనాలను కనుమరుగుచేసే విధంగా మార్కెట్ పెరుగుతున్నది.చైనా ప్రభుత్వం ఇస్తున్న సబ్సిడీల కారణంగా తమ సంస్థలు దెబ్బతినటమేగాక కార్మికులకు ఉపాధి కూడా పోతున్నదని అమెరికా, ఐరోపా దేశాలు గగ్గోలు పెడుతున్నాయి. దిగుమతి పన్ను, సబ్సిడీల గురించి చైనా-ఐరోపా యూనియన్ మధ్య జరిగిన సంప్రదింపులు విఫలం కావటంతో ఎవరికి వారు రక్షణాత్మక చర్యలు చేపడుతున్నారు. గతంలో విధించిన దిగుమతి పన్నుల కారణంగా చైనాకంటే ఎక్కువగా అమెరికా వినియోగదారుల మీదనే భారం ఎక్కువగా పడినట్లు తేలింది. అందువలన పక్కనే ఉన్న మెక్సికోలో చైనా కంపెనీలు ఉత్పత్తులను ప్రారంభించి ఎగుమతులు చేస్తూ దిగుమతి పన్ను తప్పించుకుంటున్నాయి. దీంతో మెక్సికోతో ఉన్న ఒప్పందం గురించి అమెరికా పునరా లోచనలో పడింది. స్థానికంగా ఉత్పత్తి గురించి కేంద్రీకరిస్తున్నప్పటికీ కార్పొరేట్ సంస్థలు ఎక్కడ చౌకగా శ్రామికశక్తి దొరికితే అక్కడికే వెళుతున్నాయి తప్ప అమెరికాలో ఏర్పాటు చేయటం లేదు. ఐరోపాలో కూడా అదే స్థితి. కాలుష్య నిబంధనలు కఠినతరంగా ఉండటం మరొక కారణం. ఐరోపా ఎగుమతి చేస్తున్న జున్ను, ఇతర పాల ఉత్పత్తుల్లో చైనా వాటా పన్నెండుశాతం ఉంది. విద్యుత్ వాహనాలకు ప్రతిగా అది ప్రతికూల చర్యలకు దిగితే తమ పరిస్థితి ఏమిటని ఆ కంపెనీలు, దేశాలు ఆందోళన చెందుతున్నాయి. ఈ కారణంగానే ఐరోపా సమాఖ్యలో చైనాతో వాణిజ్య పోరుకు ఏకీభావం కూడా లేదు. కొద్ది నెలల క్రితం జరిగిన ఓటింగ్లో దిగుమతి పన్నుల పెంపుదలను పన్నెండు దేశాలు సమర్ధించగా నాలుగు వ్యతిరేకించాయి, పదకొండు ఓటింగ్కు దూరంగా ఉన్నాయి. ఈ పూర్వరంగంలో ఇప్పుడు పన్నుల పెంపుదల గురించి ఒక నిర్ణయం తీసుకున్నప్పటికీ దాని అమలు అనేక ప్రశ్నలను ముందుకు తెస్తున్నది.ప్రాథమికంగా ఒక కారుధర 30వేల యూరోలుంటే ఇప్పుడు పదిశాతం(మూడువేల యూరోలు)గా ఉన్న దిగుమతి పన్ను సగటున 30శాతానికి పెరిగితే పదివేల యూరోలు భారం పడుతుంది. ఐరోపాలో ఇప్పుడిది ఒక చర్చగా మారితే అమెరికాలో మరొకటి మొదలైంది. ఒకవేళ అధ్యక్షుడిగా ట్రంప్ గెలిస్తే మరింతగా వాణిజ్యపోరు విస్తరిస్తుందనే భయం నెలకొన్నది.వస్తున్న వార్తల ప్రకారం పరిస్థితి ఎటుబోయి ఎలా ఉంటుందో తెలియదు గనుక ఎన్నికలకు ముందే భారీ ఎత్తున చైనా నుంచి విడిభాగాలు, వస్తువుల దిగుమతికి పూనుకున్నారు. వాటి మీద ఆధారపడిన పరిశ్రమల విస్తరణ నిర్ణయాలను వాయిదా వేస్తున్నారు. గాల్వన్ లోయ ఉదంతాల తరువాత మన దేశం ప్రత్యేకంగా పేరు పెట్టకుండానే భూ సరిహద్దు ఉన్న దేశాల నుంచి వచ్చే పెట్టుబడుల మీద అనేక ఆంక్షలు విధించిన సంగతి తెలిసిందే.తాజాగా వెలువడిన వార్తలను బట్టి ఎలక్ట్రానిక్, విద్యుత్ వాహనాల రంగంలో నేరుగా లేదా పరోక్షంగా చైనా కంపెనీల పెట్టుబడులను అనుమతించాలని, వాటితో ఒప్పందాలకు ఆమోద ముద్ర వేయాలని మనదేశంలోని కార్పొరేట్లు ప్రధాని నరేంద్రమోడీ మీద తెస్తున్నట్లు, దానికి అంగీకరించినట్లు చెబుతున్నారు. అదే జరిగితే మనదేశాన్ని చైనా వాహనాలు ముంచెత్తటం ఖాయంగా కనిపిస్తోంది.ఐరోపా, అమెరికాలో ఇప్పటికే ఆ పరిస్థితి ఏర్పడిన కారణంగా అక్కడి ప్రభుత్వాలు చైనాతో వాణిజ్యపోరుకు దిగాయి.

# ఈ దౌత్య మంత్రంతో శాంతి ప్రభవించేనా



ఇది యుద్ధానికి సమయం కాదు. యుద్ధభూమిలో పరిష్కారాలు కనుగొనలేం. ఇది భారతదేశం తీసుకున్న స్పష్టమైన, స్థిరమైన వైఖరి. రష్యా, ఉక్రెయిన్ రెండింటితో గణనీయమైన స్వతంత్ర సంబంధాలను భారతదేశం కలిగి ఉంది. ఈ రెండు దేశాల మధ్య 30 సంవత్సరాల క్రితం ఏర్పడిన దౌత్య సంబంధాల తర్వాత ఉక్రెయిన్‌లో భారత్ ప్రధాని చేస్తున్న మొదటి పర్యటన ఇది. ఈ పర్యటన ఇరు దేశాల మధ్య దౌత్య సంబంధాలను, వర్తక, వాణిజ్య, వ్యవసాయ, ఔషధ రంగాలలో చారిత్రాత్మకంగా నిలిచిపోగలదు. ప్రపంచ వ్యవహారాల్లో భారతదేశ పాత్ర, ప్రాముఖ్యత ఇటీవల గణనీయంగా పెరిగాయి. 'భవిష్యత్ తరాల శ్రేయస్సు కోసం శాంతి అవసరమని, తుపాకులు, బాంబులు, బుల్లెట్ల మధ్య పరిష్కారాలు అంత సులభం కాదని అందుకే మనం చర్చల ద్వారా శాంతి మార్గాన్ని అనుసరించాల'ని మోడీ పలు సందర్భాల్లో విభిన్న విశ్వ వేదికలపై ప్రకటించారు. రష్యా- ఉక్రెయిన్ విషయంలో కూడా ఇదే విషయాన్ని పలుమార్లు తెలియజేశారు. ఈ నేపథ్యంలో మోడీ, వొలొదిమిర్ జెలెన్స్కీ మధ్య చర్చపై యావత్ ప్రపంచం ఎదురు చూస్తోంది.

### ద్రవ్యోల్బణం పెరగడంతో..

ఉక్రెయిన్‌పై రష్యా దాడి కీలకమైన వస్తుసేవల సరఫరాపై మరింత ఒత్తిడి తెచ్చింది. ఖర్చులు మరింత పెరిగాయి. ద్రవ్యోల్బణ రేట్లు వేతన వృద్ధిని మించిపోయాయి. ఈ జీవన వ్యయ సంక్షోభం ప్రపంచవ్యాప్తంగా ప్రజల ఆరోగ్యాన్ని శ్రేయస్సును తగ్గించింది, ముఖ్యంగా అత్యంత పేదలకు కరువు ప్రమాదాన్ని పెంచింది. ఈ దేశాలు ప్రపంచంలోనే అతిపెద్ద గోధుమ ఎగుమతిదారులుగా ఉన్నాయి. గోధుమ ఎగుమతులలో మూడవ వంతు (36%)కి బాధ్యత వహించాయి. ఈ రెండు దేశాలూ ప్రపంచంలోని పొద్దుతిరుగుడు నూనెలో సగానికి పైగా ఎగుమతి చేసేవి. రష్యాపై తీవ్రమైన ఆర్థిక ఆంక్షలు అంతర్జాతీయ మార్కెట్లో ఇంధన ధరలలో మరింత పెరుగుదలను ప్రేరేపించాయి. వస్తుసేవల సరఫరా గొలుసులలో ఉత్పత్తి, నిల్వ, రవాణా అనేవి ప్రతి దశలోనూ ఇంధన ఖర్చులను జోడిస్తాయి కాబట్టి, మరింత ద్రవ్యోల్బణం పెరిగింది. పెరుగుతున్న ఇంధన ధరల వల్ల యూరోపియన్ యూనియన్ దేశాలు అత్యధిక నష్టాలను చవిచూశాయి. తూర్పు యూరప్ దేశాలు వాణిజ్య సంబంధాల ద్వారా ఎక్కువగా ప్రభావితమయ్యాయి.

### ఇదే దేశం ఆకాంక్ష!

2022 జనవరి నుండి పాశ్చాత్య దేశాలు ఉక్రెయిన్‌కు 380 బిలియన్ డాలర్ల కంటే ఎక్కువ సహాయాన్ని అందజేశాయి. పైకి గాంభీర్యాన్ని ప్రదర్శిస్తూ సైనిక, ఆర్థిక సహాయం అందజేసే దేశాలు అంతర్గతంగా తీవ్ర వ్యతిరేకతను ఎదుర్కొంటున్నాయి. పైగా ఆర్థికంగా ఆయా దేశాలపై భారం గణనీయంగా పెరిగింది. రష్యా కూడా ఈ సైనిక చర్యను అత్యంత తేలికగా తీసుకున్నప్పటికీ నానాటికి ఈ సమస్య దానికి కొరకరాని కొయ్యగా తయారైంది. సమస్యను పరిష్కరించుకోవటానికి తాను సిద్ధమని తెలియజేసినా రష్యా షరతులకు తలొగ్గబోమని ఉక్రెయిన్ భీష్మించుకుని కూర్చొంది. ఈ యుద్ధం మరింత కాలం కొనసాగితే అది ఇరు దేశాలకూ ప్రమాదకరమే. దీర్ఘకాలిక ప్రయోజనాలు, ఆర్థిక పరిస్థితి, ప్రజల జీవన విధానం ఉపాధి, విద్య, వైద్య తదితర రంగాలపై తీవ్ర ప్రభావాన్ని చూపుతాయి. అమెరికా అధ్యక్ష ఎన్నికలలో సైతం రష్యా, ఉక్రెయిన్ యుద్ధ నివారణపై చర్చ నడుస్తోంది. ఈ సమస్యకు పరిష్కారం కోసం ప్రపంచ దేశాల మద్దతు కూడగట్టి ముగింపు పలకాలన్నది వారి కార్యాచరణ. ఈ దిశగా కృషి చెయాలని ప్రపంచ దేశాలు భారత్‌ని కోరుతున్నాయి. అలీన విధానం, పంచశీల సూత్రాలకు కట్టుబడ్డ భారత దౌత్యం ఎప్పుడూ శాంతికాముకమే వసుధైక కుటుంబంలా సుఖశాంతులతో ప్రపంచం వర్ధిల్లాలి అన్నది భారత ఆకాంక్ష. ప్రపంచ దౌత్యయవనికపై భారతీయ దౌత్యం సతతం శాంతి కాంతులని వెదజల్లుతుంది.

# పంటలపై కోతులు, వీధుల్లో కుక్కలు!



తెలంగాణ ప్రజలు రోజువారీ జీవితంలో ఎదుర్కొంటున్న అతి ప్రధాన సమస్యలు ఏమిటి అని ప్రశ్నించుకుంటే మొదటి ఐదింట్లో ఖచ్చితంగా కోతులు, కుక్కల వల్ల ఎదురవుతున్న ఇబ్బందుల ప్రస్తావన వస్తుంది. సమస్య తీవ్రతను గుర్తెరిగి నేను శాసనమండలిలో దీన్ని లేవనెత్తాను, సత్వరమే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని అభ్యర్థించాను. జంతువులు వైరస్‌ని తీసుకువెళతాయి. అవి మనుషులకు సోకితే జరిగే విపత్కర పరిణామాలకు అంతు ఉండదు. దీన్నో సామాజిక సమస్యగా గుర్తించాలి. రాజకీయ పార్టీలు, సామాజిక సంస్థలు, ప్రజా సంఘాలు కలిసికట్టుగా కృషి చేయాలి. కోతుల బెడద పంటలపై కూడా ప్రభావం చూపుతున్నది. కొన్ని ప్రాంతాల్లో రైతులు పంటల తీరును మార్చుకున్నారు. వేరుశెనగ, పచ్చి శెనగలు, కూరగాయలు, ఇంటి తోటలు, ఇళ్లలోని పండ్ల చెట్లు వంటి పంటలను కోతులకు భయపడి రైతులు వదులుకున్నారు. ఈ జంతువులు ఇప్పుడు ధాన్యం ఏర్పడే ప్రారంభ దశలో వరిని తింటున్నాయి. చాలామంది రైతులు తాము కోరుకున్న పంటలను సాగు చేయలేకపోతున్నారు. సాగు చేస్తున్న పంటల ఉత్పాదకతను కోల్పోతున్నారు. కోతులు, ఇతర జంతువుల కారణంగా వ్యవసాయ ఉత్పాదకత మొత్తం నష్టం సంవత్సరానికి కనీసం రూ.5వేల కోట్ల నుంచి రూ.10వేల కోట్ల వరకు ఉండవచ్చు. ఉదాహరణకు వేరుశెనగ ఉత్పత్తి విలువ రూ.2000కోట్లకు దగ్గరగా ఉంటుంది. కోతుల బెడదతో చాలామంది రైతులు ఆ పంటను చాలా ప్రాంతాల్లో వదిలేశారు. ఈ జంతువులు పత్తి పంటను కూడా వదలడం లేదు. కాబట్టి ఈ జంతువుల వల్ల ఆర్థిక నష్టం దాదాపు రూ.10వేల కోట్లకు చేరువలో ఉంటుంది. రైతులకు ఎంత నష్టం వాటిల్లిందో అంచనా వేయడానికి సరైన సర్వే చేపట్టాలి. తెలంగాణలో కోతుల కాటు కారణంగా ప్రతి ఏటా అనేక మరణాలు కూడా నమోదవుతున్నాయి. హైదరాబాద్ నగరంతో సహా గ్రామాలు, పట్టణాలు అనే తేడా లేకుండా కోతులు, కుక్కలు మనుషులపై దాడులు చేస్తూనే ఉన్నాయి. పిల్లలు ఆడుకోవడానికి వెళ్లడానికి జంకుతున్నారు. వృద్ధులు వీధుల్లో ఒంటరిగా నడవడం లేదు. వీటి బెడద సాధారణ జనజీవనానికి ఇబ్బందిగా మారింది. కోతుల, కుక్కల నుంచి రక్షణ కోసం రాష్ట్రంలో ప్రతీ వ్యక్తి ఎంతో కొంత ఖర్చు పెట్టాల్సి వస్తున్నది. కోతుల నుండి రక్షించడానికి ఇంటి చుట్టూ సోలార్ ఫెన్సింగ్ వేసుకోవాల్సి వస్తున్నది. సోలార్ ఫెన్సింగ్ వేలాది రూపాయల ఖర్చుతో కూడుకున్నదైనప్పటికీ, కొన్నిసార్లు ఫలితం కూడా ఇవ్వదు. కొన్ని చోట్ల కోతులను బెదిరించి పంపడానికి కొండెంగలను కూడ తీసుకొచ్చారు కానీ, ఆ ప్రయోగం కూడా పెద్దగా ఫలించలేదు. ఈ సమస్యకు తక్షణ, దీర్ఘకాలిక పరిష్కారం వెతకడం అనివార్యం. ఈ ముప్పును నివారించే చర్యలను ప్రారంభించే ముందు ప్రభుత్వం కొన్ని పనులు చేయాలి. వివిధ జిల్లాల్లో సమస్య తీవ్రత, ప్రభావంపై సర్వే నిర్వహించాలి. సమస్యను పరిష్కరించేందుకు అన్ని రాజకీయ పార్టీలు కమిటీలో ఉండేలా అన్ని పార్టీల శాసనసభా పక్ష బృందాన్ని ఏర్పాటు చేయాలి. ఈ కమిటీ క్రమం తప్పకుండా పరిస్థితిని సమీక్షించాలి. సరైన అధికారాలతో ప్రత్యేక మంకీ కమిషన్‌ను ఏర్పాటు చేయాలి. ఈ సమస్యను తొలగించే వరకు దానిని ఎదుర్కోవడానికి నిధులను అందించాలి. సర్వే పూర్తయిన తర్వాత ఆడ, మగ కోతులకు సామూహిక స్టెరిలైజేషన్ చేయించాలి. స్టెరిలైజేషన్ తర్వాత సదరు కోతి, కుక్కకు గుర్తింపు సంఖ్య ఇవ్వాలి. మళ్లీ అదే కుక్క, కోతి పట్టబడితే మళ్లీ స్టెరిలైజ్ చేయాల్సిన అవసరం ఉండదు. రేబిస్ మరియు ఇతర వ్యాధులను తగ్గించడానికి టీకాలు ఏకకాలంలో వేయాలి. ప్రతి మండలానికి కనీసం ఒకటి చొప్పున సురక్షితమైన పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేయాలి. స్టెరిలైజ్ చేసిన కోతులను ఓపెన్ ఎన్‌క్లోజర్‌లలో ఉంచవచ్చు, తద్వారా ఆసక్తి ఉన్న వ్యక్తులు వాటిని సందర్శించి ఆహారం ఇవ్వవచ్చు. కుక్కల యాజమానులపైన కూడా నియంత్రణను అమలులోకి తీసుకురావాలి. కుక్కను పెంపుడు జంతువులుగా ఉంచుకోవాలనుకుంటే దాని యజమాని ఇతరులకు ఎటువంటి గాయం కాకుండా ఉండేందుకు నియమాలు, నిబంధనలను అనుసరించటాన్ని తప్పనిసరి చేయాలి. తెలంగాణ ప్రజలను భయభ్రాంతులకు గురిచేసేవి వీధికుక్కలు. అందుకే వీధుల్లో కుక్కలు కనిపించకపోవడమే లక్ష్యంగా పనిచేయాలి. తెలంగాణలో కోతుల, కుక్కల సమస్యకు కచ్చితమైన పరిష్కారం కనుక్కోవాల్సిన తక్షణ ఆవశ్యకత ఉంది. దీన్నో సామాజిక సమస్యగా గుర్తించాలి. పరిష్కారానికి అన్ని పార్టీలు, సామాజిక సంస్థలు, ప్రజా సంఘాలు కలిసికట్టుగా కృషి చేయాలి.

